
UNIVERSAL LIBRARY
OU_204776
UNIVERSAL LIBRARY

# సర్వస్వామ్యసంకలితము

వెల రూపాయి

బెజవాడ, ఆంధ్రగ్రంథాలయముద్రాక్షరశాలయందు
కుందా లక్ష్మీనరసయ్యగారిచే
ముద్రితము

౧౯౩౬



గ్రంథకర్త.

# కృతజ్ఞత

ఇంతకుమున్ను వెలువడిన గద్యానువాదము సేఁతకుఁ బ్రధానాధారము. కాన తత్కర్తలగు శివరామశాస్త్రిగారికిని, ముద్రణవ్యయమునఁ గొంత సాయపడిన విశ్వదాత నాగేశ్వరరావుగారికిని, నా వేఁడికోలు మన్నించి మున్నుడి వ్రాసియిచ్చిన కవిగారికిని, సందియమ్ములఁ జెక్కుంటిఁ దూలించిన పాటియాజ్జ వఙ్గమూడి వేంకటరత్నముగారికిని వినయపూర్వకనమస్సులు.

కవయిత

# అభిప్రాయములు

౧

తమచేరచియింపఁబడిన "ఆత్మకథ"ను చదివి ఆశ్చర్యమును, ఆనందమును జెందితిని. విషయము గాంధీమహాత్ముని స్వీయచరిత్రము. లోకారాధ్యమైనది. సర్వజనాదరణీయమును, సేవ్యమును. తను శైలి ఇంచుమించు ఆంధ్రమహాభారత ప్రతిబింబము. ఇంతకంటె నెక్కువగాఁ జెప్పుటకు సాధ్యముకాదు; అవసరమును లేదు.

పూర్వమట్లు నేను ప్రకృతము తెలుఁగు గ్రంథములఁ జదువుట లేదు. కాలము కఱవు. శక్తియు తఱుగుడు స్థితిలో వ్రాలినది. అవధానము నానాముఖములఁ బ్రవర్తిల్లఁజేసితినేని ముఖ్యకార్యములకు ముప్పువాటిల్లును. కానఁ బంపినపుస్తకముల నన్నింటినిఁ జదువుట నాకు సులభముగాని గుణముగాని కానేరదు. అట్లున్నప్పటికిని మీగ్రంథము దానియొక్క ఆకర్షణశక్తిచేత నన్ను వదల నిచ్చినదికాదు. చదివి అనందించునట్లు చేసినది.

మీరుధన్యులరు. మాతృభాషయొక్క సుకృతముల ఫలమనఁ దగినకావ్యమును, పూజనీయమైన విషయ శోభితమును, తదనుగుణమైనరీతిని వ్రాసి స్థిరయశస్సున గాంచిన కవులని మిమ్ము అయాచితముగఁ బ్రశంసించి నాకుతూహలమును తమకు నివేదించుచున్నాను.

కట్టమంచి రామలింగారెడ్డి

౨

విశ్వసందేశమును సాహిత్యమున వెలయించు పట్టున కవిత్వ మీశ్వరాంశము. ఇట్టి వైశిష్ట్యమును ఆంధ్రకావ్య ప్రపంచమున ప్రథమమున శ్రీకారము చుట్టినవి "సౌందర నందము" ఇప్పుడి "ఆత్మకథ" పద్యకావ్యము.

ఇతివృత్తముంగూర్చి యేకతం బాడుకవికి "విశ్వమానవ కల్యాణవిధివిధాత" యగు గాంధిమహాత్ము చరిత తలంపున మెఱయుట అతనిపుణ్యమే విరియుటకాదు. తెలుగుజగము పుణ్యమే విరిసెను.

"మా తిక్కనయజ్వలు త్రొక్కిన త్రోవ కేను సమ్మతి వడెదన్" అని చౌదరిగారు శపథించి నెగ్గినారు. మహా కావ్యరచనకు సర్వాధికారముగల భాషాప్రభుత్వమును అనర్గళకవితాధారయు ఈపాత్రమునం దెల్లెడల ప్రకాశించుచున్నవి.

కృష్ణాపత్రిక (౨౭–౩–౩౭)

౩

మీరుపంపిన "ఆత్మకథ" చదివితిని. మిక్కిలిచక్కగా నున్నది. నిర్దుష్టముగానున్నది. విస్తరమేల? పీఠికలోని యంశములతో నేకీభవించుచున్నాఁడ. మీరు విద్వత్కవి శ్రేణిలోనివారు.

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి

(తొలిపలుకు)

# "ఆత్మకథ"

పలుకులు వందలకొలఁది కలవు. కాని అందు కొన్నియే మేటిపలుకు లనుపేరొందఁగలిగినవి. మన తెనుఁ గిప్పటికిని అట్టి వానిలో లెక్కకువచ్చుకలిమికి నోచుకొనలేదు. ఏల? అని అర యుచో మేలివ్రాఁగమి లేమియే దానికి కతమని తేటపడును. మేలివ్రాఁగమి అన మేలిపొత్తములమొత్తమే. మేలిమిబంగా రమువంటివి మేలిపొత్తములు. వాని అరయికగీటు పెఱపలుకుల వారు తమపలుకులలోనికి వానిని మార్చుకొనుటయే. అట్టి అర యికకు ఆఁగి వన్నెకెక్కినదికదా మహాత్మునిగుజరాతి "ఆత్మ కథ". ఇది పలువురు తమపలుకులలోనికి మార్చుకొని వానికి వన్నె తెచ్చుకొనిరి. అట్టిచో దీనిని తెనుఁగులోనికి కూడ మార్చుట మనపలుకునకు వన్నె తెచ్చుట కాదా? ఇంతకుముందే ఇది వచనముగా వెలసి ఇపుడు పద్దెపురూపునసైతము వెల యుట తెనుఁగునోచిన మేలినోముపంటయే

ఈపద్దెపు 'ఆత్మకథ'ను మహారాజశ్రీ తుమ్మల సీతా రామమూర్తిచౌదరికవిగారు బ్రహ్మశ్రీ శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి వచనపు 'ఆత్మకథ' ననుసరించి రసవంత ముగ వ్రాసిరి. ఇందు సాధారణముగా పద్యకావ్యము లను

వానియందువలెనే కొన్ని వచనపుముక్కలును కలవు. ఇందలి కృత్యాది క్రొత్తది.

శ్రీచౌదరిగారు అచ్చతెనుఁగువారు; ఇపుడు బాపట్ల 'హైస్కూలు'లో తెనుఁగుపండితులు. చిన్ననాటనుండియు పెక్కుకబ్బములు వ్రాసినవారు. వీరికి నాటినుడులయందు మన్నన మెండు. లాక్షణికరూపములయం దాదరము హెచ్చు. అట్లయ్యు వాడుకనుకూడ పాటించువారు కాన సంస్కరణమునకును వీరు కొంతవఱకు అనుకూలురే. తెనుఁగుమఱుఁగులు వాడుటకు వీరు వేడుకపడుదురు. ఈమెఱుఁగెఱుంగుట తెనుఁగువారికి పాడి అని వేఱే చెప్పనేల? తమపలుకుతల్లిమీఁదనేకాక తమనాటిమీఁదను వంగడముమీఁదను పెద్దలమీఁదను కూడ చౌదరిగారికి మన్నన మిన్న. ఇది ఎంతయు మెచ్చఁదగిన మెఱుఁగు.

మనచౌదరిగారిది కావూరు. దానిదగ్గఱిదే 'వినయాశ్రమము' వెలయుపట్టు. అందు 'విశ్వసందేశంబు' అను పున్నెపుచోట సొంపుమీఱు గాంధి 'శిలాస్తంభపుటరఁగుపై' కూర్చుండి ఏదేని మహాకావ్యంబు వ్రాయుతలంపునకతకై తలపోయునెడ గాంధిమహాత్ముని మనుగడ తట్టెనఁట. వింత ఏమి? పుట్టునాటిపై మన్ననకల చౌదరిగారికి ఇట్టిమన్ననకలవారిలో కన్నాకగు గాంధిజీ బ్రతుకుకత నచ్చె; ఈపొత్తపు మగటా పైకి వచ్చె

కాని శ్రీ శివరామశాస్త్రిగారు వచనముగా 'ఆత్మకథ' వ్రాసియుండ ఇది మరల వ్రాయనేల? అని ఎవరేస అడుగవచ్చుననియు, అనువాదమే నిరసింపవచ్చుననియు ఊహించి చౌదరిగారు,

"ఎల్లరు గద్యమే చదువ నిచ్చవహింపరు పద్యమన్న సం
ధిల్లును వేడ్క పెక్కురకు ......"అనియు,"

"పద్యంబు సర్వకవితల
కాద్యంబై గానబద్ధమై శ్రుతిహితమై
హృద్యంబై నియతం బన
వద్యంబై లెస్స తోడువడు ధారణకున్" అనియు,

"అనువాదంబ కదా పో
మ్మని పెదవిన్ విఱువఁబోకుఁ డయ్యది యసదా
పనిగా; దంకును బద్యం
బునఁ బల్కుట దెప్పరంబు బుధుఁ డిది యెఱుఁగున్." అనియు,

తామే ఇది వ్రాయుటకు కతములు తెలిపిరి. ఇంతకు వ్రాసినది బాగుగా ఉన్నదా? లేదా? అని చూడసగుఁ గాని ఇచ్చకువచ్చినది వ్రాయునపుడు ఎవరినిగాని ఎవ రడ్డఁగలరు? తగుతగములు వారివారి డెందములకు తట్టవలెఁ గాని పెఱ వారితలంపు లెవరి నేమి చేయఁగలవు? కాన కానిదానికై ఎవరు గాని పెనఁగులాడనేల? అయిన, ఈయనకవిత్వ మంతరసవంత ముగా ఉండునా? అని కొందఱు సందియ మందవచ్చును. తినఁ బోవుచు రుచి అడుగనేల ? చౌదరిగారి కెట్టికవిత్వ మింపో కనుఁడు.

"తెలుఁగునకు స్వస్తిసెప్పిన
తెలుఁగుకవిత్వంబు వల్కఁ దియ్యము నాకున్
గలుగద; మాతిక్కనయు
జ్జ్వలు తొక్కినత్రోవ కేను సమ్మతివడెదన్"

అని తెనుఁగునకు పెద్దపీట మిచ్చిన తిక్కనసోమయాజి దారిని పోవుటయేగాక,

"పుట్టె కొక్కబుద్ధి పుట్టు జిహ్వాగ్ర నొక్క
రుచి జనించు నంట రూఢి; యైన
సరసులెల్ల మెచ్చ మెఱయింతుఁ గవితలోఁ
గమ్మఁదనము మత్కులమ్మునవలె."

అని చెప్పుకొనఁగలిగి, కమ్మఁదనమును శ్లేషించి, కమ్మఁదనము కడుకమ్మఁగా మెఱయించి, నేర్పుచూప నోపిన నెఱవాదులు చౌదరిగారు! అంతేకాదు; అంతకుమునుపే కవిత్వము చెప్పఁదగువారిం గూర్చి ముచ్చటించుచు,

"మధురతాపూర్ణ కావ్యనిర్మాణచణుఁడు
నేలవేల్పైననేమి చండాలుఁడైన
నేమి పూజ్యుండపో యతం డెల్లరికిని
అప్పకవి యీర్ష్యచే నెదో సెప్పెఁగాని."

అని అప్పకవిపెట్టుకుమాటకు ఒప్పిదముగా మాఱు చెప్పఁగలిగినవారు చౌదరిగారు!' నిజమునకు కాపు కమ్మ రెడ్డి తెలఁగ వెలమ మున్నగు అచ్చతెనుఁగువారిలో ఎవరో కాని పెక్కురు తమపలుకుతల్లిని సరిగా కొలువపూనమిచేతను, ఏకొలఁదిమందియో తప్ప హెచ్చుగా పాఱులే మేరమీఱి సంస్కృతపునుడులు వాడి తెలుఁగుపొత్తములు వ్రాయుటచేతను, అపక్వవి అటుల వ్రాయఁగలిగెఁగాని, లేనిచో అతఁ డంతమునుకుగా నుడువఁగలఁడా? ఇప్పుడేని అచ్చతెనుఁగువారు— తెనుఁగు

గడ్డమీఁద మొదటినుండియు ఉండిన తెగలవారు— తెనుఁగు బాగుగా చదివి, అందలియింపుసొంపులు తేటపడ మేలిపొత్తములు వ్రాయుదురుగాక!

ఎవ రేది వ్రాసినను అది చదువుట కింపుగా ఉన్నదా? లేదా? చదువరులకు మేలుచేయునా? లేదా? అనియే చూడ నగు.

కాన మనచౌదరిగారిపొత్తము, పై అరయికరాతిగీఁతలకు నిలుచునో నిలువదో కొంచెము పరికించి చూతము.

మొదట చూడవలసినది కైకొనుకత. దీనినిగూర్చి ఎవరుగాని చులకనగా మాటలాడ . వీలులేదు. జగంబునందెల్ల ఇపుడున్న మేటివారిలో మేటి అనఁదగు గాంధిమహాత్ముఁడు,

"జగమ్మునెదుట నానడవడులెల్ల నిడితి నేని
గొంత మే లుండు దాన నం చెంతు నేను"

అనికదా దీనిని గూర్చి వ్రాసె. అట్టిచో పెఱవారు కతనుగూర్చి వంకలుపెట్టఁగలుగు టెట్లు? అందుచేతనే కృతికర్త,

"గుణగరిష్ఠుల దేశభక్తులచరిత్ర
చెప్పుట జగద్ధితం బైన చేఁతగాదె?"

అని నిబ్బరంబుగా వక్కాణింపఁ జాలె. ఇంతకు అరసి చూడ 'ఆత్మకథ' ఎట్టిది? మహాత్ముఁ డేమిచెప్పెనో చూతము:

"నారచించెడి దాత్మచారిత్రమా? కాదు!
కాదు! నే నెపుడు నిక్కంబుఁగూర్చి
కడఁగి సల్పినప్రయోగంబులే కద!..."

"అట్లగుట నిచ్చరిత్ర సత్యప్రయోగ
మనెడి నామాంతరంబుతో నలరుచుండు
నింక సత్యభిన్నము లంచు నెంచుకొనెడి
బ్రహ్మచర్యాదులుం బల్కఁబడెడి నిందు"

కాన సత్యప్రయోగములను గూర్చియు బ్రహ్మచర్యాదులను గూర్చియు మేలుకోరువా రెల్లరును తెలిసికొనవలదా? అయినను మహాత్ముఁడు వీనినిగూర్చి ఏమనెనో కనుఁడు.

"ననుఁ గడుం బరికించుకొంటిని సమస్త
భావములఁ గూర్చి యవధానపటిమ వెలయఁ
దీవ్రపరిశోధన మొనర్చితిని సతంబు
నైన నివియె సిద్ధాంతంబు లనుట కొల్ల"

ఇట్లుకదా ఉండవలయు నిజమరయువారి అడంకువ! కాని ఇది మనవారిలో ఎందఱకు ఎంతవఱ కబ్బినది? తమ్ము తాము పరికించుకొని ఇది సరిగా గడించుకొన కడంగుదురుగాక! ఇఁక సత్యాదులంగూర్చి యిందేమి కలదో కొంతకనుగొందము:

**సత్యము:**

"సత్యంబ నా కెల్లవానికంటె నుత్తమంబు. దానంబెక్కుగుణమ్ములు లీనమ్ములై యున్నయవి. సత్యంబన కేవలము వాచికమేగాక మానసికంబు సయితమ్మయి యుంటవలయు."

ఇటుల నిరుకు చేసికొనుటచే గాంధీజీ ఈ క్రింది తెఱంగున చెప్పుకొనఁగలిగె:

"బొంకాడితియెఱుఁగ నెన్నఁడు"

"ప్రక్కనున్న వానిపలుకను దిలకించి
నకలు వ్రాయు టెఱుఁగ నొకదినంబు"

"కన్నఁ బ్రాము టెఱుఁగ నెన్నండు నొజ్జల
నీతిమాలి గురులచేత నొక్క
మాటపడుట నాదుమతమునకుఁ దవ్వు
పట్టువడితి నాకు నిట్టి నడత"

"నిత్యంబు హరిశ్చంద్రు
స్తుత్యపథం బూని గుణనిధుల్ జయవెట్టన్
సత్యంబువల్కు జను లా
న్నత్యముఁ గనరాదె? యని మనంబున నెంతున్"

ఇటుల నిబ్బరముగా చెప్పుకొనఁగలవారు పిల్లలలోఁగాని పెద్దలలోఁగాని ఎందేని ఎంద ఉన్నారు? ఈ గొప్పతనము గాంధిజీకే దక్కినది! కావుననే ఆయన మహాత్ముఁడయ్యె. పగఱకును నమ్మఁదగువాఁడయ్యె.

ప్రధానము :

"తొలుతొల్తఁ బిల్లలతలిదండ్రు లుద్వాహమునకునై కావించికొనెడినియమము." దీనినిబట్టి మన తెనుఁగునాటియందు వలెనే క్షత్త్రియనాడులో ప్రధానముచేయునాచారము కలదనుట తెల్లము. ఇంతే కాదు; తరువాతి పెండ్లితంతులెల్లను సరిగా ఇచ్చటివలెనే జరుగునట్లును కానవచ్చును.

"విందుల వింతల మేళము
లం దాళమ్ములను బట్టలం బాఁతల నె
న్నందగునగానాణెమ్ములఁ
గ్రిందుగ సమకూర్తు రహమికల్ చెలరేఁగన్"

తల్లిదండ్రులకొలువు :

"ఇంక నెఱుఁగనైతి నే సుఖమంతయు
నీఁగి కన్నవారి కెల్లవగలఁ
దగుసపర్యసేఁత ధర్మవు లన్నింటఁ
బ్రథమగణ్య మన్నపాడి తెఱఁగు.

తల్లిదండ్రులను కొలుచుట మొదటిపాడి అని చిన్న నాట ఎఱుంగకుండియు పిదప అది ఎఱిఁగి వారిని "మాతృదేవో భవ" "పితృదేవో భవ" అను ఉపదేశములనుబట్టి గాంధిజీ కొలిచి ధన్యుఁడయ్యె. ఇపుడు మనలో కొందఱుబిడ్డలు- ఇంగ్లీషు చదువుకొనినవారిలో పెక్కురు—తలిదండ్రులను నిరసించి తిట్టి కొట్టువారు కలరు. అట్టివారు మహాత్మునినడత చూచిఅయినను తమతప్పు దిద్దుకొనుట మేలు.

పెండ్లముపై దొరతనము:

"హెచ్చులొచ్చులు లేక మాయాడు తుల్య
మైన నేమాయె! నించుకయేని మసల
కేను సాగింప దొరఁకొంటి నింతిమీఁద
దొరయెఱుంగని గరువంపుదొరతనంబు''

పాపము! చిన్ననాఁడు మోహనదాసుఁడును నలుగురి మగలతోఁడివాఁడే అయ్యో. ఇఁక పెఱమగలు తమపెండ్లములపై నల్లేరుమీఁదిబండ్లగుటలో చోద్య మేమి? ఈలోటుకలవారు దీనిని ఆలోఁగించుకొందురేని హాయిగా మనుగడ కడపఁగలరు.

ఏకపత్నీవ్రతము :

“ఏకస్త్రీవ్రతచర్య ధర్మములలో నెచ్చంచు వ్రాయంబడెన్”

ఇనుపపెట్టెలోని డబ్బువలె పాత్రములోని ధర్మమును వాడుకలోనికి వచ్చి మేలుచేసినపుడే లెక్కింపఁదగినది. గాంధిజీ వ్రాఁతలోని ధర్మమును నడవడిగా మార్చి,

“అది ముద్రవోలె నామది
నదికె మఱిన్ సత్యదాస్య మది నావ్రతమై
కుదురుకొనియుండుటన్ బర
సుదతీస్నేహము నభఃకుసుమ మగు నాకున్”

అని చెప్పుకొనఁగలిగె. ఇట్టిమగవారు—నూటికికాదు, కోటికి—ఎందరున్నారో! విచ్చలవిడి వలపు తలకొనిన యీ పిదపతఱిని? అయినను గాంధిజీయును,

“నాసతి నే శాసించిన
నాసతి నా కాజ్ఞయిచ్చు టర్హంబకదా;
యీసత్యమ్ము నెఱుంగక
చేసితి మగపెత్తనంబు చేడియమీఁదన్”

అని తనతప్పొప్పుకొనె. దీనిలోనేకల దాయనగొప్పతనము! ఇట్లు తమ తమ తప్పులను అందఱును ఒప్పుకొని,

దిద్దుకొనుచో జగమెల్ల హాయికి ఆటపట్టు కాదా? ఇది వట్టి అడియాస! అడ్డమగుకడగండ్లపాలగుచున్న నేటిజగమ్మే దీనికి తార్కాణం.

మంచినడత:

“శీలమ్మునయం దన్యుఁడు
వేలు మడచి చూప నెట్టివీలును గలుగం
జాలని లీలఁ గడుంగడు
మేలుకొని చరింతుఁ బ్రీతిని మేషమునందుర్”

ఈనడత ఎల్లర కొజ్జబంతి కాదా? అయిన ఇది చూచి పట్టి వ్రాసికొనువారు కలరా? ఉండినను వ్రేళ్ళలోనే లెక్కకు వత్తురుగాని అంతకంటె హెచ్చుగా వత్తురా?

సాము:

“విద్యావిధానంబునందు మానసికశిక్షకెంతప్రాధాన్యం బుండు నంతయు శారీరకశిక్షకు వలయు ననునర్థంబు నేఁ డెఱింగితి”

“నడకయే నాకు వలయు దేహదార్ఢ్యంబుం బ్రసాదించె”

ఇది యెఱిఁగి దీనినిబట్టి నడచి మనవారు మేలొందఁదగు.

వ్రాఁత:

“వంకరటింకరవ్రాఁత యసమగ్రమగువిద్యకు గుర్తని నే నూహింతు”

“ముద్దుగుల్కునాణిముత్యాలపోలిక
వ్రాలు వ్రాయునేర్పు వడయుకొఱకు
నన్నుఁ జూచి యెల్లపిన్నలు శ్రద్ధ వ
హింత్రు గాక! కడురహింత్రుగాక!”

అని తనవ్రాలుమాలికకు వగచి, తమ్ముఁబట్టినగఘునకు లోనుకాకుండునట్లు చేయఁగోరుగాంధిజీకోరిక తీర్చి, తాము సంతసింపఁగడంగుట తమపాడి అని చదువుకొను పిల్లలు గ్రహింతురు గాక!

సంస్కృతము:

“.............నిత్యము కంఠపాఠముగ
జంతన యున్నఁగాని యది చిక్కద!”
“హైందవబాలికాబాలకు లెల్లరు గీర్వాణభాషం దప్పక
నేర్వవలయునని నాయాశయమ్ము”

అని ఒకచో అనుభవమును, మఱొకచో ఆదర్శమును తెలిపె. రెండును పాటింపఁదగినవే.

భారతదేశభాషలు :

“భారతదేశంబునం దున్నతవిద్యావిధానంబున దేశభాషయు,
హిందీ సంస్కృతంబులుం, బారసియు, నరబ్బియు, నాంగ్ల
మ్మును బాఠ్యములగునట్లొనర్చుట యవశ్యాచరణీయమ్మని
నాతలంపు”

“ఇన్ని బాసలఁ బఱియించు టెట్లటంచు
జంకఁ బనియుండ దొక్కభాషను సమగ్ర

పాండితి గడించినం బెఱబాసలెల్లఁ
గరతలామలకంబు లౌఁ గాదె మనకు?"

అని మహాత్ముఁడు తెలిపె. అన్నిపలుకులయందును తల్లిపలుకే ముందుగా నేర్చుకొనఁదగినదని ఆయన ఇప్పుడును తెలుపుచుండుట నిజమే. కాని, అది పాటించువా రేరీ? "తెను గెఱుఁగక సంస్కృతంబు తెన్నె మెఱుఁగుఁ" అను మాట లోని కిటుకు తెలిసికొని, మానవాళు తల్లిపలు కగు తెనుఁగు సరిగా చదువుకొందురేని పిదప ఓపికకొలందిని మఱెన్నిపలుకు లైనను సులువుగా చదువుకొనవచ్చునని గుర్తింతురుగాక!

చెడుచెలిమి - చెప్పుడుమాటలు :

"పోలఁతుకకు నాకు నెడఁదలఁ బొరపు పుట్టు
నితనిపొత్తొకహేతువై వెతలఁ గుడిపె"

చెడుచెలిమివలన చెడునడత అబ్బుటయే కాక, ఆలుమగలకు పొరపుసైతము కలుగును. కాన, చెడ్డవారితో చెలిమి చేయరాదు; వారిమాటలు నమ్మరాదు. చుట్ట బీడీ సిగరెట్లు కాల్చుట, డబ్బులేనిచో వానికొఱకు దొంగతనముచేయుట, చెడిపెలయిండ్లకేగుట మొదలగుచెడుపనులకు దారిచూపునది చెడుచెలిమియే. మహాత్ముఁడు కావలసినవాఁడు కావున మోహనదాసగాంధి చెడలవాండ్లదారినుండి తప్పించుకొనఁ గల్గెఁగాని, తక్కినవా రెందఱు వీనికి బానిసలై ఉండుటలేదు? మోతీలాల్ నెహ్రూపండితునంతటివాఁడు సిగరెట్టుకాల్చు నలవాటు వదలఁ జాలకపోయె! గాంధిజీ అన్ననో తానుచేసిన దొంగతనము

తండ్రికి తెలిపి మానుకొనె! ఆయనవలె నడచుకొనఁగలవా రెందఱున్నారు ?

**వలపుగుడ్డితనము:**

"...ఏకపత్నీవ్రతాలంబి
నయ్యుఁ గామాంధుఁడ నటంచు నాత్మ నెంతు"

అని తన్ను తానే తెగడుకొనునట్లు చేయఁజాలె గాంధిజీ వంటివానినే వలపుగుడ్డితనము! ఇఁక పెఱవారిలెక్క ఏమి? కాన దానికి చిక్కకుండ చూచుకొనవలె.

**తన్ను తానెఱిఁగెడి యెఱుక!**

"మతసంబంధిపరిబోధంబు నాకిసుమంత యేని పాఠశాలయందు లభింపదయ్యె.........మతంబన నాత్మసాక్షాత్కారం బనియొండె, నాత్మజ్ఞానం బనియొండె నాయాశయమ్ము"

ఇది ఇప్పుడును బడులలో అబ్బుట సున్నయే. కోవెలలయునికియు ఇంచుమించుగా అట్లులే ఉన్నది. ఇంతటితో సరిపోయిన మేలే. అవి పెక్కు లిప్పుడు ఎఱుకమాలినపనుల కాటపట్టు లయినవి! ఇది పెద్దలోటు. దీనిని తీర్చుటకు నాటిమేలుకోరువారందఱును ప్రయత్నింపనగు.

**రామనామము :**

"ఈనాఁడు రామనామంబు నాకప్రతిహతంబగునోషధి..."

ఎందఱు కల రిట్టినిబ్బరముకలవారు? వెక్కిరించువారున్నారు పెక్కురు.

మతసహనము :

"అఖిలమతసంప్రదాయమ్ములందు నాకుఁగుదిరె సమదృష్టి"

ఇదే ఎఱుకకు మేలిగుర్తు; కాని, ఇదికలవారు మిక్కిలి తక్కువగా ఉన్నారు. పెక్కురున్నచో ఇప్పటిపోరాటములు పెక్కులు పుట్టెడివే కావు. ఇప్పటికైనను మనవారు మతసహనము నేర్చుకొని హాయిగా మనెదరుగాక !

నాస్తిక్యము :

"ఇంచుక నాస్తిక్యముఁ బ్రాప్తించెను నాకపుడు"

అపుడు అది ఇంచుకయే కాని ఇపుడు పెచ్చుపెరుఁగుచున్నది. ఇంగ్లీషు చదువుకొనినవారిలో పలువురు దీనివలలో చిక్కినవారే. అందు ఎలప్రాయమువారు దీని బానిసలు. వీరికి తగినయెఱుక కలిగింప పాటుపడువారు కానరాకున్నారు.

కీడునకు మేలు :

"...'కీడొనర్చిన మేలు నాచరింపు'
మన్న సూక్తి జీవనసూత్రమయ్యె నాకు"

ఇది ఒక గుజరాతినీతిపద్యమున కలదఁట. ఈపట్టున,

"చంపఁదగినయట్టి శత్రువు తనచేతఁ
జిక్కెనేని కీడుచేయరాదు
పొసఁగ మేలుచేసి పొమ్మనుటె చాలు
విశ్వదాభిరామ! వినుర వేమ!"

అను వేమన తెనుఁగుపద్దెము విలువ మనవారు గుర్తించి దానిననుసరించి నడతురేని 'అహింసా పరమో ధర్మః' అను

పాడిని పాటించినవా రగుదురు. గాంధిమహాత్ముని అనుసరించి నవా రగుదురు.

**సీమకు పోవుట :**

“మాంసమును మెక్క మద్యంబు మరగ నెపుడు
నంగనం దాఁక”

అని బాసచేసినపిమ్మటనే గాంధిగారికి ఆయనతల్లి ఇంగ్లాండునకు పోవ సెలవొసంగె. దీనివలన సీమకు పోయినవా రీమూఁడింటిబారికి చిక్కక వచ్చుట కడింది అనికదా తేలును. మద్యమాంసములమాట అటుండ, మగువలను పెండ్లి యాడువారె పెరుఁగుచున్నారు. వారికొఱకు పెండ్లిచట్టము మార్చవలె ననుచున్నారు! సీమచదువువలన లాభము లుండు ననుకొన్నను తమవారికి దవ్వగుట మేలని తలంప నగునా? కాన సీమకు చదువుకొఱకు పోవువారు బ్రహ్మచర్యవ్రతము గాంధిజీవలె పూనుట పాడికాదా?

**వెచ్చపులెక్క :**

“ఏ నపుడు వెచ్చపెట్టిన యెల్లడబ్బు
నకు విసువులేక లెక్క వ్రాసికొనువాఁడ
ననుదినంబును శయనించు నవసరమున
నిలువ సరిచూచుచుందు నిర్ణిద్రమతిని”

ఈలెక్క సరిగా వ్రాసికొనుట ఎంతో మంచిఅలవాటు. దీనివలన పొదుపును, మన్ననయు కలుగును.

**నంజుడుతిండి :**

"......మానవుండు తక్కినప్రాణుల
కంటె వలంతియైనకతన నతఁడు
చంపఁదగదు వాని సంరక్షగావింప
వలయు......"

అని సీమలో నంజుడు తినరాదని పొత్తములు వ్రాసిన వారు తెలిపిరి. ఇదియుంగాక,

"మానవున కతనిశరీరనిర్మాణంబు ననుసరించి చూడఁ బక్వాహారంబు త్యాజ్యం బనియు, నాయుర్వేదముంబట్టి యూరుఁగాయ లుప్పుఁబచ్చడులు తాలింపులు మున్నగునవి వర్జ్యంబు లనియు నెల్లరికి నాకుబువ్వ చేరికలోని దనియుఁ జౌకయనియుఁ దద్గ్రంథకర్తలు సవిమర్శముగ నిర్ణయించిరి"

ఇవి "నాయనుభూతికి లోనయ్యె" అని గాంధిజీ చెప్పుచున్నాఁడు. ఇట్టిచో బుద్ధిమంతులు దీని ననుసరించి నడచుట మేలుకదా!

**టీ కాఫీలు :**

"టీ కాఫీ లారోగ్యనాశకంబులు" అని గాంధిజీ వానిని వదలివేసెనఁట. ఇప్పుడు మనవారేమిచేయుచున్నారు? ఆరోగ్యము పోవుచున్నను వానిని వదలకపోవుటయే కాక నానాఁటికి హెచ్చించి త్రాగుచు డబ్బును ఒడలును పాడుచేసికొను చున్నారు. ఇప్పుడైన అవి విడువ యత్నింతురా? బాగుపడుదురా? ఏమో! ఏమియు చెప్పఁజాలము.

బిడియము :

"నాబిడియంబపో నాకు డాలయ్యె"

అని మహాత్ముఁడు చెప్పుకొనఁజాలె. కాని ఇపుడు బిడియములేనివారే తమ్ముఁ తాము గొప్పవారుగా తలంచువారు పెక్కురు కానవచ్చుచున్నారు. అట్టివారు తమతలంపు తప్పని దిద్దుకొందురా? ఏమిచేయుదురో చూడవలె.

బొంకు :

"పూని బొంకనుపుంటి నిప్పోలిక మూల
ముట్టుగాఁ గత్తిరించితి"

గాంధిజీవంటివాఁడు తనకు పెండ్లి అయినను మొదట కాలేదని బొంకి తుదకు నిజముచెప్పివేసె. ఇట్టిచో సీమకు వెళ్లి తక్కిన మననాటివారిమాట చెప్పవలసినదేమి? సీమకు పెద్ద చదువులు చదువుటకు పోవువారు పలువురు నేర్చుకొనున వేవో చూచితిరా? మాంసముతినుట; మద్యముత్రాగుట; బొంకుట! ఇవి నేర్చుకొనినవారే ఇటకు తిరిగివచ్చి పెద్దఉద్యోగములు చేయువారు! వీరివలన ప్రజలకు ఎట్టిమేలు కలుగునో దేవునికే ఎఱుక! ఏమైనను సీమకు వెళ్ళుమనవారు మెలఁకువతో మెలఁగి చెడక తిరిగిరా ప్రయత్నింతురుగాక! హెచ్చరింపఁదగు.

అహంకారము:

"మానవుం డెపుడు తనసాధనాబలంబున కహంకరించు నపుడ తద్బలంబు నిర్మూలం బగునని యెఱుంగవలయు నిట్టి వేళలందు •శాస్త్రజ్ఞానముకంటె ననుభూతి పరమావశ్యకము."

దీనివలన అహంకార మెట్టిదుర్గుణమో గుర్తించి దానిని చంపుకొనఁజను.

ఈశ్వరుసాయము:

"వెరవులు సకలంబు విఫలమైనపుడు
తోడున్నవారెల్లఁ దొలఁగినయప్పు
డవకాశ మంతయు నడఁగారినప్పు
డెట్టులో చేకూరు నీశ్వరుసాయ
మే ననుభుక్తిచే నెఱిఁగితిం దీని"

ఇది అనన్యభక్తులకే తెలియఁదగినది.

స్తుత్యుపాసనాప్రార్థనంబులు:

"స్తుత్యుపాసనాప్రార్థనంబు లంధవిశ్వాసంబులు గావు. అన్నపానాదులకంటె నయ్యవి కడుంగడు సత్యంబులు"

"మోకరించుటయు వేఁడికోలును గుడ్డినమ్మికలు గావని నాయాశయంబు. మఱియు నాభక్తులు మోకరించుట నిరర్థకమ్మగు పాషాణమునకా? కాదు కాదు! తదర్థమైన భగవంతునకు. వా రిట్టివిగ్రహారాధనంబుచే భగవన్మహిమను గుంచక పెంచుచున్నా రనియు నాతలంపు"

చూచితిరా మహాత్మునిభక్తి పెంపు? తెలియనివారు భక్తులను నిరసింపకుండుట యైనను మొదట నేర్చుకొనుచో పిదప తాము బాగుపడి భక్తులుకాఁగలరు. దైవభక్తిలేని విద్యార్థు లిది గుర్తించుట మేలు.

## భారతదేశచరిత్ర:

"ఔర! భారతదేశచారిత్రమైన నీ వెఱుఁగ వైతివి కదా! యింతవట్టు" అని "ఫ్రెడరిక్ పిన్‌కట్"అను సుప్రసిద్ధాంగ్లేయన్యాయవాది 'బారిష్టరు'పట్టాపొందినగాంధిజీని అనెనఁట. చూచితిరా విద్యావిధానపుసొంపు? నీళ్లకునీళ్లు; ప్రసాదమునకు ప్రసాదము. ఏది చదివిన అదే కాని మఱొకటి చదువుట జరుగదు. ఈలోటు పెద్దది; దిద్దుకొనవలయునది.

'ఆత్మకథ'వలన చదువరులు నేర్చుకొనఁదగినది ఎంతయో కలదు. ఇట మచ్చుగా కొంతచూపితిని. ఇట్టిది చక్కనిపద్యములుగా వ్రాయుటవలన ఎంతమేలు చేకూరునో వేఱే చెప్పవలయునా ?

ఇఁక, చౌదరిగారు తమప్రతిననుబట్టి తిక్కనతొక్కిన త్రోవను మెఱయించినకమ్మఁదనము మఱికొంత చవిచూతము:

"వీరుల్ త్యాగులు దేశభక్తులు జగద్విఖ్యాతకీర్తిప్రభా
శ్రీరోచిష్ణులు బుద్ధశంకరశివాజీగాంధిగంగాధ రా
న్సారీముఖ్యులు పుత్రులే జననికిన్ జన్మించి రగ్గౌరవా
ధారన్ భారతమాత నెంతుఁ జరితార్థత్వంబు నర్థించుచున్"

ఈపద్యము చౌదరిగారికి భరతఖండముపై నున్నమన్ననయే కాక అన్నిమతములయెడ కూడ వారికి కల మన్ననను తెలుపుచు, ఎడఁదపఱపును చాటుచున్నది.

"భారతంబును బల్కు పనిఁ బూని తిక్కన్న
పసిఁడిగంటము కేలఁ బట్టునాఁడు"

౩,౪ పొరటలు.

అనుపద్దెము తెనుఁగుతల్లియందు ఉండవలసినగౌరవము వెల్లడించుచున్నది.

"ఇంచుక నేర్పులేక......" ౬ ప.

ఇది కుకవినిరాకృతి అయినను ఇందు వారిమేలు కోరుటలో కడుంగడు నాజూకుతనము చూపినారు చౌదరిగారు.

"కుటిలశాత్రవకోటిగుండియల్...కమ్మవారు" ౭ ప.

ఇందు ఒక్కొకఅడుగు కమ్మవారిమెఱుఁగులు మెఱుపులవలె మెఱయించుచున్నది.

"అతనికిఁ గల్గె..................."

"బ్బిజ్జోడు కయ్యావా రాట యుచితమె కద" ౮ ప.

"జనియించె నతని....................అతనికి నాత్తనయుఁడు రమణాభిధుండు తనయుండయ్యెఁ" ౮ ప.

"నిత్యసత్యాలాప...నివ్వటిల్లిననారయ్య కెవ్వరీడు"
౧౦ ప.

"పెపల్లెదీపించు కేపల్లెసీమలో..."కావూ"రనంగ"
౧౨ప.

"ఎవనిపుట్టువు......నాతలంపున మెఱసెఁ బుణ్యాంబు
విరిసె" ౧౩ ప.

"పొగడఁదగుకతల......డిందనిబత్తిఁ" ౪౭ ప.

"ఈరీతినెతల హైందవ......మదినమ్మగుర్వఁ" ౯౩ప.

"సలిలంబు నీకు......గెల్చుఁబో! యిజ్జగంబు"
౧౨౩, ౧౨౪ ప.

"ధర్మేతరంబు సధర్మంబుచేత...మాతనిక్రొనఁగు"
౨౦౧, ౨౦౨ పొ.

"ఊడనిఁబాడితి......జడిగొనెఁజెమటల్" ౨౦౭ పొ.

ఇవి యీపాత్రపుగనియందలి కొన్ని యెంపుఁకెంపులు. వీనినిబట్టి చౌదరిగారికైత చవులూరించుటలో ఎంత మేటియో చదువరు లెఱుంగనగు. ఇందు తిక్కనసుడికారంపుప్రోడతనంబును, పెద్దన్న అల్లికజిగిబిగియును, నందితిమ్మన్న ముద్దుపలుకులును జేరి, ఒండొంటితో వియ్యమందినవి.

ఏపాత్రమునఁగాని కతతరువాత ఎన్నఁదగినది కైతనేర్పు. ఇందు మనచౌదరిగారు అందె తొడిగినచేయి అని పైమచ్చుపద్దెములే డంకాకొట్టి చాటుచున్నవి.

ఇఁక పాత్రపుబాగోగులు తేల్చుటలో చూడఁదగినది వాడినసుడిగమి. తెనుఁగుపాత్రములు వ్రాయువారికి నాటినుడులును తెనుఁగుమఱుఁగులును సామెతలును వాడి తెనుఁగుతనము నిలుపుట పాడి. ఇది చౌదరిగారు పాటించి తమపాత్రమునకు మంచివన్నె తెచ్చినారు. దీనికి క్రిందివి తార్కాణములు.

"దుమ్మురవ, తొలిపాలు, అయితిగామి, నల్లేరుపై బండి నడకంబోనివి, కన్నులఁగట్టినట్లు, తలకెక్కవయ్యె, చిన్నమంతేని, మాటపడు, కన్నుపడియె, కడుపుచుమ్మలువాఱఁగ, గింగుర్వెట్టెడిక, మఱుగుసేఁత, నాకాపుగడ కగ్గంబై నాటినాయీడుగల్గి వెల్గొందుకుఱ్ఱలం జూచుతఱి, తలఁపునంబాఱు, ఏసందుగొట్టియో యెగిరిరంట, తలలూపిన, ముదిమిబ్రిదిమియందు, ఉబలాటము, తూర్పుపడమరల్ గుర్తింపనేరనికుఱ్ఱజంట, ఒకయయ్యచెంత,

దొరయొఱుంగనిగరువంపుదొరతనంబు, నాకన్నంతయు నచ్చెలి పోకడపై నుండు, అత్తఱిఁ గ్రొంగ్రొత్తకాఁపురంబులు నడపు మాకు నొండొరులముచ్చట్లు నిప్పచ్చరం బయ్యె, మగపెత్తనంబు, సందడికయ్యంబులకు వియ్యంబుసూపె, కల్లబొల్లులు వల్కి వాల్గంటి కేను తెప్పవడనీయ నద్దమరేయివఱకు, పైపెచ్చు, తెరచాటునడవడి, ఆసులోనిదారంబువోలె, పేరెమ్ములవాఱుట నాకుఁ దప్పనిపని యయ్యె, తల్లిదండ్రులకుఁ బంపుకిల్లాకునం దెన్నండును జెడ్డవ్రాఁత కానంబడదాయె, నలుసంతదొసఁగు పొసఁగిన, అం దొక్కపిట్టయేని గంటఁబడదయ్యె, రాకరాములపట్టికన్, కొందఱ యందంబుచిందు వ్రాలం గాంచినతఱి, అరమోఁటితో, ఉక్కిరిబిక్కిరియయ్యె, కాని యతనిం జక్కదిద్దుటయే నాయొనర్పుచెలిమికిం గతంబు, వెఱ్ఱిపప్పలై, సడుముగట్టవలయు, "మే మే" యటంచు నొక్క మేఁక యఱచు, మది కియ్యది గాలంబై, చాటుమాటులు, తలఁపుసేఁతలు, పొరపువుట్ట, అలఁతియలంతి మొయిళ్ళు, మంచముపట్టియున్న, మేలివెరవు, పలుకుచేవయుసడలెన్, బిట్టుకట్టు చట్టంబులుంటయేఁ, ఎదిరించునిదురతోడన్, మాయనిమచ్చ, ఎల్లరేపులన్, చిచ్చుకనువేల్పుగుడికిన్ బొచ్చె మ్మెడయైనబత్తి పొంపిరివోవన్, ఆఁబొలసుఁ దింట, నాకసుగాయతనంబు, ప్రాఁజెలికాఁడు, బయలిమేడలు, అట్టె నిల్వున నిత్తైతి నపుడు నేను, ఎడబందుగుండు, తల్లి కిచ్చినబాస తన్నుచుండు, కెంగడలి, నా కొంటదయ్యె నతనియింటివంట, ఆకుబువ్వ నెలవు, పెదవి విఱుచు, జగామొండివాఁడు, వింగులవెచ్చము, సొంతవంట్లు, లోవెలి

బ్రతుకులు, రాబడి కగ్గమైనవెచ్చము, బండిబాడుగలు, లెక్క చిక్కులు, నామనుగడ, గోఁడమీఁదిపిల్లివాటమ్ముగా, పాడినెఱి పొడవడఁగుఱ, వేరుపుర్వుంబోనిది, కనులుపచ్చవడె, ఆకుఁదిండిని మెక్కునట్టి నెయ్యురకెల్ల విందుఁజేసితి, అలఁతివిందు, ఎగతాళి కగ్గమైతి, చదువునకుఁ బెండిలికిని జుక్కెదురు, కూడిమాడి, తళుకుంబస, విలువయిడరానిపొత్తము, గ్రుడ్డినమ్మికలకుఁబుట్టి నిల్లు, ఏనెఱింగినబాసయే నాకుఁ బదివేలు, అమ్మనాడికకుం బయనమ్ముగట్టి, ఆవిరిపడవ.

తెనుఁగుపొత్తములలో తెనుఁగుతల్లికి పెత్తన మీయఁ గోరుట ఇంటిలో ఇల్లాలికి పెత్తన మీయఁ గోరుటయే. ఇల్లాలు వలయువారిని మన్నించునటులే తెనుఁగుతల్లియు పెఱ పలుకులలోని వలయునుడులను మన్నింపనగును. కాని ఇల్లాలు అడ్డమగువారి నెల్లర మన్నింపఁగలదా ? మన్నింపవచ్చునా? తెనుఁగుతల్లియు అట్టిదే. ఈపాడియెఱిఁగి మన చౌదరిగారు పెఱపలుకులలోనినుడులును వాడినారు. అందు తొంటిపెద్దతో డగు సంస్కృతమునకు పెద్దఱికము వచ్చినది. అలవాటుబలిమిచే రాక తప్పదు. కాని అది హెచ్చనియే నాతలంపు. ఈతప్పు అచ్చతెనుఁగుపొత్తములు వ్రాయువారు తప్ప తక్కిన తెనుఁగు కవులు అందఱును చేసినదే; చేయుచున్నదే; ఇఁక ముందును చేయునదే. అయినను తప్పు తప్పే కాన అది ఒప్పుకొని వీ లగునంతవఱకేని ఎవరుగాని దిద్దుకొనుట మంచిది. ఇప్పటి తోడుపలలో దొరతనపుబలిమిని బట్టి తెనుఁగునకు ఇంగ్లీషే పెద్దతోడు. కాన, అందలినుడులు కొన్ని ఇందు చొచ్చినవి.

ప్రోల్లు మొదలగువానిపేరులును కొన్ని చేరినవి. తక్కిన పలు కులనుడులును కొన్ని పడినవి. సంస్కృతపునుడుల నెత్తి వ్రాయ నక్కఱలేదు. క్రిందివి పెఱపలుకులనుడులు.

బొంబాయి, ఎరవడ, కతియవాడు, పోరుబందరు, దివాణము, నకలు, దుస్తులు, బికారి, నహి, ఇంగ్లాండు, ఆఫ్రికా, గిమీ, క్రికెట్టు, మైదానము, మాల్వీ, సవారీ, వస్తాదు, బూచి, సిగరెట్లు, బడీ, బాబు, పార్సీలు, పునాది, బారిష్టరు, మోధు, బేచరజీ, జోషి, లేలీ, రిచ్మండు, వెస్టుకెన్సింగ్టను, సాట్లు, సూపు, ఫిడేలు, బెల్, మెట్రిక్యులేషన్, లాటిను, రోమన్లా, పరాసు, పౌను, టీ, కాఫీ, కోకో, పెన్నీ, ఓల్డుఫీల్డు, అల్లిన్సను, హిల్సు, వెంటనరు, బ్రైటన్, ఫ్రెంచి, చిత్తు, ఆర్నాల్డు, బీసెంటు, బైబిలు, కార్లయిలు, పేక, హిందీ, మరాటీ, బంగాళీ, డెక్కు, మానింగు, దుబాసి, ప్యారిసు, టాలుస్టాయి, వర్జిన్ మేరీ, కోర్టు, ఫిరోజిషా, దాదాభాయినౌరోజీ, ఫ్రెడరిక్ పిన్కటు, బదురుద్దీను, వకీలు.

పొత్తపుమంచిచెడ్డలు తేల్చునెడ నుడులవాడుకపిదప చూడఁదగినది నుడితీర్పును పాటించుట. దీనిమీద మనచౌదరి గారికి పట్టుదల మెండు. కాన వీరు తాము చదివిననుడితీర్పుల లోని కట్టుఁబాట్లనుబట్టి ఏర్పడురూపములే వాడుదురు. ఇపుడు వాడుకలో లేనివానికిని చోటిచ్చెదరు. నుడితీర్పులందు వీరింతగట్టివారయ్యును,

"తప్పులేనికైత సెప్పెద నని గుండె
పైని జేయివైచి పలుకఁ జాలు

కవి యెవండు? బుధులు కారుణ్యమూర్తులై
యుంట నాటసాగుచుండుఁ గాని”

అని తమఅణంకువను చూపి చక్కఁగా వక్కాణించినారు. నిజమునకు వాడుకను బట్టి నుడితీర్పులు మాఱవలసినవి కాన వానినిబట్టి యెవరుగాని సరిగా వ్రాయఁజాలమి నిక్కువంబు. నుడులవాడుక మాఱుచో కట్టుఁబాట్లును మాఱవలసినవే. ఈ నుడితీర్పుకిటుకెఱింగి వ్రాఁతకారులు మెలంగుట మేలు. ఈ కిటుకు మన చౌదరిగారెఱుంగనివారు కారు. అయినను ప్రాఁతనుడితీర్పులలోని రూపుల యందలిమక్కువ వీరికి అడ్డువచ్చుచున్నది. ఈఅడ్డు వలయు వఱకైనను తొలఁగించుకొనుచో వీరివ్రాఁతకు మఱింత మెఱుఁగు రాఁగలదు.

ప్రాఁతనుడితీర్పుకట్టుఁబాట్లే గాక తొంటివ్రాఁతకారుల వాడుకకూడ మనచౌదరిగారు పాటించెదరు. ఇందులకు వీరు వచనపుముక్కలలో కొన్ని విడఁదీసియు, కొన్నివిడఁదీయక తొంటిపొత్తములందువలె కలిపి గొలుసులవలె కూర్చుటయే తార్కాణ. అంతటను మాటలు విడఁదీసి ఆఁపుగుర్తు లుంచినచో చదువుకొనువారికి సులువుగా నుండును.

“జగద్ధితంబైన సేఁతగాదె” ఇందు ‘చేఁత’లోని ‘చా ‘సా’ గా మార్పకుండుట తగు.

‘ఎల్లరికి’ ‘ఎల్లరియాచారము’--ఇందు ‘ఎల్లరి’ అనురూపు వాడుటకు కతము ‘ఎల్లరు’, ‘ఎల్లవారు’ అనుదానిటూకీరూపుగా కైకొనుటయే.

ఇందు "ఊహాప్రశ్న" శబ్దములు చరిత్రాదులలోనివిగా కైకొనిరి.

"నాకసుగాయతనంబ దీని కెల్ల నిదానంబు"—ఇందు "కసుగాయ" ప్రోడవాడుక.

"సిద్ధముగ నుంటి నింగ్లాండుచేరి చదువ"

"ఇంతదాఁక మీకు నివ్వార్తఁ దెలుపమి
కేను మిపులఁ జింత నెనయుచుంటి
నైన నేఁడు నిక్కమాడు ధైర్యము నీకుఁ
దొసఁగెఁ గాన వేడ్క నొందుచుంటి"

ఇందలిభూతార్థకరూపములు వాడుకబలిమింబట్టి వాడ నియ్యకొనిరి. కొంద రీవాడుకకు ఇయ్యకొనరు. అయినను మన చౌదరిగారు దీనికి వెనుదీయలేదు. ఈసడలింపే తక్కినచోట్లను సైతము కొంతవఱకైనను చూపనగు. అపుడు చౌదరిగారి వ్రాఁతలు వాడుకపల్కునకు దగ్గఱకు వచ్చి, ఇప్పటికంటె హెచ్చుగా మిసమిసలాడఁగలవు.

ఇఁక ఛందస్సుకట్టుఁబాట్లను గూర్చి చూతము. మన చౌదరిగారు తెనుఁగుతనము వెలయించుటకు అచ్చతెనుఁగు నుడుఁబు వాడుటలో తిక్కనత్రోవ త్రొక్కుటయేకాక తెనుఁగుపద్దెములనే హెచ్చుగా వాడి సంస్కృతవృత్తముల వాడుకతగ్గించిరి. ఇదిచేయఁదగుమార్పే. ఇందుకథను తెలుపుటకు సీసమునకు పెద్దఱికమిచ్చిరి. పొత్తమంతటను వాడఁదలఁచి నపుడే ఇంతకుముందు మంజరిని వాడెడివారు. అట్టి మంజరిని చౌదరిగారు కందము మొదలగువానివలె విడిగా పెఱపద్దె ములనడుమ వాడి వానికి ఎక్కటిమన్నన చేకూర్చినారు.

‘రా’ ‘ఱా’ లకు యతిప్రాసలయందు పొత్తుకుదుర్పుటకు చౌదరిగారియ్యకొందురు. పుట్టు ‘ణా’కు కూడ ‘నా’తో ప్రాసమున పొత్తుకూర్చుటయు వీరి తలంపున తగనదే. ఈ సడలింపులో ఒకచో అఖండయతియు చౌదరిగారికై తజాలు తోలు-కరిమోటివఱదపార్లలో దొర్లినది. కాని డెంద మియ్యకొనమిచే దానిని వీరు త్రోసిరాజుచేసిరి.

ఇప్పటికి నాఱరయిక ఐనది. ప్రాఁతనెయ్యుఁడను కాకున్నను తమ “ఆత్మకథ”కు తొలిపలుకు నన్ను వ్రాయఁగోరి చౌదరిగారుచేసినమన్నన నే నెన్నఁడును మఱవఁజాల. తెనుఁగువారికి ఈ మేలిపొత్తము కానుకగా ఒసఁగ తెనుఁగువ్రాగమికి వన్నె తెచ్చిన శ్రీ సితారామమూర్తిచౌదరిగారి కడంక మెప్పుకప్పమునకు ఎంతయు తగియున్నది. ఇప్పటికి తొలిపాలే పైకి వచ్చినది. కాన తక్కిన నాల్గును కొలదినాళ్లలోనే వెల్లడించి వానితో తెనుఁగుతల్లిని కైసేసి ఆమెను మెప్పించి దీవనలంది చౌదరిగారు పే రందెదరుగాక!

ఈ “ఆత్మకథ” తెనుఁగువారికి చేతితోడవై వారిడెందపుటినుపముక్కలకు సూదంటురాయియై వారిమెదడుతమ్ములకు వేవెలుంగై వెలయుఁగాక! తగునగలు కలిగి పుట్టుమెఱుఁగుల కాటపట్టగుక్రొత్తడింబోనియీపొత్తము చూపఱమన్ననకు వలంతియగు గుఱిగా చెలంగుఁగాక!

ధాతృ సం॥ అశ్వయుజ
బ ౧౩ బుధవారము
ది ౧౧-౧౧-౧౯౩౬,
బెజవాడ.

మారేపల్లి రామచంద్రశాస్త్రి
తెనుఁగుగుడితొలికొలువరి

# విషయసూచిక


| | | | పుట |
|---|---|---|---|
| | కృత్యాది | ... | ౧ |
| | ప్రస్తావన | ... | ౧౭ |
| | * * * * * | | |
| ౧ | జన్మాదికము | ... | ౩౩ |
| ౨ | బాల్యము | ... | ౪౧ |
| ౩ | బాల్యవివాహము | ... | ౪౭ |
| ౪ | యాజమాన్యము | ... | ౫౭ |
| ౫ | ఉన్నతవిద్యాభ్యాసము | ... | ౬౭ |
| ౬ | దుర్వార్త - ౧ | ... | ౭౭ |
| ౭ | దుర్వార్త - ౨ | ... | ౮౬ |
| ౮ | దొంగతనము - ప్రాయశ్చిత్తము | ... | ౯౬ |
| ౯ | నాపితృనిర్యాణము - నాయుభయావమానము | ... | ౧౦౪ |
| ౧౦ | మతములలో స్వల్పప్రవేశము | ... | ౧౧౩ |
| ౧౧ | సీమకుఁ బ్రయాణసన్నాహము | ... | ౧౨౫ |
| ౧౨ | జాతిబహిష్కారము | ... | ౧౩౭ |
| ౧౩ | తుదకు సీమ | ... | ౧౪౩ |
| ౧౪ | నాయభిరుచి | ... | ౧౪౯ |
| ౧౫ | ఆంగ్ల వేషము | ... | ౧౫౮ |
| ౧౬ | మార్పులు | ... | ౧౬౩ |
| ౧౭ | భక్ష్యపరిశీలనము | ... | ౧౬౯ |
| ౧౮ | బిడియము నా డాలు | ... | ౧౭౮ |
| ౧౯ | అసత్యవ్రణము | ... | ౧౮౬ |
| ౨౦ | మతపరిచితి | ... | ౧౯౭ |
| ౨౧ | దిక్కు లేనివారికి దేవుఁడే దిక్కు | ... | ౨౦౪ |
| ౨౨ | నారాయణహేమచంద్రుఁడు | ... | ౨౧౦ |
| ౨౩ | గొప్పసంత | ... | ౨౧౭ |
| ౨౪ | పట్టా పుట్టినది - కాని పిమ్మట | ... | ౨౧౯ |
| ౨౫ | నాబెంగ | ... | ౨౨౩ |

# కృత్యాది

శ్రీ

ఉ. ఎవ్వని సేవ భద్రముల కెల్ల నిదానము; ప్రేమమూర్తియై
యెవ్వఁడు సర్వలోకముల నేలుచునుండు; నెవండు శాశ్వతుం
డెవ్వఁడు వాఙ్మనఃక్రియల కేర్పడరాని మహాత్ముఁ డీశ్వరుం
డెవ్వఁడు నిత్యహర్ష నిధి యెవ్వఁడు వాని భజింతు నిచ్చలున్. ౧

శా. వీరుల్ త్యాగులు దేశభక్తులు జగద్విఖ్యాతకీర్తిప్రభా
శ్రీరోచిష్ణులు బుద్ధశంకరశివాజీగాంధిగంగాధ రా
న్సారీముఖ్యులు పుత్రులే జననికిన్ జన్మించి రగ్గౌరవా
ధారన్ భారతమాత నెంతుఁ జరితార్థత్వంబు నర్థించుచున్.

సీ. భారతంబును బల్కఁ బనిఁ బూని తిక్కన్న
పసిఁడిగంటము కేలఁ బట్టునాఁడు
వేదభాష్యము సెప్ప వేడ్కఁ విద్యారణ్యుఁ
డోంకారమును వ్రాయుచుండునాఁడు
దిగ్జయాపేక్ష సంధిల్ల రాయలు విజృం
భించి దుందుభి మొరయించునాఁడు
సంఘసంస్కరణదీక్షాకంకణంబును
రెడ్డివేమన్న ధరించునాఁడు

తే. వారల కొసంగినట్టిదీవనల నిచ్చి
వారలం గన్నకంట నింపారఁ గాంచి
యాదరింపఁగదమ్మ నిన్నాశ్రయించి
యంజలి ఘటించుచున్నాఁడ నాంధ్రజనని! 3

శా. ఏశక్తుల్ తనకున్న నేమి పురుషుం డెబ్భంగి రాణించు నీ
యాశీర్వాదబలంబు లేనియెడ నంబా! యుష్మదీయార్చనా
వైశారద్యము గన్నవాఁ డితఁడు నీవాత్సల్యసంపత్తిలో
లేశం బీతని కిమ్ము పాలు కవితాలీలారతీ! భారతీ! ౪

ఉ. ఈవిధి నాంధ్రవాణి భజియింపఁగ నాకు నెవండు ముందరన్
ద్రోవల నెల్లఁ జూపి కడుఁ దోడ్పడె నగ్గురువర్యు సాహితీ
శేవధిఁ దత్త్వవిన్నికరశేఖరు భూరియశోవిభాసి మా
బావను గొల్తు "శాస్త్రి" కులపావనుఁ జల్లయసుబ్బయాఖ్యునిన్.

శా. ఏకశ్లోకరహస్యబోధనముచే నెవ్వాఁడు శిష్యున్ సుధీ
లోకాగ్రేసరుఁ జేయు నవ్విబుధుఁ గొల్తున్ వేంకటప్పార్యు న
స్తోకశ్లోకమయూఖరాజదఖిలాశున్ రామగాథాఽమృతా
ఖ్యాకగ్రంథమతల్లికాజనకు మద్గైర్వాణభాషాగురున్. ౬

తే. శబ్దశాస్త్రాదిలక్షణసంప్రదాయ
మెవ్వఁ డెఱిఁగించె నాకు నయ్యుద్ధచరితుఁ
బ్రస్తుతించెదఁ బుంభావపద్మజాత
రమణి దువ్వూరి వేంకటరమణశాస్త్రి. ౭

# కృత్యాది

సీ. కాళిదాసకవీంద్రు గణుతించి శబ్దశా
సను మెచ్చి నన్నెచోడని భజించి
మదిఁ బాల్కురికి సోముఁ గదియించి తిక్కయ
జ్వను వేఁడి శ్రీనాథు సన్నుతించి
మొల్ల కంజలివట్టి మూర్తిసత్కవిఁ గొల్చి
యలచేమకూర వెంకన్నఁ బొగడి
చిన్నయసూరి నర్చించి వీరేశలిం
గార్యు వేదమువాని నభినుతించి

తే. ఘనులు తిర్పతివేంకటకవుల కెరఁగి
విశ్వనాధకులాధ్యు భావించి కట్ట
మంచి రామలింగారెడ్డిమహిమ నెంచి
తలఁతు సూతపురాణకర్తను జయేచ్ఛ. ౮

శా. ఆతంకం బది లేని సాహితియు హృద్యంబై రసాధారమా
కై తన్నేరిచి పండితుల్ కవులు సుంకంబిచ్చి మన్నింప వి
ఖ్యాతిన్ సూరపనేనివంశమణియై కన్పట్టు మన్మిత్రునిన్
సీతారామకవిన్ దలంతు గుణరాశిన్ జౌటపల్ల్యాశ్రయున్.

తే. పండితశ్రేణి వేలుపుంబాసమీఁది
తగులమునఁ జేసి తెల్గును దెగడునాఁడు
మాతృభాషను మన్నించి మనిపినట్టి
వారి కర్పింతు మన్నమోవాకశతము. ౧౦

తే. మధురతాపూర్ణకావ్యనిర్మాణచణుఁడు
నేలవేల్పైననేమి చండాలుఁడైన
నేమి పూజ్యుండవో యతం డెల్లరికిని
అప్పకవి యీర్ష్యచే నెదో సెప్పెఁగాని. ౧౧

క. తప్పొప్పు లెఱుంగక యిది
తప్పనినన్ వినక చొప్పదంటుకపితముల్
సెప్పుచు విద్వత్పదములఁ
జప్పట్లన్మునిఁగి తేలు చవటలుఁ గవులే? ౧౨

ఉ. ఇంచుక నేర్పులేక సుకవీంద్రులకున్ బ్రజలిచ్చుమన్ననల్
గాంచఁగ నోర్పులేక కలకాలమునేడ్చుచు వేఁడియూర్పులన్
నించెడు కింకవీశులకు నేరము లెన్నక భావిజన్మమం
దంచితమైన కైత నిడవమ్మ! నమస్సు లివే సరస్వతీ. ౧౩

వ. ఇట్లిష్టదేవతానమస్కృతియు గురుస్తుతియుఁ బురాత
నాద్యతన కవిపుంగవ బహూకృతియుఁ గుకవినిరాకృతియుం
జలిపి విశ్వశ్రేయోనిదానంబగు నొక్కకబ్బంబు విరచింపఁ
గృతనిశ్చయుండనై మున్ముందు శిష్టసంప్రదాయమ్ము
గొనియాడి యించుక మద్వంశానువర్ణనం బొనర్తు. ౧౪

క. ధాత్రిన్ వెలసెను బూతచ
రిత్రం బరివీరశౌర్యరింఖణహేతు
స్తోత్రం బౌదార్యరమా
మిత్రంబై రాచకొల మమేయప్రభలన్. ౧౫

తే. అమ్మహాకులవృక్షరాజమ్మువలనఁ
బెక్కుశాఖలు రూపెత్తి పిక్కటిల్లఁ
దెలుఁగుదేశమ్మునకు సాగి దీర్ఘమగుచుఁ
గమ్మ యను పేరికొమ్మ యందమ్ముఁ గులికె. ౧౬

సీ. కుటిలశాత్రవకోటి గుండియల్ విదళించి
కడిమి సూపినవారు కమ్మవారు
చతురబ్ధివలయితక్షితినెల్లఁ బాలించి
గణుతికెక్కినవారు కమ్మవారు
పారతంత్ర్యము పటాపంచలు సేయఁ గం
కణము గట్టినవారు కమ్మవారు
నిరతదానత్యాగనిరతులై దీనార్థి
గణము నేలినవారు కమ్మవారు

తే. కవితలన్నేర్పు గన్నారు కమ్మవారు
ఘనయశంబును గొన్నారు కమ్మవారు
కలిమికి న్నెలవైనారు కమ్మవారు
కరము చాపకయున్నారు కమ్మవారు. ౧౭

క. తెలుఁగుం బుడమికి వెలుఁగుం
గలిగించిన వీరు లోరుగంటి మహీనా
థులు శ్రీ ప్రతాపరుద్రా
దులు వెలసిరి కమ్మవంశతోయధివిధులై. ౧౮

క. ఆకమ్మకులమ్మునయం
దాకాశధునీసుధాకరానంతనిభ
శ్లోకుఁడు రిపుభీకరధా
టీకుండొగిఁ బుట్టెఁబేరు "టీకన్న"యనన్. ౧౯

వ. అతండు "తుమ్మల"యను గృహనామంబునం బరఁగి. ౨౦

ఆ. పెమ్మసానికులుఁడు తిమ్మభూజానికి
గండికోటనేలు దండిమగని
కాప్తుఁడై యమాత్యుఁడై దళవాయియై
వన్నెకెక్కె సాటివారు మెచ్చ. ౨౧

క. తజ్జన్మఫలం బనఁగా
సజ్జనసంభావ్యశీలసంపన్నిధియా
నొజ్జయ్యవొడమె నతనికి
విజ్జెను దత్కీర్తి సురగవీసమ్మితమై. ౨౨

తే. అతనికిం గల్గె నయ్యవారప్పయనెడి
నందనుండు దయాపర్మ కందమగుట
నయ్యవారయ్యె నెల్లరికమ్మహాత్ముఁ
డొజ్జకొడుకయ్యవారౌట యుచితమకద. ౨౩

క. జనియించె నతని కన్నయ
కనదాచారుం డతండు గనె ముత్తయ్యన్
వినయాశ్రియుఁ డతనికి నా
త్తనయుఁడు రమణాభిధుండు తనయుండయ్యెన్. ౨౪

క. ఆరమణయచౌదరి సా
ధ్వీరత్నము కిచ్చమాంబఁ బెండ్లాడి గుణా
ధారుని శూరుని బుధమం
దారుని శేషయ్యఁ గనె ముదం బెసలారన్. ౨౫

క. అతిమాత్రపూత చరితాం
చితయగు సుబ్బమ్మవలన శేషార్యునకున్
సుతు లుదయించిరి వేంకట
పతి, సీతారామనామభాస్వరులగుచున్. ౨౬

క. అందగ్రజుండు శారద
కందపురందరకరీందుకరసురతటినీ
మందారహీరలవలీ
కుందసమాంస్పందకీర్తిఁ గొని రాణించెన్. ౨౭

క. భాసురగుణసంపద ల
క్ష్మీసతికిం దుల్యయగుచు మించు మహాల
క్ష్మీసతి కయ్యనఘుఁడు పతి
యైసల్పెగృహస్థధర్మ మార్యులు మెచ్చన్.

తే. సన్నుతాచారులైన తజ్జంపతులకుఁ
బ్రాగ్భవార్జిత సుకృతమ్ముపంట యనఁగఁ
బుట్టి రిద్దఱుకొమరు లప్పూతులందుఁ
బెద్దయై బాపయాఖ్యుండు తద్దనెలసె. ౨౯

క. తదనుజుఁడై కమ్మకులాం
బుధిశీతమయూఖుఁడై ప్రభూతమనీషా
స్పదుఁడై నైతికపదవీ
నదవీయసియైనబుద్ధి నారయ నెగడెన్. ౩౦

సీ. నిత్యసత్యాలాప నియతిపై ననురక్తి
సెందినాఁడు జయంబు నందినాఁడు
పరవిత్త మది తృణప్రాయంబయనివిశ్వ
సించినాఁడు తిరస్కరించినాఁడు
దీనార్థిలోకమ్ముఁ దిలకించి కన్నీరు
కార్చినాఁ డండకుం జేర్చినాఁడు
మొగమోట దిగఁద్రావి తగవుసెప్పెడినేర్పు
గాంచినాఁడు యశంబు పెంచినాఁడు
తే. కష్టమున్ సుఖమున్ దుల్యదృష్టితోడఁ
జూచినాఁ డొక్కత్రాసులోఁ దూఁచినాఁడు
నాఁడు నేఁడును బుధులు కొండాడు నడత
నివ్వటిల్లిన నారయ్య కెవ్వ రీడు. ౩౧

చ. చదువకయున్న నేమి? బుధసత్తము లుబ్బఁగ నర్థభావసం
పద వికసింప భాగవతభారతముల్ వివరించు, హృద్యముల్
తదమలకావ్యపద్యములు ధారణ కగ్గముసేసి వేనవేల్
చదువు నతండు తచ్ఛ్రవణసాహితి దుశ్శక మెట్టివారికిన్.

క. గోవిందచరణసేవా
ప్రావీణ్యకళానిరస్తప్రష్టాముండై
జీవన్ముక్తుండై సుజ
నావళి కతఁ డొజ్జబంతియై పావణిల్లెన్. 33

ఆ. పున్నములకోటూరు నన్నపనేని వం
శాబ్ధిసోము లక్ష్మయార్యుతనయ
చెంచమాంబ వినుతశీల గుణావాల
నారయాఖ్యు నింతియై రహించె. 3౪

శా. ఔదార్యం బది చెల్మికత్తెగ మగం డారాధ్యదైవమ్ముగాఁ
బేదల్ బిడ్డలుగా బుధోక్తి నగగాఁ బెంపొంది విద్వత్ప్రశం
సాధారేయము శాశ్వతం బుభయవంశఖ్యాతికిన్ దావలం
బై దీపించిన చెంచమాంబచరితం బాదర్శ మిల్లాంద్రకున్.

తే. ధన్యజీవనులైన తద్దంపతులకు
నగ్రసుతుఁడై జనించినాఁ డంకినీఁడు
పిమ్మటన్ బ్లవమార్గశీర్షమ్మునందుఁ
బుట్టితి న్నేను రెండవపట్టినగుచు. 3౫

క. జనులెల్ల రామతింతురు
నను "సీతారామమూర్తి" నాఁదగు పేరన్;
అనవద్యచరిత వనితా
జనతామణి యన్నపూర్ణ సతియగునాకున్. 3౬

వ. ఇట్టి నేను గురుశుశ్రూషాదులం బరిలబ్ధంబైన విజ్ఞానంబు
నూఁతగాఁగొని బాల్యముం దొట్టి కబ్బంబులు పెక్కులు
నిర్మించియు నంతం దనివోక వెండియు నెద్దియే నొక్క
మహాకావ్యంబు రచియింపఁగ వేడ్కవడి. ౭౮

సీ. ఏపల్లె దీపించు రేపల్లెసీమలోఁ
బాఁడిపంటల కాటపట్టనంగ
ఏపల్లె నిజదేశహితకార్యనిరతులౌ
స్వాతంత్ర్యయోధులజన్మభూమి
ఏపల్లె పరధర్మ మాపంగ నెలకొల్పె
జాతీయవిద్యానికేతనంబు
ఏపల్లె గాంధి కెంతో ప్రీతిపాత్రమై
యినుమాఱు వడసె న య్యనఘు రాక
తే. ఎందు గాంధిశిలాస్తంభ మెత్తఁబడియె
నెచటఁ దుమ్మల బసవయ ప్రచురదాన
మానితంబైన "వినయాశ్రమంబు" వెలసె
మీరు నేపల్లెపేరు "కావూ" రనంగ. ౭౯

వ. మా కాణాచియైన తజ్జనపదంబున "విశ్వసందేశం" బను
పవిత్రక్షేత్రంబునం బరఁగు గాంధిశిలాస్తంభంపు టరఁ
గుపై నమ్మహాత్ముని చతుష్షష్టితమ జన్మదినోత్సవసమ
యంబు (౨-౧౦-౩౨) నం దాసీనుండనై సమాహిత
చిత్తంబున నితివృత్తముం గూర్చి యేకతం బాడు నవ
సరమ్మున. ౮౦

సీ. ఎవని పుట్టువు మహాకవిగేయవిఖ్యాతి
        సంధించె హైందవసంఘమునకు
ఎవని రూపంబులో రవణించె నద్వైతి
        యంబు సనాతనం బార్ష తేజ
మెవని సేవాత్యాగసవనంబు భారత
        మాతృదాస్యముఁ దూల్చ మంత్రమయ్యె
ఎవని ధర్మంబు సర్వవసుంధరాప్రజా
        సంతానమునకు మేల్బంతి యయ్యె

తే. విశ్వమానవకల్యాణవిధివిధాత
యాతఁడే యంచు జయపెట్టె నెవనిలోక
మట్టిగుణకంధి గాంధిమహాత్మచరిత
నాతలంపున మెఱసెఁ బుణ్యంబు విరిసె. ౪౧

ఉ. అంతటఁ బెన్నిధింగనిన యర్థివలెం బులకాంకితుండనై
యెంతయుఁబొంగిగాంధిరచియించినయాత్మకథన్ దెలుంగులో
మంతునకెక్కఁబద్యమయమార్గమునన్ వచియింతునంచు నే
సంతనకట్టితిన్ జననిశారదకున్ గిడిగిల్లువెట్టితిన్. ౪౨

సీ. ఏసూరినో పేరినో సుబ్బినో నిల్పి
        పచ్చిసింగారంబు పల్కుకంటె
హేతువాదమ్మున కింతనిల్వఁగలేక
        బూతులబుంగలై జాతివైర

ములకు మతద్వేషముల కుపాధ్యాయులై
యౌదార్యమునకు దవ్వగుచు నీతి
రతుల కెంతయు కోఁత రాఁజేయునట్టి పు
రాణమ్ములన్ బూని వ్రాయుకంటె

తే. కాసులకు దాసుఁడగుచు మ్రొక్కఁడిని బొగడి
కల్లకై తలనల్లుటకంటె నిట్టి
గుణగరిష్ఠుల దేశభక్తులచరిత్ర
సెప్పుట జగద్ధితంబైన సేఁతగాదె. ౪౩

క. "శివరామశాస్త్రి విద్వ
త్కవిసింహము దీని మధురగద్యాకృతిలో
సవరించెఁగదా యిప్పని
కవసర మేమి?" యటంచు నాడకుఁ డార్యుల్. ౪౪

ఉ. ఎల్లరు గద్యమే చదువ నిచ్చవహింపరు, పద్యమన్న సం
ధిల్లును వేడ్క పెక్కురకుఁ; దెల్గుకవిత్వచరిత్రఁ జూచినన్
దొల్లిటినుండి పద్యపుఁగృతుల్ ప్రజలన్ దనియించి గౌరవా
భ్యుల్లసితంబులై వెలయుచున్నవిధం బది తెల్లమయ్యెడిన్.

క. పద్యంబు సర్వకవితల
కాద్యంబై గానబద్ధమై శ్రుతిహితమై
హృద్యంబై నియతం బన
వద్యంబై లెస్సతోడువడు ధారణకున్. ౪౫

క. “అనువాదంబకదా ప్రా”
మ్మని పెదవిఱ్ఱ విఱువఁబోకుఁ డయ్యాది యసదా
పసిగా; దందును బద్యం
బునఁ బల్కుట దెప్పరంబు బుధుఁ డిదియెఱుఁగున్.

క. తెలుఁగునకు స్వస్తిసెప్పిన
తెలుఁగుకవిత్వంబు వల్కఁ దియ్యము నాకున్
గలుగద మా తిక్కన య
జ్వలు త్రొక్కినత్రోవ కేను సమ్మతివడెదన్. ౪౮

ఆ. పుర్రె కొక్కబుద్ధిపుట్టు జిహ్వకునొక్క
రుచిజనించునంట రూఢి; నైన
సరసులెల్ల మెచ్చ మెఱయింతుఁ గవితలోఁ
గమ్మఁదనము మత్కులమ్మునవలె. ౪౯

ఆ. తప్పులేని కైత సెప్పెదనని గుండె
పైని జేయివైచి పలుకఁజాలు
కవియెవండు? బుధులు కారుణ్యమూర్తులై
యుంట నాటసాగుచుండుఁగాని. ౫౦

# ఆ త్మ క థ

## ప్ర స్తా వ న

ఓమ్.

తే. నాలుగై దేఁడులకు మున్ను నాదు చెలిమి
కాండ్రియొత్తిడిచే నాత్మకథ లిఖింపఁ
బూని పదిపంక్తులను వ్రాయులోన జరుగఁ
దొడఁగె "బొంబాయి" నగరాన దుండగములు.

క. ఆయంతరాయమున నా
వ్రాయసము నిరుద్ధమాయెఁ బదపడి ఘటనా
తోయధి మున్గుచుఁ దేలుచు
నా "యెరవడ" బందెయందు నందితి శాంతిన్. ౨

తే. అందు "జయరామదాసమహాశయుండు"
నపుడు గలఁ డాతఁ "డితరకార్యమ్ములెల్ల
నాపి తొలుతొల్త రచియింపుఁ డాత్మచరిత"
మని సమాచార మంపె నా కాదరమున. ౩

క. "ఇది యదనుగాదు నా కిటఁ
జదువఁగ దమి గలదు పెక్కుసద్గ్రంథము ల
య్యది తీఱుదనుక నితరం
బెదియుం బొనరింప నేర సిద్ధచరిత్రా." ౪

క. అని యతనికి నే నుత్తర
మును బంపితి; నాఱువర్షములు నచ్చెఱయం
దు నిలుచు భాగ్యము నా కొద
వినఁ గూరిచి యుందు నచట స్వీయచరిత్రన్. ౫

# ప్రస్తావన

తే. కాని మత్సరసక్రియ కాకమున్నె
దొరతనమువారు వెలికి నర్గ ద్రోసివైచి
శేతదాతంకమునఁజేసి యుచ్చరిత్రి
మయితిగాదయ్యొ నెరవడయుందుఁ బలుక. ౬

క. ఆనందస్వామి మరల
నీనాఁడిద్దానిఁగూర్చి హెచ్చరికింపన్
నేనుం దల యూపితి నపు
డే నాసఖుఁడొకఁడు వచ్చి యివ్విధిఁ బలికెన్. ౭

తే. ఆత్మకథ నుగ్గడింప నేలాసపడితి
రిట్టినడవడి ప్రాచ్యులం దెపుడు లేదు
జగతి నియ్యది పాశ్చాత్యసంప్రదాయ
మైన మీ రిపు డెద్ది వ్రాయంగలారు? ౮

సీ. ఇది ధర్మమని మీర లిపుడు నమ్మినదాని
నెల్లి యధర్మ మం చెంచవచ్చు
నేఁటిసిద్ధాంతముల్ పాటించి యొనరించు
పనుల రావచ్చు మాఱ్పాటు రేపు
పెక్కుండ్రు మీపల్కు నెక్కుడు మన్నించి
తమనడవళ్లఁ దత్సమ్మతముగ
సవరించుకొనుచుంట సత్య మిద్దాన దు
ష్పథముసం దవ్వారు పడిననెట్లు

తే. ఇట్టిహేతువులంబట్టి యిపుడు మీర
లాత్మకథ సంతరించుట నాఁపఁదగదె
అనుడు నప్పల్కులంగూర్చి మనమునందుఁ
గొంత కొంత విచారించికొనఁగవలసె. ౯

వ. అయినను. ౧౦

సీ. నా రచించెడి దాత్మచారిత్రమా? కాదు!
కాదు! నే నెపుడు నిక్కంబుఁగూర్చి
కడఁగి సల్పిన ప్రయోగంబులే కద! లిఖి
యింపఁబూనితి నిప్డు; డీప్రయోగ
ములు నాదుజీవితమ్మున నిండియుంటచే
నవ్వానిఁ దెల్పిన నవియె వెలయఁ
గలవు మజ్జీవనకథరూపముం దాల్చి;
యీగ్రంథమునయందు నెల్లయెడల
తే. నీ ప్రయోగమ్ములే యుండునేని దీని
దోషదూరంబుఁగాఁ దలంతును, జగమ్మ
నెదుట నానడవడులెల్ల నిడితినేని
గొంత మేలుండు దాననం చెంతు నేను. ౧౧

వ. ఇయ్యది మూఢవిశ్వాసంబ యగుఁ గాక! ఏలన నా కున్న యెఱుక యేపాటిది? మఱియు నారాజనీతిప్రయోగమ్ములు లోకంబునకెల్లం దెల్లంబులు! కాన వాని వివరించు

టనావశ్యకంబ! వీని దెస నాకుం గల గౌరవంబు నత్యల్పంబ. వీనిచే "మహాత్మ" బిరుదంబు నా కబ్బుటం జేసియు నాదృష్టిలో వీనిఁ గడుంగడుఁ దేలికగాఁ జూచుచుండుఁ బెక్కుసారు లిబ్బిరుదు నాకుం దీవ్రవేదనాజనకం బాయె. దీన నే నుబ్బితబ్బిబ్బయిన నిముసం బొకండును గానరాదయ్యె నయ్యాది యట్లుండె ననన్యవిదితంబు లగుట నాయాధ్యాత్మిక ప్రయోగములమాత్రింబ నే నావిష్కరింప వలయు నిక్కార్యంబు నా కెంతయు నింపితంబు. వెండియు నేతత్ప్రయోగములఁ జేసియ నాకు రాజకీయరంగమ్మునం దగు పాటవంబు వాటిల్లె నియ్యవి సర్వథా యాధ్యాత్మికంబు లగునద్దోని యేను వీని వివరించుట న్యానయమ్మ విస్తరిల్లుట కే వీలుండుఁ గాని తుల్లింతకుం దావెక్కడ? మఱియు. ౧౨

క. నాపూర్వజీవనము దెసఁ
జూపు న్నిగిడించి లెస్సచూచినకొలఁదిన్
జూపట్టఁదొడంగెడి నా
లోపమ్ములె వేలు లక్షలుగఁ దెల్లములై. ౧౩

ఆ. ఆత్మదర్శనంబు నర్థించి పరమేశుఁ
జూడఁదలఁచి ముక్తిసుఖము వలచి
చేసినాఁడ నెల్లచేఁతల నీ ముప్ప
దేండ్లనుండి దీక్ష యిగుర్చుచుండ. ౧౪

క. ఇందులకే నామనుగడ
యందలి కర్జంబులెల్ల నాచరితము; ల
స్పందగతి రాజకీయము
లం దూకుటకైన నిత్తలంపులె కతముల్. ౧౫

తే. మానిసికి నొక్కనికి సాధ్యమైన కృత్య
మెల్లరికి సాధ్యమగునంచు నేఁ దలంతు
నట్లగుట మత్ప్రయోగంబు లాచరింప
నైతి లాఁతివార లెఱుంగనట్టిరీతి. ౧౬

తే. ఎల్లరికి నీ ప్రయోగముల్ తెల్లమగుట
కూడదని పల్కుచుందురు కొంద ఱిలను
గాని యద్దాన నాధ్యాత్మికప్రభావ
మూనమగు నంచు నే నించుకేని నమ్మ. ౧౭

వ. కేవలము జీవాత్మపరమాత్మలకు వేద్యంబులగు నంశం బులు కొన్ని యుండును. కాని యయ్యవి నాయెఱుకకు నందరానివి. నా యీ యభ్యాసంబులందు నాధ్యాత్మిక మన నైతికము. ధర్మ మన్న నీతి. సర్వాత్మభావమ్మితో నవలంబించు నీతి ధర్మంబు నాఁబడు. కావుటంజేసి యీ కృతియందుఁ బండితులుం బామరులుం జర్చింపఁ దగిన విషయంబు లుండు· నేను దటస్థుఁడనై నిరభిమానినై యి చ్చరిత్రంబు రచియింతునేని సత్యాన్వేషణతత్పరుల కిందుఁ బాథేయంబు లభింపఁగలదు. మఱియు· ౧౮

## ప్రస్తావన

సీ. మత్ప్రయోగములు సమగ్రతాబద్ధంబు
లని వచింపఁగఁజాల, నద్వితీయ
నైపుణి దీపింప నడపు నిజప్రయో
గావళి విజ్ఞానకోవిదుండు [౧]
అతఁడు తజ్జాతంబులగు మాఱుపాటులే
యంత్యసిద్ధాంతంబు లని వచింపఁ
డవ్వాని యాథార్థ్యమందు సందేహమ్ము
తనకు లేకున్నను దాఁ దటస్థ
తే. భావమే పూనుఁగాని తత్పండితుం డ
హంత సూపింపఁ డొక వేళ నైన నుంత
మత్ప్రయోగంబులన్నియుం దత్ప్రయోగ
మార్గమున నుండుననుట సమంజసంబు. ౧౯

తే. ననుఁ గడుం బరికించుకొంటిని సమస్త
భావములఁ గూర్చి యవధానపటిమ వెలయఁ
దీవ్రపరిశోధన మొనర్చితిని సతంబు
నైన నివియె సిద్ధాంతంబు లనుట కొల్ల. ౨౦

వ. ఇయ్యవి నాదృష్టిలో నింతదనుక సత్యంబులు, సిద్ధాంతంబులునై వెలయుచున్నవి. అటు కానినాఁడు వీనిపై నాధారపడి నేనెట్టిపనియుం జేయఁజాల నడుగడుగునకుం గర్తవ్యాకర్తవ్య విచార మ్మొనరించుచుఁ గర్తవ్యములని తోఁచిన

౧ సైన్టిస్టు

వాని నేనాచరించుచున్నాఁడగాన నీ నేఁత మెందాఁక నాకుఁ ప్రమదమ్ము నేకూర్చు నందాఁక నాకీ సిద్ధాంతములపై సుస్థిరం బగు నమ్మిక యుండు, వెండియు. ౨౧

ఆ. తత్త్వములె వెలార్పఁ దలఁచితి నేని యీ
పుస్తకంబు వ్రాయఁబోను గాని
వాని ననుసరించి నే నాచరించిన
పనుల గాథ నుడువ మనసువడితి. ౨౨

తే. అట్లగుట నిచ్చరిత్ర "సత్యప్రయోగ"
మనెడి నామాంతరంబుతో నలరుచుండు
నింక సత్యభిన్నములంచు నెంచుకొనెడి
బ్రహ్మచర్యాదులుం బల్కఁబడెడి నిందు. ౨౩

వ. కాని సత్యంబ నా కెల్లవానికంటె నుత్తమంబు. దానం బెక్కు గుణమ్ములు లీనమ్ములై యున్నయవి. సత్యంబనఁ గేవలము వాచికమేగాక మానసికంబు సయితమ్మై యుంట వలయు. మఱియు నది కల్పనాతీతము, స్వతంత్రము, శాశ్వతము నగు పరబ్రహ్మంబు. పెక్కు విలాసంబులుంట నప్పర బ్రహ్మంబునకు లక్షణంబులుం బెక్కుఁ గలవు. వానిం దిలకించునపుడెల్ల నే నాశ్చర్యమగ్నుండ నగుచుందు, నొక్కొక్కయెడ ముగ్ధుండ నగుచుందు, వెండియు. ౨౪

# ప్రస్తావన

ఆ. సత్యమూర్తి యైన సర్వేశ్వరునకె నే
నర్చకుండ సత్య మతఁ డొకండ
ఎన్నినాళ్ళనుండి యే శ్రమించినను నా
కతఁడు గోచరింపఁడయ్యె నదిర ! ౧౫

క. శోధకమాత్రుఁడ నే నీ
శోధనమున విడుతు నెల్లసుఖముల మఱి స
మ్మోదంబున వ్రేల్చెద నీ
సాధనయజ్ఞమున నాదు సంహననంబున్. ౧౬

వ. మఱియు నెంతదనుక నాకీ పరబ్రహ్మంబను సత్యంబు ప్రత్యక్షానుభూతంబు గాకుండు నంతదనుక నాబుద్ధికి గోచరించు సత్యంబునే యాశ్రయించి కాలంబు గడపెద నిది యసిధారావ్రతం బైనను నాకు సులభతమంబ. ౧౭

క. ఈ తెరువున నడచుచు నే
నేతప్పులు సల్పినను సహించి నను బ్రే
మాతిశయమ్మున సాకెడి
నాతండ్రి న్మఱవనేర్తునా? జగదీశున్. ౧౮

క. ఈ తెన్నున నిఁక ముందును
నేతుం బయనింప నదిగొ నిర్మల సత్య
స్ఫీతాకృతి దాదవ్వుల
నాతత తేజంబుతోడ నగపడుచుండెన్. ౧౯

తే. ఒక్కటియె లోకమునయందు నిక్కమనియుఁ
దక్కినట్టిదియెల్ల హుళక్కియనియు
నహరహంబును విశ్వాస మది మదీయ
చిత్తమున వృద్ధినందు విచిత్రరీతి. ౩౦

మంజరి.

ఆసమై నవజీవనాడిపతికలఁ
బతియించుచున్న నాప్రజలెల్లవారు
నేరీతి నామది నీనమ్మకంబు
కోననాగెనో కనుఁగొందురుగాత!
క్రిమ్మఱి నీప్రయోగములందు నాకు
సవ్వారు పాలివా రయ్యెదర్గాత!
సత్యస్వరూపుని సదమలచ్ఛాయ
ననుఁబోలె వారలు గ్గాంతురుగాత! ౩౧

క. నా కగ్గమైన కార్యం
బేకుట్రనైకైన సాధ్యమే యగు నంచుఁ
వాకొనఁదగు కారణము ల
నేకంబులు నాఁడునాఁటి కెచ్చుచునుండెన్. ౩౨

వ. సత్యాన్వేషణంబునకు వలయునుపకరణములఁ దెంత బెడిదంబుండు నంత నవకమ్ము వెలయు. వెండియు నహంయువున కెయ్యది దుస్సాధంబగు నయ్యది యమాయికుండగు

బాలునకుఁ దృణప్రాయంబగు. సత్యారాధకుం డెందనుకఁ దన్నొక యమ్మరవకంటె నధముఁగా నెఱుంగఁ జాలఁ డందనుక నతఁడు స్వచ్ఛందమగుసత్యంబునీడనేని చూడఁ జాలఁ డీవిషయంబు వసిష్ఠకౌశికచరిత్రంబున సువ్యక్తంబఁ క్రైస్తవ మహమ్మదీయ మతమ్ములుసైత మిద్దాని సమర్థించెడిని. 33

తే. నారచింపఁగఁబోవు గ్రంథమ్మునందుఁ
జదువరికి నహంకారవాసన యొకింత
సోఁకు నట్లైన మత్పరిశోధనమున
వెలితి కల దెద్దియోయంచుఁ బలుకఁ దగదె?. 34

సీ. అట్లైన నాకంటి కగపడు నవ్వేలుం
గెండమావులుగాక యుండునేమి?
మాదృశుల్ పెక్కండ్రు మరణించెదరుగాక!
యెల్లకాలము సత్యమే జయంబుఁ
గాంచి విరాజిల్లుఁ గావుత! సత్యప్ర
మాణ మల్పజ్ఞప్రమాణమునను
బీరువోకుండుత! నారచనలఁ బ్రమా
ణమ్ముగా నెవరేని నమ్మకుండ్రు
తే. గాత! లోకులు మత్ప్రయోగముల నెల్లఁ
దెలివిడిగఁ దీసికొని స్వబుద్ధిని బలంబు
ననుసరించి ప్రయోగంబు లాచరించు
కొందురుగావుత! మనియ నేఁ గోరువాఁడ. 35

వ. విషయవిభ్రాంతిమంతమగు నీలోకమ్మున నాత్మకథా ప్రకటనమునం జేసి కడుంగడుం దోడ్పాటు లభించునని నావిశ్వాసము. ఏలయనసత్యంబు నెఱుంగుటకు నాయొనర్చినశోధనము లన్నియు వివరించుట నాయాశయ మగుటం జేసి దాఁపఱికంబు లేక నాదోషంబులనెల్ల నిందు వెల్లడించితిని. నాసత్త్వవర్తనముం గూర్చి నివేదించుకొనుట నాకావంతయు సమ్మతము కానేరదు. ఏప్రమాణము మన కెల్లరికిం గ్రాహ్యమో యాప్రమాణముచే నన్నుఁ గూర్చి. ౩౬

ఆ. * "కలఁడె నన్నుఁ దొరయఁగల కుటిలాత్ముండు
దుష్టజనుఁడు లౌల్యదూషితుండు ?
ఎవ్వఁడొసఁగె నాకు నిమ్మేని నమ్మహా
దాత మఱచితిఁ గృతఘ్నుఁడైతి. ౩౭

వ. అని తలంచుకొనుచున్నాఁడ నిదియునుంగాక. ౩౮

క. నాయూపిరి కెవ్వానిని
నాయకుఁగా నెంతు నిందు నమ్మికమై నే
నేయయ్యాయుప్పుఁ బులుసుం
బాయక తినుచుందు నల్లపరమేశునకున్. ౩౯

* మోసమకౌన కుటిల ఖల కామీ జిన తనుదియో తాహి బిసరాయో ఐసో నిమక హరామీ. (సూరదాస్)

# ప్రస్తావన

తే. ఇందనుకఁ జాలదూరంబునందె యుంటి
నను విచారంబు రేపవల్ నన్నుఁ గలంచు
నిందులకు నావికారంబులే కతంబు
లని యెఱింగియుఁ ద్రుంపలే నైతి వీని. ౭౦

తే. ఇంక నిప్పీఠిక న్ముగియింతు నిందు
మత్ప్రయోగమ్ములం గూర్చి మాటలాడఁ
బాఠకమహాశయుల్! కథాప్రకరణంబు
లందె మున్ముందు వానిఁ గన్గొందురుగాత. ౭౧

సాబర్మత్యాశ్రమము
మార్గశీర్ష శు. ౧౧, ౧౯౮౨. } మోహనదాస్ కరంచంద్ గాంధీ

# ఆత్మకథ

## తొలిపాలు

# ౧ జన్మాదికము

క. కలదుగదా! భరతోర్వీ
తిలకం బగు ఘూర్జరాఖ్యదేశము దానన్
గలుములకు నాటపట్టై
చెలువొందుం "గతియవాడుసీమ" కరంబున్.

తే. అందు * గాంధికుటుంబమునం దవతరించు
వైశ్యు లాదిని జిల్లరవర్తకంబు
నాశ్రయించిరి కాని తదన్వయంబు
మంత్రితాసిద్ధి వెలసెఁ గ్రమక్రమమున. ౧

* కత్తియవాడులోఁ బచారుదినుసులమ్మువారికి 'గాంధు' అని పేరు.

ఉ. ఉత్తమచందుగాంధి యన నొప్పెడినాదుపితామహుండు ధీ
మత్తరహింప మంత్రిపదమండితుఁడై యల "పోరుబంద"రం
దుత్తములెల్ల మెచ్చ నృపునూర్జితభక్తిసి గొల్చెఁగాని దు
శ్చిత్తులకుట్రచేనతఁడు సేరె * జునాఘుడుకొల్వు సేఁతకున్. ౩

క. ఆసంస్థానపుదొరకై
చేసె జొహా రాతఁ డెడమచేత, నపుడు "నీ
కీసేఁత చెల్లునా? యిది
దోసముగా దంచుఁబల్కుదురొకో? సభ్యుల్." ౪

తే. అని యొకఁడు వల్క దక్షిణహస్త మర్పి
తం బితఃపూర్వమందె బందరున కింక
లాఁతివెర వెద్ది నా కంచు నాతఁ డనియె
నిరుపమానం బహో! వానినియమశుద్ధి. ౫

క. ఆతని కైదవసుతుఁడై
పూతాత్ముఁడు నాదుతండ్రి పొడమె నతఁడు వి
ఖ్యాతమనీషాబలవి
జ్ఞాతాఖిలరాజ్యతంత్రచతురుం డయ్యెన్. ౬

సీ. జనులెల్లరును "గరంచందుగాంధి" యటన్న
పేరఁ బిల్వ నతండు పెంపుమీఱి
నెఱపె నుద్యోగంబు నెఱమంత్రియై పోరు
బందరుసంస్థానమందు నిలిచి

* ఒకానొక సంస్థానము.

క్రాలె రాజస్థానిక * న్యాయసభయందు
సభ్యుఁడై సదమలాచారగరిమ
నది రాజులకును దదన్వాయులకును
దగవు దిద్దంజాలుధర్మసంస్థ

తే. రాజకోటకు "వాంకనేర్" రాజ్యమునకుఁ
బ్రెగడయై కొంతకాలంబు నెగడి యతఁడు
కాలగతి నందువఱ కుపకారవేత
నంబు గొనె రాజకోటభూనాధువలన. ౭

తే. అతఁడు భార్యావియోగాప్తి కతనఁ బెండ్లి
యాడె నాలుగుమార్లు; గుణాఢ్యకుం దు
రీయజాయకుఁ బుత్తలీబాయి కేను
బ్రభవమందితిఁ గడగొట్టుపట్టి నగుచు. ౮

తే. అమలసత్యవ్రతుండు కులాభిమాని
శూరుఁ డౌదార్యమూర్తి నిస్తుల్యధర్మ
రతుఁడు లంచం బెఱుంగని నుతగుణాఢ్యుఁ
డన జగతిఁ గీర్తి కెక్కె నాయనుఁగుఁదండ్రి. ౯

తే. నలుబదేఁడులు కడచన్న నాఁడతండు
సిద్ధపడె నాలుగవభార్య చెట్టపట్ట
నట్లగుటఁ గొంత విషయపరాయణత్వ
మంటుకొనియుండె నాతని కనుట తగదె? ౧౦

* కోర్టు.

సీ. రాజకోట * సహాయరాజకీయప్రతి
నిధి యొకం డొకమాఱు నిజనరేంద్రుఁ
దూలనాడఁదొడంగ దోస మియ్యది యంచు
నాతండ్రి వారించి నీతు లాడ
నాగ్రహం బంది యయ్యధికారి "పొరపాటు
మన్నింపుఁ డని బతిమాలు" మనిన
నతఁ డియ్యకొనక బంధితుఁడయ్యె నటులయ్యు
లొంగకుండుటకు వెఱంగునంది

తే. ప్రతినిధి మదీయజనక నిర్బంధశిక్షఁ
దొలఁచె వ్రీడాభరం బెదం గలఁచివైవ
నల్లవో! యేమి సెప్పెద నాదుతండ్రి
మాననీయ సంస్థాననాభిమానగరిమ. ౧౧

క. ధనసంచయేచ్ఛ సుంతయుఁ
గనిపింపదు నాదుతండ్రికడ నట్లగుటన్
దినఁ దొడుగ మాకు శేషిం
చిన దెంతయు నలఁతి యంచుఁ జెప్పన్వలయున్. ౧౨

క. చదు వల్పమైన నాతఁడు
కుదిరిన లోకానుభూతి గొప్పదియగుటన్
విదళించె గట్టిచిక్కులఁ
జదురేర్పడ వేలకొలఁదిజనముల నేర్లెన్. ౧౩

* అసిస్టెంటు పొలిటికల్ ఏజెంటు.

మతమునయందతండు బహుమాత్రము శిక్షణమందఁడయ్యెగా
ని తరచు కోవెల ల్గని మనీషు లొనర్చు మతప్రసంగముల్
సతతము నాలకించి సువిచార మొనర్చుటఁజేసి యందుఁ బాం
డితి గడియించె గీతయుఁ బఠించె నతం డల వార్ధకంబునన్. ౧౪

క. చిత్తమ్మున మజ్జననియు
నుత్తమసతి యన్న భావ మొదవెను నాకున్
బత్తియుఁ బ్రపత్తియును రే
కెత్తఁగ నగ్గరిత దేవు నెప్పుడుం దలఁచున్. ౧౫

క. ఆయమ్మ దేవతార్చన
సేయక భోనంబు నెపుడుఁ జేయదు మఱియున్
బాయక విష్ణ్వాలయమున
కేయెడనే సనుదినంబు నేఁగుచునుండున్. ౧౬

వ. నాయెఱింగినతవట్టు చాతుర్మాస్యమ్ము నామె విడువ దయ్యె నయ్యమ్మ కఠినదీక్షారక్షితంబులగు వ్రతంబులు సతంబు నిరంతరాయమ్ముగా నాచరించు నెట్టి యిక్కట్టు ముట్టడించినను దాఁ బట్టిన నోము నుజ్జగించుట మజ్జనని యెఱుంగనికర్జంబు. చాంద్రాయణంబునెఱప్పుతఱి నాకెకుం దెవులు సోఁకుటయు నయ్యామయమ్మున కామె నేమనంబు నేమాత్రయుం జెఱుప నయితగామియు నెఱుంగుదు. రెండుమూఁడు కఠినోపవాసమ్ము లా సాధ్వీమతల్లికకు నల్లే

రుపై బండినడకంబోనివి. ఆమెకుఁ జాతుర్మాస్యలయం దేకభుక్తంబ నియమంబు. అంతం దనివోక యొకదాన నయ్యమ్మ వాసరోపవాసంబు నాసించె. కొండొకదాన భానుసందర్శనంబైనఁగాని బోనంబు ముట్ట నను కట్టడిఁ జేసి కొనె నపుడు నాసైదోడులంగూడి వేఁడివెలుంగు కాన నయ్యెనని మాయమ్మకు న్వినుచుట కేను మిన్నుమానికం బుపైఁ గన్ను నిలిపియుండువాఁడ. నడిజడికారునఁ బ్రేము కంబుగా నంబుజబాంధవుండు కంటంబడమి యెల్లరికిని దెల్లంబ. ఆకస్మికంబుగా లోకబాంధవుండు దర్శనం బొసం గుడు నేమొక్కగంతునం బోయి యయ్యుదంతం బమ్మకు నివేదించువార మాసుశీల పరుగుపరుగున వచ్చు నీలోనన భాస్కరుండు మేఘచ్ఛన్నుండగుడు నామె "పోనిందు నేఁడు నాయారగించుట భగవానున కసమ్మతంబు కాఁబోలు" నని వేడుకమై నాడి యింటిపనులఁ జక్క దిద్దసరుగు, వెండియు. ౧౭

క. కానంబడు వ్యవహార
జ్ఞానము మాతల్లియం దఖండమ్ముగ సం
స్థానస్థవిశేషంబు ల
నూనముగాఁ దెలియు నామె కుశమతి యగుటన్. ౧౮

ఉ. అంతిపురంబునం గలకులాంగన లెల్లరు నామె తెల్వి క
త్యంతము సంతసింతు రపుడప్పుడు బాల్యముచల్వ నేను నా
చెంతకుఁ దల్లివెంటఁ బడి చేరితి నాజనయిత్రికిన్ ధరా
కాంతునితల్లికిన్ జరగుకమ్మనిముచ్చట గుర్తు నేఁటికిన్. ౧౯

తే. * రత్న రుచి హస్తి పంకజారాతి సంఖ్య
నలరు క్రైస్తవశకనిబద్ధాబ్దమందు
దశమమాసద్వితీయమై తనరునాఁట
జననమందినవాఁడ నీ జంపతులకు ౨౦

సీ. పరిభవమందిన పోరుబందరుపురమందె
నాకుఱ్ఱతనమెల్ల నడచిపోయె
పల్లెకూటమునకుఁ బంపిన దృశ్యంబు
కన్నులఁ గట్టిన ట్లున్న దిపుడు
ఎక్కము ల్వల్లించు టెంతేని చిక్కయ్యె
నెంతపాడినఁ దలకెక్క వయ్యె
తోడివిద్యార్థులతోఁ గూడి నాఁడు మా
యొజ్జల దూషించు టొకటితప్పు

తే. నభ్యసించిన దిసుమంత యైన నేఁడు
గానరాదయ్యె; నిటులైనకతనఁ జేసి
నాకు నిశితబుద్ధియు ధారణాబలంబుఁ
బూజ్యమని సెప్ప నెంతయుం బోలకున్నె. ౨౧

* ౨-౧౦-౧౮౬౯

# ౨ బాల్యము

తే. బందరుదివాణమున మంత్రిపదవి నెడసి
న్యాయసభయందు సభ్యమర్యాద వడసి
నాకు నేడేండ్లవయ సున్ననాఁడు చేరె
రాజకోటకు నాతండ్రి తేజు వెలయ.

తే. అతఁడు న న్నప్పురంబునం దలరునొక్క-
ప్రాథమికపాఠశాలకుఁ బంపె నందు
నాపఠించినవిద్య నెన్నంగఁదగు వి
శేష మొక్కటి లేదు యోచించి చూడ. ౨

వ. అంతఁ గ్రమక్రమంబున నే నున్నతపాఠశాలకుం జేరితి నప్పటికి నాకుఁ బండ్రెండేఁడులయీడుండు నక్కాలంబున. 3

కం. బొంకాడి యెఱుఁగ నెన్నఁడు
జంకుదు సి గ్గెక్కుడగుట సంఘము దరియన్
బొంకపుఁబాత్రమ్ములె గా
కింకెవ్వరు లేరు నాకు నించిన మిత్రుల్. ౪

ఆ. ప్రక్కనున్న వానిపలకను దిలకించి
నకలువ్రాయు టెఱుఁగ నొకదినంబు
గురుఁడు దీని మప్ప దొరఁకొనెఁ గాని నే
లొంగనైతి నిట్టి దొంగపనికి. ౫

ఆ. ఇట్టిదుర్గుణంబు లెన్నని తద్గురు
నంటియుంట వింటిఁ గంటిఁగాని
యతనిదెస మదీయమగు వినయంబు తాఁ
జిన్నమంతయేని చెదరదయ్యె. ౬

కం. గురువులయాదేశంబుల
శిరమున ధరియింతుఁగాని చిత్తమ్మునఁ ద
చ్చరితంబులఁ దర్కించుట
యెఱుంగ నేనాఁడు నాకు నిది సాజమగున్. ౭

ఆ. కన్నఁబ్రాము టెఱుఁగ నెన్నండు నొజ్జల
నీతిమాలి గురులచేత నొక్క
మాటపడుట నాదుమతమునకున్ దవ్వు
పట్టువడియె నాకు నిట్టి నడత. ౮

వ. కావుటంజేసి లాఁతిపాత్రంబులపైఁ జిత్తంబు హత్తుకొన నీక పాఠ్యగ్రంథమ్ముల నిరంతరంబు వల్లించువాఁడ నిట్లయ్యు నొక్కతఱి మజ్జనకసంపాదితంబు పితృభక్తిబోధకంబు నగు శ్రవణచరిత్రం బను నాటకంబుపై నాకన్ను వడియె నంత నద్దానిఁ దుదముట్ట నవధానంబు మెయిం జదివితి నయ్యవసరంబునంద బొమ్మలాటకాండ్రు కొందఱు మామందిరమునకు న్వచ్చి. ౯

క. నేత్రోత్సవకరములఁ బలు
చిత్రంబులఁ జూపి రందుఁ జీఁకుముసళ్లన్
మాత్రిపితలఁ గావడి నిడి
యాత్రికుఁ గొనిపోవు శ్రవణునాకృతిఁ గంటిన్. ౧౦

క. ఈ చిత్తరు వాపాత్రము
నాచిత్తమునందు పెద్ద నాటుకొనియె సా
రాచారుఁ డక్కుమారుఁడు
తోఁచెను నా కొజ్జబంతితో నెన యగుచున్. ౧౧

చ. అతఁడు కథావశిష్టుఁడయినట్టితఱిన్ దలిదండ్రు లార్తిమై సుతుని దలంచుచుం గడుపు చుమ్మలువాఱఁగ నేడ్చుగీత మచ్యుతమయినాస్మృతిన్నిలిచెశోకముపైకొనుమాడ్కి నన్నుఁదత్కృతికరఁగించెదాని గురుఁడిచ్చినజంత్రముమీఁదఁబాడితిన్. ౧౨

మ. సరిగా నత్తరుణంబునం దలహరిశ్చంద్రావనీనాథున
చ్చరితం బాడఁగ నొక్కనాట్యసభ యుత్సాహంబు దీపింప మ
ద్గురునాజ్ఞం గొని దానిఁ గంటి నది గింగుర్వెట్టెడిన్ శ్రోత్రగ
హ్వారమం దిప్పటికేని దోఁచె నది నాభావంబు నువ్వెత్తుగన్.

ఆ. ఆప్రదర్శనంబు ననిశంబుఁ దిలకింప
నిచ్చ వొడమెఁ గాని "యెన్నిసార్లు
జనకుఁ డాజ్ఞ నిచ్చు? స్వాతంత్ర్య మేపాటి
కలదు నాకు? దానిఁ గాంచు టెట్లు?" ౧౪

తే. అని తలఁచి వేఱొకం డుపాయంబు లేమి
నాహృదయరంగమందె తన్నాటకంబు
గోటిమార్లు ప్రదర్శించికొంటి నేన
నిరుపమానందసామ్రాజ్యనేత నగుచు. ౧౫

క. నిత్యంబు హరిశ్చంద్ర
స్తుత్యపథం బూని గుణనిధుల్ జయవెట్టన్
సత్యంబు వల్కి జను లా
న్నత్యముఁ గనరాదె? యని మనంబున నెంతున్. ౧౬

క. ఆయనఘునిగతి సత్యముఁ
బాయక తద్ధర్మమూర్తి భంగి విపత్తుల్
మాయించు టొప్పను నభి
ప్రాయము నన్నావరించె బంధుర మగుచున్. ౧౭

క. ప్రత్యక్షరంబుఁ దత్కథ
సత్యము సత్యం బటంచు స్వాంతములోనన్
బ్రత్యయము కల్గె దుఃఖం
బ్రత్యంతం బగుఁ దలంచునంతన దానిన్. ౧౫

మం జ రి.

ఇపుడు లోకజ్ఞాన మెచ్చిన కొలఁదిఁ
దర్కించి తర్కించి తలఁచినకొలఁదిఁ
జరిత కందఁడు హరిశ్చంద్రుం డటంచుఁ
దోరంబుగా నాకుఁ దోఁచుచున్నయది;
శ్రవణుండు నా హరిశ్చంద్రభూవిభుఁడుఁ
జింతింప నాకు సజీవసత్యముల
తన్నాటకంబు లత్తఱిఁ బఠించినను
వెనుకటివలె నే ద్రవింతు నిక్కువము. ౧౬

# ౩ బాల్యవివాహము

ఆ. ఈవివాహఘట్ట మావిష్కరింపఁగ
మఱుగు సేఁత నాదుమదికి నింపు;
కాని దీన నిట్టి గరళంపుముద్దల
మెక్కవలయు నేను బెక్కుమార్లు.

క. పొగడఁదగుకతల నిటఁ బలు
వగల నొడివి తెగడఁదగినవాని న్విడ ఏ
లగునే నిజమున కే నూ
డిగముం బొనరింతు నేని డిందనిబత్తిక్.

క. పదుమూడువత్సరంబుల
యదనన్ నాపెండ్లి జరగె నని కబ్బమునం
గదియించుట సంతాపా
స్పదమగు విధి యయ్యె నేమిపల్కుదు నింకన్. ౩

వ. నేఁడునాకాపుగడకు నగ్గంబైనాఁటినాయీడుగల్గివెల్గొందు కుఱ్ఱలం జూచుతరి నావివాహవృత్తాంతంబు తలఁపునం బాఱ నాదుర్దశ కెంతయుం జింతిల్లి యేతదనర్థకంబునకు దవ్వైనయవ్వారి నవ్వారిగాఁ గొనియాడు చుండుఁ గొండొక నాఁట జరిగిన నాపెండిలి స్సమర్థింప నెట్టినైతిక విధియుం గానరాదయ్యె వెండియు. ౪

సీ. క్షత్రియవాడులోఁ గలవు సంస్కారముల్
రెండు, పరిధానంబు పెండిలి యన
తొలుతొ ల్తఁ బిల్లలతలిదండ్రు లుద్వాహ
మునకునై కావించికొనెడి నియమ
మాద్యసంస్కార మయ్యది దురతిక్రమం
బగుఁ; గాని పెండిలి ముగియులోనఁ
గుఱ్ఱవాఁ డుసుఱులఁ గోల్పోయినఁ గుమారి
వైధవ్యదుర్దశావశ్య కాదు
తే. తఱచుగా నీపరిధానగాథల నెఱుంగు
పిల్ల లుండరు; నా కిట్టి వింత తంతు
ముగిసెనంట ముహూర్త, అందు మొదటిపాప
లిద్ద ఱేసందుగొట్టియో యెగిరిరంట. ౫

తే. నాతృతీయప్రధానంబునాఁటికి కేడు
వత్సరమ్ములవయ సున్నవాఁడఁ గాని
దానిఁగూర్చి నాతోడఁ దల్లిదండ్రు
లెఱుక గావించిరో? లేదో? గుఱుతు సున్న. ౬

సీ. ముప్పుర మన్నదమ్ముల మేము; జరిగె ని
తత్పూర్వమందె పెద్దన్న పెండ్లి
నాద్వితీయాగ్రజునకును నాపెదతండ్రి
సుతునకు నాకు నౌత్సుక్య మలర
నొకముహూర్తమునంద యుద్వాహ మొనరింప
నిశ్చితంబయ్యె; నీనిర్ణయమున
మామంచిచెడ్డల మది నెంచఁ బనిలేదు
మాసమ్మతియు ననసమ్మతియు నరయు

తే. "నక్కఱయు లేదు పెద్దల; కందు వారి
కానుకూల్యంబు నల్పవ్యయంబు నొదవు
టొక్కటే చాలు నితరంబు నూహ సేయ
రంతసాహస మీకర్జ మెంచి చూడ." ౭

క. హైందవసంసారమ్ముల
యందు వివాహంబటన్న నంతంతలతో
డం దీఱ దిచ్చువారలు
నందెడువా రడఁగిపోదు రక్కార్యమునన్. ౮

కం. అర్థమ్మును గాలమ్మును
రర్థకముగ వెచ్చపెట్టి యాడంబరముల్
వర్థిల్లఁజేయ నుభయులు
వ్యర్థస్పర్ధాసమాశ్రియతఁ గాంతు రహో! ౯

కం. విందుల వింతల మేళము
లం దాళమ్ములను బట్టలం బాఁతల నె
న్నందగు నగనాణెమ్ములఁ
గ్రందుగ సమకూర్తు రహమికల్ చెలరేఁగన్. ౧౦

శ్రోతలు మేల్! బలారె! యనుచు న్దల లూపిన నిస్పృయుంచుబల్
రోఁతవహించినం గనక ఱొప్పుచు గొంతులు చీలునట్లు సం
గీతము పాడి రోగములకింకరులై పొరుగిండ్లవారికిన్
యాతన దెచ్చిపెట్టెద రహర్నిశము న్మతికొంద జిత్తజిన్. ౧౧

కం. కిమ్మనక భరింతురు పా
ర్శ్వమ్ములఁ గలవార లీ యసహ్యమ్మును వా
రు మ్ముం దీ యల్లరి నా
గమ్మును గావింపవలయుఁ గావున నవురా! ౧౨

తే. నెచ్చమా తగ్గు విభవమా హెచ్చనచ్చు
ననుచు మాపెద్దవా రెల్ల నరసి యరసి
యేకవారంబ యీపీడ నెల్లఁ బాఱఁ
దోలి నెంచిరి చెలులు బందుగులు మెచ్చ. ౧౩

వ. అదియుంగాక మజ్జనకుండును దదగ్రజుండును జరాభార పీడితులగుటయు, వారు నెఱవేర్పందగిన శుభారంభంబు లింతకు వెలిగా నన్యంబులు కానరామియు, ముదిమి బ్రిదిమియం దెల్లరికిం దమపిల్లల ముద్దుముచ్చటలం దిల కించు నుబలాటంబు వొడముట సాజంబగుటయు, మా వివాహంబు లొక్కమాఱు నడచుటకుం గారణంబులయ్యెఁ బూర్వోక్త ప్రకారంబున వైవాహికకృత్యంబులు దిద్దం గతిపయమాసమ్ములు చెల్లె; నీసందడిం గాంచి నే నాగామి విశేషమ్ములం బసివట్టి. ౧౪

ఆ. ఆట లాడికొందు నప్పిల్లతోఁ గూడి
యందలంబు లెక్కి విందుఁ బాట
మంచిదుస్తులఁ ధరించి కులుకుచుందు
ననుచు నుబ్బినాఁడ నగ్గలముగ. ౧౫

వ. తదనంతరంబు వివాహమ్ముకొఱకు. ౧౬

ఆ. రాజకోట విడిచి రంగదానందతు
రంగమంబు నెక్కి చెంగలించి
యగ్రజన్ముఁ గూడి యరిగితి మామాతృ
భూమియైన తత్ *సుదామపురికి. ౧౭

* పోరుబందరునకు నిది నామాంతరము.

సీ. ఒకయయ్యచెంత సేవకుఁడౌట మాతండ్రి
కలవిగాదయ్యె మమ్మనుగమింప
ఎట్టెటో సెలవు నొక్కింత యార్జించి తాఁ
బయనమయ్యెం బోరుబందరునకు
దారిలో శకటంబు తలక్రిందులై కూల
నతని మేనెల్ల నుగ్గయ్యె నకట!
క్షతగాత్రుఁడైన మజ్జనకుఁ జూచినయంత
మాసంబరంబెల్ల నోసరిల్లె

ఆ. ఇట్టిచెట్ట మమ్ము ముట్టడివైచిన
నాఁగదయ్యెఁ బరిణయప్రయత్న
మేను బెండ్లివేడ్కలోన మునింగి చిం
తింపనైతి దండ్రితిప్పుమోప్పు. ౧౮

క. తలిదండ్రులదెస నాకుం
గల దెంతయు భక్తి దానికంటె లవంబున్
వెలితివడఁబోదు భోగం
బులపైఁ గల రక్తి యుక్తముగ నూహింపన్. ౧౯

ఆ. ఇంక నెఱుఁగనైతి నే "సుఖమంతయు
నీఁగి కన్నవారి కెల్లవగలఁ
దగుసపర్య సేత ధర్మమ్ము లన్నింటఁ
బ్రథమగణ్య" మన్న పాడి తెలుఁగు. ౨౦

తే. మామకీనంబు నింద్యమై మలయుభోగ
తృష్ణకున్ బుద్ధి సెప్ప వర్తిల్లె నొకటి,
అది మనశ్శల్యమై నాఁడు మొదలు నన్నుఁ
గరము వేధించు ముందు ♦ తత్కథ వచింతు. ౨౧

కం. * "ఒరీ కోటియుపాయము
లాగసి పన్నెదవుగాక ! యకలంకంబౌ
వైరాగ్యము లేకుండిన
నేరవు త్యాగంబు వడయ నీ వెన్నఁటికిన్." ౨౨

వ. అని నిష్కులానందుండు రచించిన గీతంబును బాడునప్పుడు
వినునప్పుడుం దలంపునం బాఱి తద్దుర్విషయంబు నన్ను
లజ్జావశుం జేయుచుండు నది యట్లుండె. ౨౩

కం. నలఁగియు గాయమ్ములతోఁ
గలఁగియు నగుమోము పెట్టి కావించెను బెం
డిలితంతు నెల్ల జనకుం
డల దృశ్యము కనులఁ గట్టినట్టుల యుండున్. ౨౪

తే. చిఱుతప్రాయంబునం బెండ్లి సేయుకతన
మజ్జనకు నిట్లు తీవ్రవిమర్శ సేయ
సాహసింతు నటంచు నాఁ డూహవడితి
నోటు? సకలంబు నా కప్పు డొప్పియుండె. ౨౫

♦ ఈ కథ ౯ వ ప్రకరణములో వచ్చును.

* త్యాగ నటకే రే వైరాగ వినా కరీ యే కోటి ఉపాయజీ.

ఆ. పెండ్లియరుగు నెక్కి పిల్లయు నేనుఁ గూ
ర్చున్న తెఱఁగు నప్పుడు సన్నెకల్లు
త్రొక్కినట్టిజాడ నెక్కొను వేడ్కఁ ♦ గం
సాఱఁ గోర్లు లీల మఱపురాదు. ౨౬

క. మా యాలుమగలు సంసృతి
సేయ దొరఁకొన్న భంగి చిత్రము వోలెన్
నా మెట్టయెదుట నునికిం
బాయక యీనాఁటి కేని భాసిలుచుండున్. ౨౭

సీ. ఆ తొలిరేయి నోహో! తూర్పుపడమరల్
గుర్తింప నేరని కుఱ్ఱజంట
మొనసి సంసారసముద్రగర్భమ్మునం
దు సమాంతముగ నొక్కదూకు దూకె
ఆ రేయికర్తవ్యమంతయు నాకు మా
వదినె బోధించెఁ బావనగుణాఢ్య
నాకొమ్మ కెవ్వ రా పోకడ ల్నేర్పిరో
యిసుమంతయేని నా కెఱుకపడద
ఆ. యెఱుఁగ వేడనైతి నెన్నఁడు, ముందైనఁ
గోరవలయునన్న కోర్కి లేదు
మాకు సిగ్గు నిరుపమాన మన్యోన్యము
భావలోకసిద్ధి యబ్బ దెపుడు. ౨౮

♦ ఇది గోదుమలతోఁ జేయు నొకానొక పదార్థము. దీనిని వివాహ మైనపిదప నాలుమగలాండ్రొరు దాఁచువుదురు.

క. అమ్మగువతోడ నే నిఁక
నెమ్మెయి మాటాడు టొదవు? నెయ్యది వక్త
వ్యమ్ము? వధూనీసాహా
య్యమ్ము న్ననుఁ జేర్పదయ్యె నతిదూరంబున్. ౨౯

వ. అప్పట్ల నిక్కమ్ముగా నెట్టి శిక్షయు నక్కఱకు రానేర దద్దానితో నొక్కింతయు నావశ్యకమ్ము లేకుండఁ జేయఁ బురాభవసంస్కారంబు లెంతయు సమర్థంబులు. కావుటం జేసి కాలక్రమంబునన్ మాకుఁ బరిచయమ్ము వర్ధిల్లి శంకాతంకంబు లెఱుంగని సల్లాపంబులు బలియఁజొచ్చె. ౩౦

తే. హెచ్చులొచ్చులు లేక మాయీడు తుల్య
మైన నేమాయె? నించుకయేని మసల
కేను సాగింప దొరఁకొంటి నింతిమీఁద
దొర యెఱుంగని గరువంపుదొరతనంబు. ౩౧

# ౪ యాజమాన్యము

శా. నాకుం బెండిలియైనకాలమున నానానీతులంగూర్చి సు
శ్లోకుల్ వ్రాసెడు పత్రికల్ వెలసి వచ్చెన్ స్వల్పమూల్యం
బునన్
సాకల్యంబుగ వాని నేఁ జదివితిన్ సంప్రాప్తమైనప్డు డం
దేక స్త్రీవ్రతచర్య ధర్మములలో నెచ్చంచు వ్రాయంబడెన్.

క. అది ముద్రవోలె నామది
నదికె మఱిన్ సత్యదాస్య మది నావ్రతమై
కుదురుకొనియుండుటన్ బర
సుదతీస్నేహము నభఃకుసుమ మగు నాకున్. ౨

వ. మఱియు నేకపత్నీవ్రతంబుం ద్యజించుటయు నవ్వయసు
నందు నా కసాధ్యంబ; యైన నవ్విచారంబు నా కొండు
చెట్టకుం గతంబయ్యె నెట్లన. 3

తే. "ఏకపత్నీవ్రతంబు నే నిట్లు నెఱప
నా నెలంత పాతివ్రత్య మూనవలదె!"
యని తలంచితి నియ్యూహ మట్టె పెరిగి
యువిదపై నాకు సందియం బొదవఁజేసె. ౪

క. ఆయమచిత్తం బెఱుఁగఁగ
నాయధికారంబు నేర్పునం జూపితి దో
షాయత్తచరిత యని య
త్తోయలి శంకింపఁ గతము దుర్లభముసుఁడీ. ౫

క. నాక న్నంతయు నచ్చెలి
పోకడపై నుండు నెల్లపుడు, సందేహా
వ్యాకులితచిత్తులకు నే
లా కావలెఁ గార్యకారణాన్వయ మరయన్. ౬

క. "ఇరుగిండ్లకుఁ బొరుగిండ్లకు
నరుగం గూడదు మదాజ్ఞ నందక నీ" వం
చరలేకయె శాసించితి
గరిత; నిదియు బీజమయ్యెఁ గలహంబునకున్. ౭

చ. ఇది యొక బందిఖానయె వెలసె నింతికి నిట్టికడిందికర్జముల్
ముదితసహింపదయ్యెఁ దనముచ్చట హెచ్చినచోటికేఁగనా
ముదలఁదొలంగె నట్లగుటముమ్మరమయ్యె మదీయకోపమా
సుదతిస్వతంత్రతాగరిమ సుస్థిరమయ్యె నిఁకేమిసెప్పుదున్.

వ. అత్తటిఁ గ్రొంగ్రొత్తకాఁపురంబులు గడపు మాకు నొం
డొరులముచ్చట్లు నిప్పుచ్చురంబయ్యె. ౯

ఆ. నిక్క మరయ నాదునిర్బంధచర్యల
సరకుగొనక తలఁపుజాడఁ బట్టి
పొలఁతి మెలఁగు టెట్లు పోలని చేఁతయా
నురక నెఱపఁదగునె? దొరతనంబు. ౧౦

క. ఊరేగింపులఁ జూడకు
పేరంటంబులకుఁ బోకు ప్రేముడికత్తెల్-
చేరికఁ గోరకు గుడికిం
జేరకు మను చట్ట మేసుశీల భరించున్. ౧౧

క. నాసతి నే శాసించిన
నాసతి నాకాజ్ఞయిచ్చు టర్హంబకదా;
యీసత్యమ్ము నెఱుంగక
చేసితి మగపెత్తనంబు చేడియమీఁదన్. ౧౨

వ. చదువరులార! మాజీవితంబెల్ల నిట్టి సందడికయ్యంబు
లకు వియ్యంబు సూపెనని యూహింపకుఁడు. నిక్కశంకం

బగు ప్రేమయే లేమయెడ నావిధించు నిర్బంధమునకు మూలంబు. నాయిల్లాలి నెల్లపాలంతులకు నొజ్జబంతిం జేయవలయు నను నాస నాకు మిక్కుటంబయ్యె. ౧౩

ఆ. నిప్పువంటి నడత నేరిచి నాకన్న
దెల్ల నెఱిఁగి పనుల నిచ్చలందు
నాకు వేఱుగాక నారాణి రాణింప
వలయు నన్న కోర్కె బలిసె నాకు. ౧౪

సీ. కస్తూరిబాయి కీ కాంక్ష యున్నదో లేదో
యించుక యేని నే నెఱుఁగనైతి
వ్రాలైన నెఱుఁగ దవ్వనిత, మాయామర్మ
వతిగాదు స్వాతంత్ర్యవాంఛ వెలయు
అభినివేశం బున్న యతివ మితాలాప
చదువులేమికినై విచారపడదు,
చదువుకై నాసల్పుజతనంబు గని యైన
విద్యాభిలాష చూపింపఁబోదు

తే. నాకుమాత్రము తద్వాంఛ వ్రేఁకనయ్యె
నామెయే నాదుప్రేమ కిల్లై తనర్చుఁ
గాన నమ్మానినియు నవ్విధాన నన్ను
వలయుఁ బ్రేమింప నంచు మద్వాంఛితంబు. ౧౫

క. మా కన్యోన్యప్రేమము
లేకున్నను నిత్యనిర్వ్యళీకప్రణయం
బేకతఱి యైన నుంటెఁ
నాకోరికి తీవ్రవేదనకు దవ్వయ్యెఁ. ౧౬

సీ. భార్యానురాగం బపారమై యుంటచే
బడినైన నా కదే పలవరింత
దినకరుం డపరాంబుధిని బ్రుంగు నెప్పుడో
కాసంత-చీఁకటి క్రమ్ము నెపుడో
అడరి లేజవరాలికడ వ్రాలు నెప్పుడో
మించుఁబోఁడిని గుర్తించు నెపుడో
చెలువచిన్నారిచూపులఁ గాంచు నెప్పుడో
జిలిబిలిపల్కులం జిమ్ము నెపుడో

తే. యనియె నా బెంగ; దుర్భరం బావియోగ
మవసరం బున్న లేకున్న నవియు నివియుఁ
గల్లబొల్లులు వల్కి వాల్గంటి కేను
తెప్పవడనీయ నద్దమరేయినఱకు. ౧౭

తే. మితి యెఱుంగక యిటు పొలిమేర దాఁటి
మూరిఁబోయిన నా లౌల్యమునకుఁ దోడు
నాకుఁ గర్తవ్యకాంక్షయే లేకయున్న
నెట్టిచెట్టకు నగ్గమై యేత్తునొక్కొ ? ౧౮

## పంచచామరము.

వికారినై దురంతరోగపీడ స్రుక్కి యుందునో
యకాలమృత్యుఘోరవక్త్రమందుఁ జిక్కియుందునో
యిఁకెట్టిసంచరచ్ఛవత్వమేపుసూపఁగాఁ బ్రపం
చకం బిసీ! యటంచు రోయ సంతపించియుందునో. ౧౯

వ. కాని ప్రతిదినంబును గాల్యకృత్యంబులు విధిగా నిర్వహించుటయు స్వప్నమందేని దబ్బఱలాడకుంటయు నాముఖ్యవ్రతంబులు కాన నన్నుఁ బెక్కుమాఱు లీ రెండవనియమంబ యుద్ధరించె నది యట్లుండె. ౨౦

తే. పొదలె నుత్కంఠ భార్యకుం జదువు నేర్ప
నేమిలాభంబు? భోగేచ్ఛ యించుకేని
కాలము ననుగ్రహింప దక్కమలనేత్రి
కిష్టమా లేదు నెఱవేర్చు టెట్లు దీని. ౨౧

క. పై పెచ్చు రాత్రులం దే
నీపని సాగింపవలయు నెవ్విధిఁ బెద్దల్-
దాపున మాటాడుదు? నే
నోపఁగదా! వారిచెంత నుంటకు నైనన్. ౨౨

తే. నాఁడు నేఁడును గత్తియవాఁడు నమ్ముఁ
బాఁడు ♦ తెరచాటునడవడి బలిసియుంట
జవ్వనంబునఁ గస్తూరిచదువుజతన
మక్కఱకు రాక బట్టు వమ్మయ్యె నకట. ౨౩

తే. ఆవరించిన కామాంధ్య మంతరించి
సుంత యెఱుక సమీపించునంతలోన
లోకయాత్రాసమారంభలోలబుద్ధి
వాఁడ మీ యవకాశ మింతేని వడయనైతి. ౨౪

క. గురుకడఁ జదివించుటకై
నెఱపిన జతనంబు సెడియె, నెలఁత తుదకు ను
త్తరము లిఖించుటకును, గు
జ్జరాతిపాత్రంబుఁ జదువ శక్తి గడించెన్. ౨౫

క. ఆ యున్మత్తప్రేమం
బే యెడమై యున్న నాకు; నిప్పటికి సుధీ
గేయంబగు వైదుష్యం
బాయమకుం గుదిరియుండు నని యూహింతున్. ౨౬

వ. ఏల యన. ౨౭

♦ ఘోషాపద్ధతి.

క. ఆమె కపుడున్న విద్యా
వైముఖ్యముఁ బాపి యుండువాఁడ విశుద్ధ
ప్రేమకు నజయ్యకార్యం
బీమహి నహి యంచుఁ దలఁతు నేఁ జిత్తమునన్. ౨౮

క. ♦ లాలసబారిం బడున
న్నాలె నాకం డంటెఁ దొల్లి; యింకను నుడువన్
బోలిన విశేష మున్నది,
యాలింపుఁడు విన్నవింతు నద్దాని నిటన్. ౨౯

క. నమ్మించెను బలుదృష్టాం
తమ్ములు నన్నాఁడు విమలతరనిష్ఠాయో
గమ్ము విడువం డతని దై
వమ్ము కటాక్షించుఁ దుది కవశ్యం బనుచున్. ౩౦

వ. ఎట్టులన హిందూసంఘమ్మునం దతిబాల్యవివాహదురాచారం బున్నను, దాన జనించు నుపద్రవంబుఁ గొంతవట్టు తొలఁగింప జననీజనకులు నూతనవధూవరులకుం దఱచు వియోగంబ సమకూర్తు రయ్యాచారంబు మాయందుం బ్రయుక్తంబయ్యె. పరిణయానంతరంబు చెల్లిన వత్సరంబు లైదింట మాజంట కూడియున్నకాలంబు మూఁడేండ్లకు మించనేరదు. మాకలయికయుం దైదాఱుమాసమ్ములు

♦ చూ. ఈ ప్రకరణమునందలి ౧౭ వ పద్యము.

నిండియు నిండకమున్న పుట్టినింటివారు కస్తూరిబాయి కాహ్వానంబు నంపెడివారు. అప్పిలుపు లప్పుడు నాకుఁ దీవ్ర వేదనాజనకంబులై యుండెడివి. కాని మా యాలుమగల నవియ బ్రదికించె ననుట నిక్కువంబు; వెండియు. ౩౧

ఆ. చదువుకొఱకు నేను బదునెన్మిదవయేఁటఁ
జేరినాఁడ నాంగ్లసీమ; కదియ
మాకు దీర్ఘవిరహమంత్రమై నేర్పె వి
యోగసహనశక్తి నుభయులకును. ౩౨

ఆ. ఇంగలాండు విడిచి యింటికిఁ జేరిన
పిదపనైన మాకుఁ గుదురదాయె
నాఱునెలలకొలఁది మీఱిన కాలంబు
విషయసౌఖ్య మనుభవించు వీలు. ౩౩

ఏలన సత్కాలంబునం దాసులోని దారంబువోలె రాజకోటకున్ బొంబాయికిన్ దఱచు పేరెమ్ములు వాఱుట· నాకుఁ దప్పనిపనియయ్యె. ౩౪

ఆ. అవల "దక్షిణంపు టాఫ్రికా"పయనంబు
కూడివచ్చె, దానితోడ నాకు
విషయసౌఖ్యవార్ధివీచీపరంపరా
హతులఁ గడచుభాగ్య మగ్గపడియె. ౩౫

# ౫ ఉన్నతవిద్యాభ్యాసము

తే. పరిణయమునాఁటి కున్నతపాఠశాలఁ
జేరితి నటంచు మున్నె భాషించియుంటి
నేను నాయన్న లిద్దఱుం దానియంద
చదువుచున్నార మయ్యవసరమునందు.

క. రెండవయన్నకు నాకున్
బెండిలితో నొక్కరోఁటివిద్య నశించెన్
వెండియుఁ బ్రైనయ్యగ్రజుఁ డె
న్నండును విద్యాలయంబునకుఁ జనఁడయ్యెన్. ౨

క. నలుసంత దోసఁగు పోసఁగిన
"జలజల" నా కశ్రుజలము జాల్కొఱను; నిఁక నో
జ్జలు నను శిష్యార్హునిగాఁ
దలఁచినతఱి నొందవుచింత తరమే నుడువన్. ౬

ఆ. ఒక్కమాఱు నన్ను నొజ్జలు దండించి
రపుడు దాని కడల నైతిఁ గాని
దండ్యమైనయంత తప్పునసల్పితినంచుఁ
బ్రజ తలంచు ననియు పనవినాఁడ. ౭

క. ఒండగు తరగతియందో
రెండవ తరగతినో యిది జరిగె; నిట్టిద వే
ఱొం డేడవతరగతియం
దుండినతఱి జరిగె; నప్పు డొజ్జలలోనన్. ౮

వ. ప్రధానాధ్యాపకుండై "గిమీ" యనునతండు వెలయు
నయ్యెయ్యె. ౯

క. అంతేవాసులదెసఁ దా
నెంతే నాదరముసూపు నెల్లప్పుడుఁ గా
నంతయు నియమము దాఁటఁడు
మంతుఁ గనిన శిక్షకుండు మాన్యుం డరయన్. ౧౦

క. ఆయన మాకు శరీర
వ్యాయామంబును గ్రికెట్టునాట విధించెన్
నాయిచ్ఛ వీని మెచ్చదు
వాయని బిడియంబు గల్గువాఁడను గానన్. ౧౧

వ. మఱియు దేహపరిశ్రమంబునకుం జదువునకును సంబంధ మావంతయుంగానరాదనియ త్తఱి నాకొక దురభిప్రాయంబు హత్తుకొనెఁగాని విద్యావిధానంబునందు మానసికశిక్ష కెంత ప్రాధాన్యంబుండు నంతయు శారీరకశిక్షకు వలయు నను నర్థంబు నేఁ డెఱింగితి నది యట్లుండె. ౧౨

క. అందందు న్మయిదానము
లందుఁగదున్ దవ్వునడచు టది యుత్తమమం
చుందెలిసి నిత్యజీవిత
మందుఁ బ్రయోగించినాఁడ న మ్మరియాదన్. ౧౩

వ. దానంజేసి పాఠశాలయందలి వ్యాయామంబు వదలుట నాకనర్థదాయకంబు గాదయ్యె నడకయే నాకు వలయు దేహదార్ఢ్యంబుం బ్రసాదించె మఱియు. ౧౪

క. నాయయ్యకుఁ బరిచర్యం
జేయుతలం పెక్కుడగుటచేతన దేహ
వ్యాయామవాంఛ తొలఁగం
ద్రోయవలసివచ్చె నాకు దుర్వారముగన్. ౧౫

క. విడుదల గంటం గొట్టుడు
బడి విడి శరవేగ మడరఁ బర్వెత్తి కడుం
గడుబత్తిం బరిచర్యల
నడపుదుఁ దండ్రికి ముదమ్ము నాట్యము సేయన్. ౧౬

సీ. వ్యాయామనిర్బంధ మంతరాయంబయ్యె
నయ్యాకు నడిగంబు నాచరింప
ఇయ్యెక్కు డందెల్పి యీశిక్షనుండి నన్
దప్పింపుఁ డంటిఁ బ్రధానగురుని
వినఁడయ్యె నతఁడు నావిజ్ఞప్తి సుంతయే
నత్తఱి శని నుదయంబె చదువు
నాయంతసంబందు వ్యాయామ మనివార్య
మొనగూడె దుర్దినం బొక్కఁడపుడు
తే. చెంతలేదయ్యె గడియార, మంతుపట్ట
దాయెఁ గాలంబు, కనుఁబొమె నభ్రపటల
మట్టె బడిఁజేర నందొక్కపిట్టయేని
గంటఁబడదయ్యె నపరాధ మంటుకొనియె. ౧౭

వ. మఱునటిదినంబునం బ్రధానాధ్యాపకుండు రాకపాముల పట్టికం బరికించి యోయీ! నిన్నటిసాయంసమయంబునం దీ వేల రావైతివని నన్నడుగ నేఁ గలహూపెల్ల వెల్లడించుడు నతండు మద్వచనంబు విశ్వసింపక నా కార్థికశిక్ష రెండణాలు విధించె నయ్యవసరంబునం దేను. ౧౮

క. వచ్చెంగదా కల్లరియను
మచ్చ యటం చడలు సెంది మద్గురువునకున్
నచ్చునటు లేమి పల్కుదు?
నిచ్చో నాచరణయోగ్య మెయ్యది? నాకున్. ౧౯

క. అని వగచి సత్యమును న
మ్మినవాఁ డెవఁడేని ప్రీతిని మేషంబుఁ బరా
కునకుం గరంబు దవ్వై
యునికి వలయు నం చెఱింగి యూఱటఁగంటిన్. ౨౦

క. చదువుతఱి నేమఱిల్లుట
కిదియే మొదలయ్యెఁ దుదయు నిదియే యయ్యెన్
బదపడి శిక్షాద్రవ్యం
బు దిరిగి యిప్పించుకొంటి మోదము హెచ్చన్. ౨౧

తే. అంత నాతండ్రికోర్కెపై నయ్యవారు
సెలవొసంగిరి వ్యాయామశిక్ష విడువ
నాకు నీశిక్షపైఁ గోర్కె లేకయున్న
నష్ట మింతేని రాదయ్యె నడకయుంట. ౨౨

వ. కాని వ్రాయసంబు చదువునం దొకపాలు కాఁజాలదను వెడఁ
గుఁదనంబొండు నా కప్పుడుండుటం జేసి యద్దాన నా కొదవిన
కీడు మిక్కుటంబు. పిమ్మట దానిం దొలఁగింప నాపడిన పాట్లెల్ల
వమ్మయ్యె నందందుఁ గొంద ఱయ్యందంబు చిందువారిలం

గాంచినతఱి నాకు లజ్జ పైకొని పశ్చాత్తాపం బనుభూత
మయ్యెఁ జెఱుతపాయంబునాఁటియీలోటు సవరింప నావల
నా వశంబుకాదయ్యె. వంకరటింకరవ్రాఁతయసమగ్రమగు
విద్యకుం గుర్తని నేనూహింతు. ౨౩

ఆ. ముద్దుగుల్కు నాణిముత్యాలపోలిక
వ్రాలు వ్రాయునేర్పు వడయుకొఱకు
నన్నుఁ జూచి యెల్ల పిన్నలు శ్రద్ధవ
హింతురిగాక! కడురహింతురిగాక!. ౨౪

వ. అది యట్లుండె. ౨౫

సీ. పేరుకొంటినిగదా! పెండ్లిసంబరముతోఁ
దుదముట్టెనొకయేఁటిచదు వటంచు
ఈ లోటు సవరింప నాలోచన మొనర్చి
దాఁటించెనొజ్జ పై తరగతికిని
అరయేఁటితోఁ దృతీయమ్ము పూర్తియొనర్చి
పిదప నాల్గవకక్ష్యఁ గుదురుకొంటి
అద్దానఁ బాఠంబులం దనేకంబు ల
ధ్యాపనం బొనరింతు రాంగ్లమందె

తే. అగుట నుక్కిరిబిక్కిరి యయ్యె నాకు;
నింతపేరాస వలదంచుఁ జింతఁజేసి
వెండియుఁ దృతీయకక్ష్యకే వెడల నిచ్చ
వడియు నవమానభీతి వెల్వడకయుంటి. ౨౬

క. అదిఁగాక మత్పరిశ్రమ
మది నమ్మకదా! గురుండు మాటిచె నన్ని
ట్లిది యెన్నక వెన్నిచ్చినఁ
దదీయహృదయంబు నోవదా? పలువగలన్. ౨౭

వ. అని భయంపడి నాల్గవతరగతియందు నిలిచితి నందుబోధించు రేఖాగణితము నాబుద్ధి కందక నన్నెంతయు నలయించెఁ గాని క్రమక్రమంబునఁ బదిపండ్రెండు పాఠములు ముగియుడు దాన నా కభిరుచి యెక్కుడయ్యెఁ బ్రయత్నసాధ్యంబులుగాని ప్రాప్యంబు లుండనేరవు కదా! యని నే నప్పుడెఱింగితి మఱియు. ౨౮

ఉ. ఎంతయు నానతోడ వరియించిన సంస్కృతభాష నాకు నా
వంతయు లొంగదయ్యె నదియట్టిచ నిత్యము కంఠపాఠముల్
జింతనయున్నఁగాని యది చిక్కద! యాఱవకక్ష్యకేఁగి గ
త్యంతరమెద్ది? యంచు భయమంది కడుంగడుఁ దల్లడిల్లితిన్.

వ. పదంపడి. ౩౦

తే. సాటివారలు "పారసీ చాల సులువు
మార్కులం గుప్పువాండ్రపై మమత పెద్ద"
యనుచు ననుఁగొందఱుగాన నయ్యది తలంచి
సంస్కృతాధ్యయనమునకు స్వస్తిచెప్పి. ౩౧

## మంజరి.

పారసీకత్క్యలోపలఁ గూరుచుండ
నది చూచి నాసంస్కృతాధ్యాపకుండు
కడుఁ గొండలుం బంది కలఁగి యావెన్క
నను బిల్వఁబంచి యెంతయు నాగరించి
యింతవెఱ్ఱి వటంచు నెపుడు ని న్నెఱుఁగఁ
గర్తవ్య మెద్దియో గ్రహింపవైతి
నీజాతిపే రేమి? నీమతం బేది?
నీకులం బెయ్యది? నీతండ్రి యెవ్వఁ?
డించుక తలపోయుమీ! చిత్తమందు
నీజాతికెల్ల వన్నియ నిచ్చుభాష
నీమతాధారమై నెగడినభాష
చదువక విడుతువో? సంస్కృతభాష
చిక్కగా నున్న నాచెంతకు రమ్ము
చక్కగాబోధింతు సంతోష మడరఁ
గష్టంబు కలదంచుఁ గలగుండువడకు
చదివినకొలఁది నుత్సాహంబు హెచ్చు. 32

క. అనవుడు సిగ్గిల్లితి న
య్యనఘునివాత్సల్య మంత నవిలంఘ్యంబై
నను వెనువెంటనె విడిచిం
చెను బారసినుండి; యేమి సెప్పుదు నదిరా! 33

ఆ. ఇపుడు నామనంబు కృష్ణశంకరపాండ్య
సలిపినట్టి మేలు సంస్మరించు
నపుడు సంస్కృతంబు నాపాటియోని ప
ఠించు టెంతొ యుపకరించె నాకు. ౩౪

వ. అయ్యాధారంబునంజేసి మనశాస్త్రగ్రంథంబుల నించుక యెఱింగి సంతసించుచున్నాఁడ నందుఁ గూలంకషంబగు పాండిత్యంబు లేమికి నా కెంతయు విచారంబు వొడము. హైందవబాలికాబాలకు లెల్లరు గీర్వాణభాషం దప్పక నేర్వవలయునని నాయాశయమ్ము. మఱియు భారతదేశమ్మునం దున్నతవిద్యావిధానంబున దేశభాషయు, హిందీ సంస్కృతంబులుం, బారసియు, నరబ్బియు, నాంగ్లమ్మును బాఠ్యము లగున ట్లొనర్పుట యవశ్యాచరణీయమ్మని నాతలంపు; మఱియు. ౩౫

తే. ఇన్ని బాసలఁ బఠియించు టెట్లటంచు
జంకఁ బనియుండ దొక్క భాషను సమగ్ర
పాండితి గడించినం బెఱబాసలెల్లఁ
గరతలామలకంబులౌఁ గాదె? మనకు. ౩౬

క. పరభాషఁ జరిత్రాదులఁ
గఱచెడిదురవస్థ చనినఁ గడుసులభం బి
త్తెఱఁగునఁ బఠించు; టది ని
ర్భరమగు నుత్సాహమునకుఁ బాదగు నరయన్. ౩౭

# ౬ దుర్వార్త - ౧

తే. కొలఁదిమంది నెయ్యురు బడిం గలరు నాకు
నెన్నఁదగినట్టివార లం దిరువురుందు
రం దొకని చెల్మి కొన్నాళ్ల కంతరించె
దాన నా నేరమించుకంతైనఁ గాన.

ఉ. రెండవవాని మైత్రి విపరీతఫలంబు నొసంగి యాత్మకుఁ
బుం డయిపోయె సంస్కరణబుద్ధి నొనర్చితి వానిచెల్మి నా
తండ్రు మదగ్రజన్ముఁడును దద్దయు మిత్రులు వానిలోపముల్
కొండొక నేనెఱింగియును గోరితి నాతనితోడి నెయ్యమున్.

వ. అతండు నమ్మఁదగినవాఁడను నభిప్రాయంబు నా కుంటయే దీనికిమూలంబు. మాసంగాతముం దిలకించి "యీదుస్సహవాసంబు నీ కేల!" యని మా పెద్దలు నన్నెచ్చరించుడు వారి యానతిం దలఁదాల్చుటయు నాస్వభావం బైనను "మీ తలంపు సహేతుకంబ! కాని యతనిం జక్కదిద్దుటయె నాయొనర్చు చెలిమికిం గతం బతండుతనలోపంబుల సవరించుకొన్న నెన్నిక కెక్కంగలండు. మీవిచారంబు దూరంబు సేయుఁ" డని వారికి నచ్చఁబల్కి యథాపూర్వ ముంటి. 3

క. పదపడి యయ్యది ఘోరా
పదలకుఁ గుదురయ్యె; నంతుపట్టె ప్రమాదం
బదియెల్ల; నెల్ల మీఱుం
గఁదగునె? సంస్కరణకార్యగతులం దైనన్. ౪

మంజరి.

సంస్కర్తకు న్మతి సంస్కార్యునకును
గాటంపునెయ్యంబు గలుగ దెన్నఁటికి
అద్వైతభావనం బద్దానఁ గలదు
జగతి నీదృశమైత్రి సమకూరు టరుదు
సమగుణశీలురసావాస మొకఁడ
రాణించి తా సుస్థిరత్వంబునందు
అన్యోన్యచిత్తంబులందు నెచ్చెలులు
పెలుచ నెప్పుడుఁ బ్రతిబింబించుచుండ్రు

కావుటంజేసి సంస్కరణం బొనర్ప
నవకాశ మత్యల్ప మమరు నేస్తమున;
మంచిచెడ్డలు రెంట మనుజుండు వేగఁ
గైకొను దోషంబ; కాన నెవ్వరికి
నతిమైత్రి ~~తగదంచు~~ నస్మదాశయము;
ఆత్మమైత్రిం గోరునట్టిమానవుఁడు
నీశ్వరమైత్రి నపేక్షించు నరుఁడు
నేకాకిగా నుంట యెంతయు లెస్స
కాదేని దనకు లోకంబెల్ల మిత్రి
మగునట్టి మార్గంబు నరయుట మేలు
ఏతద్విచారం బదెల్ల నూహింప
యోగ్యమౌఁగాక! యయోగ్య మౌఁగాక!
నిండారునెయ్యంబు నెఱపంగవలయు
నన్న నాజతనంబు వ్యర్థమైపోయె. ౫

క. ఆతనికిన్ నాకును సం
గాతం బభివృద్ధినందుకాలమ్మున నో
హో! తరఁగపోలె నెల్లరి
చేతమ్ముల సంస్కృతమెచ్చ వెలఁగుచునుండెన్. ౬

వ. అయ్యవసరంబున నాచెలిమికాఁ డొకనాఁడు నన్నుఁ జేరి.౭

క. ♦ "పంతుళ్ళలోనఁ గొందఱు
మంతనమునఁ గల్లు ద్రావి మాంసము నాహా
రింతు" రని వెల్లడించుడు
వింతయుఁ జింతయును నాకు వెగ్గలమయ్యెన్. ౮

వ. అంత "నిట్టి యభోజ్యస్వీకరణంబునకుం గతం బెద్ది?" యని నే నుడువుడు నతం డిట్లనియె. ౯

సీ. పలలంబుఁ దినమి దౌర్బల్యం బపారమై
యేఁజెల్ల! మనజాతి యేపుమాసె
మాంసభుక్కులుగాన మనపై సవారులఁ
దీయుచున్నా రాంగిలేయు లిప్పు
డొఱఁగవే! నాచేవ నెఱచి మెక్కుటఁ జేసి
లభియించె నా కిట్టి లావుకలిమి
పొలసుదిండులమేనఁ బుట్టనేరవు సుమీ!
రోఁతఁ బుట్టించు కురుపులుఁ గణంతు
ఆ. లరయ వెట్టిపప్పులై మనయొజ్జలు
మాంసభక్షణంబు మరగిరోటు?
కండనములు మీవు కన్పడు నద్దాని
మహిమ నీకు రిత్తమాట లేల? ౧౦

♦ పంతులు అనునదియే బహువచనాంతమైనను వ్యవహారరూఢినిబట్టి దానిపై మరల బహువచనప్రత్యయము అర్థస్ఫూర్తికై ప్రయుక్తం బయ్యె.

క. అని పల్కి నన్ను మాంసా
శనుఁ జేయ నతండు పెక్కుసారులు యత్నిం
చెను సోదాహరణమ్ముగ
వినిపించెఁ దదీయవాదవిషయములెల్లన్. ౧౧

తే. అంతకుం బూర్వమందె నాయగ్రజుండు
వీనిపన్నినవలఁ జిక్కెఁగాన నతఁడు
నాదుచెలికానివాదంబునకును బ్రక్క
తాళమును వైచి తత్సమర్థనము చేసె. ౧౨

క. వారిద్దఱున్ ద్రఢిష్ఠులు,
ధీరులు, బలవంతు లగుచు దీపింతురు దు
ర్వారగతిం జరియింతురు
వారణమశకాంతరంబు వారికి నాకున్. ౧౩

వ. అందు నానెచ్చెలికాఁడు. ౧౪

సీ. ఎంత దవ్వైనఁ బర్వెత్తు వేసట లేక
బాణవేగమున సెబాసనంగ
ఎత్తు దూకుటయందు నెడవు లంఘించుటన్
దలపోయ నతని కతండె సాటి
ఎన్నిదెబ్బలనైన వెన్నిక భరియించు
నాటలన్నింట జయంబుఁ గాంచు
అతనినిర్వక్రపరాక్రమక్రమముఁ గ
న్గొన్నయంత వితాకుఁగొంటి నేను

తే. పిదప నిట్టివస్త్రాద్యనై పొదలవలయు
నన్న యభిలాష నాకు మెండయ్యె నపుడు
జతన మొనరింప నిదియు దుస్సాధ మగునె?
యనెడు విశ్వాస ముదయించె నాత్మయందు. ౧౫

ఆ. మఱియు నాకు హెచ్చు పిఱికితనంబు; ద
య్యంబు లనినఁ బన్నగంబు లనిన
ముచ్చు లనిన నడలు ముమ్మరమై నన్నుఁ
దల్లడిల్లఁ జేయు నెల్లగతుల. ౧౬

సీ. చీకటి యన్నచో నా కెంతయును భీతి
నిశల ముంగిలి దాఁటనేర నెపుడు
ఒకవంకఁ జోరు లింకొకచక్కటిం బాము
లొండొక్కదెస బూచిపిండు నిండి
న న్గబళింపనున్నవిధానఁ గన్పట్టుఁ
గావున నే నంధకారమందుఁ
బవ్వళించుట యసంభవము; శయ్యామంది
రంబున దీపంబు గాలవలయు

తే. నాభయంబుల నీజవ్వనంబునందుఁ
జెంత నిదురించు నింతికిం జెప్పు టెట్లు?
ధీరత నన్ను మించు నత్తెఱవ మిన్న
యని యెఱుంగుదుఁ గాన న న్నలము లజ్జ. ౧౭

క. చెలికాఁ డెఱుంగు నాకుం
గల భీరుత్వంబు నతఁడు "గాముల నమ్మ్రక్
జిలువల నాడించెద, దాం
గలఁ దోలెద నే" నటంచుఁ గడిమి న్దెలుపున్. ౧౮

వ. ఈ సాహసంబున కెల్ల నామిషాహారంబ నిదానంబని నుడువం బని లేదు. మరియుఁ దత్కాలంబున విద్యార్థు లెల్లరు నుల్లాసంబుమెయి నర్మదకవి రచియించిన. ౧౯

తే. * "ఆంగిలేయుని జూడరా! హైందవులను
♦ నాపలను జేసి కులుకుచున్నాఁడు నేఁడు
హేతువు నెఱుంగుదే? యతం డెఱచిదిండి
యైదుమూరలపొడ వుండు నందువలన. ౨౦

వ. అను గీతముం బాడుచుండువా; రియ్యది తన కర్తవ్యమ్ము నెల్ల నిర్వహించి ధన్యతం గాంచె దీనికి నేనుం గైవసం బైతి. ౨౧

ఆ. క్రవ్యభక్షణంబు కర్తవ్య మనియు, న
న్నది బలాఢ్యుఁ జేయు ననియు, దాని
నెల్లవారుఁ దిన్నఁ దెల్లవారిం దోల
వచ్చు ననియు నూహ లెచ్చె నాకు. ౨౨

* ఆంగ్రెజో రాజకరే, దేశీర హేదబాఈ, దేశీర హేదబాఈ, జోనే చేనాం శరీరభాఈ, పేలో పాంచహాథపూరో, మాంసనేవే.
♦ అసమర్థుఁడను నర్థమిచ్చు దేశ్యపదము.

క. అరసి యరసి లగ్న మొకం
డెఱిఁగి భుజియింప నిశ్చయించితి నదియున్
బెఱ తెఱఁగకుండ సరణిన్
జరగవలయు వైష్ణవంబు నామత మగుటన్. ౨౩

సీ. అందు నాతలిదండ్రు లచ్చంపువైష్ణవుల్
గుడి కెల్లనాఁడు నేఁగుదురు విధిగ
మానాడికిఁ జైనమతము పైకొనియుండు
నెల్లచో నది రాజ్య మేలుచుండు
జైన వైష్ణవమత సంప్రదాయమ్ములఁ
బలలంబు పేరైనఁ బలుకఁబోల
దే దేశమందైన నేమతంబునన్నైన
మాంసనిషేధ మామాత్ర లేదు

తే. అస్మదీయకుటుంబమం దలరుచున్న
సంస్క్రియారూప మిట్లుండ సాహసించి
నంజుడుం దిను టెట్లంచు నాయెడంద
హెచ్చెను భయంబు యోచనల్ పెచ్చుమీఱె. ౨౪

క. జననీజనకులయెడ నా
కనూనమగు భక్తి యున్నయది; నా పలలా
శనవృత్తాంతము విన్నం
తనె వారలు చత్తురంచు నాకుఁ దెలియున్. ౨౫

తే. అపుడు సత్యాభిరతియు నా కగ్గలంబె
పలలభక్షణమునకు లోపడితి నేని
గల్లలం బల్కి పితరులఁ గన్నుఁబ్రామి
నడుముగట్టవలయునంచు నాకుఁ దెలియు. ౨౬

వ. నాదృష్టి యంతయు సంస్కారదీక్షపైఁ దిరంబై యుంట వీని సరకు సేయనైతి. బలవిక్రమంబుల నందఁగోరియే యే నిమ్మాంసభక్షణంబు నాసించితిఁగాని జిహ్వాచాపల్యమునఁ గాదనుట నిక్కంబు. ౨౭

తే. చెలిమికాండ్రను నేను నిప్పాలసు మెక్కి
తెల్లవారల నోడించి దేశమాత
బన్నములనెల్లఁ దొలఁగింపవచ్చు నన్న
యిచ్చయే దీని సేవింప హేతువయ్యె. ౨౮

వ. ఈ సంస్కరణపుందిక్క యిట్లు నన్నంధునిఁ జేయుటం జేసి. ౨౯

తే. తల్లిదండ్రులయెఱుకకు దవ్వొనర్చి
యిది రహస్యంబుగా నుంచు టించుకేని
సత్యదూరంబు గాదంచు స్వాంతమందు
విశ్వసించితి దేశాభివృద్ధిఁ గోరి. ౩౦

## ౭ దుర్వార్త - ౨

తే. వచ్చె నిర్ణీతదివస మెవ్వనితరంబు
నాఁటినాయునిక్కనెల్ల వర్ణన మొనర్ప
నొక్కదెస సంస్క్రియోత్సాహ ముబ్బుచుండె
నొక్కదెస దొంగపనికి సిగ్గొదవుచుండె. ౧

ఆ. ఏకతంబుఁ గోరి యేఁ జెలికానితో
నెనసి వెదకి యొక్కయేటిదరికిఁ
జేరి కంటి నాదుజీవితమున మొట్ట
మొదటిసారి పొలసుముక్క లచట. ౨

సీ. కల్లురొట్టెయు నందుఁ గలదు; రెండును నాకు
రుచియింపవయ్యె బల్ రోఁత పుట్టె
బెడిదమై తోలుకై వడి నుండె మాంస, మ
ద్దాని మెక్కుట యసాధ్యంబ యయ్యె
ఓకరింత జనించి డోకు వచ్చుటఁ జేసి
పరిహరించితిని దద్భక్షణంబు
ఆ రేయి నాకు నావంత నిద్దుర లేదు
దుస్స్వప్నములు పెక్కు దొడరి కలఁచె

ఆ. కన్ను మూఁతవడుడు గర్భమునందు "మే
మే" యటంచు నొక్క మేఁక యఱచు
నంత భయము వచ్చు సంతాపమూ హెచ్చు
నాయవస్థ యిట్టు లాయె నపుడు. 3

వ. అయినను మాంసభక్షణంబు మాను టెట్లని యూహించి వెండియు రెండింతలు ధైర్యంబుఁ దెచ్చికొనుచుంటి నంత.ర

క. మఱునాఁటినుండి నెయ్యుఁడు
తరసంబును జేర్చి పలువిధమ్ముల వంటల్
కరము చవి పుట్టునట్టులు
విరచింపఁ దొడంగెఁ బాకవిద్యాప్రౌఢిన్. ౪

ఉ. ఈయెర సాటె, రొట్టెపయి నేవముజారెను, మేఁకఁగూర్చియా
య్యో! యని పల్వరించు టెటులో పరువెత్తెఁ గరంబు రుచ్యమై

పాయనికోర్కిఁ బెంచెఁ బలపాకము, లీకరణికిఁ గతించెఁ దా
హాయన మొక్కఁ, డీచెయిద మన్యు లెఱుంగ రోకించుకంతి
యుఁ. ౬

తే. అపరిమితమూల్యసంప్రాప్య మైనకతన
మాంసభక్షణ మిరుమూఁడుమార్లె జరిగె
నాకడ ధనంబు లేకున్న నన్నుఁ జెఱుప
వలయు వెచ్చంబు నోర్చె నాచెలిమికాఁడు. ౭

ఆ. వానికేని సొమ్ము వచ్చెడు నవకాశ
మల్పమగుట విందు లప్పుడప్పుడు
నూటి కొక్కనాఁడు గోటికి నొక్కనాఁ
డారగించుచుండువార మేము. ౮

తే. పొలసు మెక్కిననాఁ డన్నముం ద్యజింతు
నింక నద్దానితోఁ బని యేమి? నాకు
అమ్మ ప్రాల్మాలి తేమని యడుగఁ దిండి
యఱుగ లేదమ్యొ నని నెపం బాడువాఁడ. ౯

క. ముందరికాళ్లకు నే నిటు
బందంబులు వేయుతటి నపారం బగు చిం
తం దగిలి తల్లికే క
ల్లం దెలుపుచు నుంటి "నన్నలా" యని పగతుఁ. ౧౦

క. ఇది తెలిసెనేని పితరుల
హృదయమ్ములు వగులు నంచు నెఱుఁగుదుఁ గానన్
మది కియ్యది గాలంబై
తుద లేనివిచారజలధిఁ దోఁగించె నన్నున్. ౧౧

వ. పదంపడి. ౧౨

## మంజరి.

"మాంసభక్షణమును మరగి యద్దాని
హైందవులం దెల్ల వ్యాపింపఁజేసి
పరజాతిపాలన భరతోర్వినుండి
పాఱంగఁదోలు టావశ్యకం బైనఁ
దల్లిదండ్రుల కసత్యములు సెప్పుటయుఁ
గడఁగి వారల నిట్లు కన్నుఁబ్రాముటయు
నెఱచి మానుటకంటె నెగ్గగుం గాన
నవ్వారిఁబొందిలోఁ బ్రాణంబు లుండ
నామిషంబును ముట్ట దది కాని నేఁత
తదనంతరము నిరాతంకపద్ధతిని
జాటుమాటులు లేక సాగింపవచ్చు
నంతియ కాని యయ్యెద నబ్బుదనుక
మాంసంబు దిన" నంచు మది నిశ్చయించి
యనుఁగున కివ్విషయంబెల్ల వినిచి
తిరుగ నంజుడుతిండిదెసకుఁ బోనైతి. ౧౩

వ. తమబిడ్డ లిద్దఱు పొలసుదిండు లైనఁగార్త మాజననీ జన
కుల కెన్నండును శ్రుతిగోచరంబు గాదయ్యె. వారితోఁ
గల్ల లాడఁ జన దన్న సద్విచారంబు వొడముటం జేసియు
నేను మాంసభక్షణంబు విడచితిఁ గాని నా చెలికాని పొందు
మాత్ర ముజ్జగింపనైతి. లాఁతివారలఁ జక్కఁ దిద్దవలయు
నన్న యుబలాటంబ నా కెంతయుం జెట్టఁ గూర్చె, దీని
నెఱుంగువివేకంబు నా కపు డణుమాత్రమ్మును లేదయ్యె.

ఆ. దైవవశతఁ జేసి యావంతలోపలఁ
దొలఁగెఁ గాని వాని చెలిమి నన్నుఁ
ద్రోసి యుండు సకట దుర్వ్యభిచారకూ
పంబునందుఁ బాపభవనమందు. ౧౫

చ. అతఁ డొకనాఁడు నన్ను వెలయాలిగృహమ్మును జేర్చె మెల్లప
ద్ధతులను మప్పి లోపలికిఁ దాఁ బనిచెన్ దురితోగ్రదేవతా
శితతరదంష్ట్రికల్ నడుమఁ జిక్కితిఁ గాని మదీయదుష్క్రియా
ప్రతిఘటనం బొనర్చి భగవానుఁడు నన్మనిపెన్ గృపామతిన్.

సీ. ఆపాపకందరమం దేమి సెప్పుదుఁ
గన్నులఁ జీఁకటుల్ క్రమ్ముకొనియె
మందునకే నొక్కమాట వెల్వడదయ్యెఁ
జెమరుచే నొడలెల్లఁ జెమ్మగిల్లె

కంపమ్ము హెచ్చె నగ్గలమయ్యె గగ్గోలు
సెజ్జపై భోగపుంజెలువ కెలన
నధివసించితిఁగాని యంకిళ్లు బిగువయ్యె
నాకొమ్మ తడ వోర్వలేక తిట్టె
తే. నెట్టె వాకిలి సూపె నప్పట్టునందు
వచ్చె నాపుంస్త్వమున కయో మచ్చ యనుచు
సిగ్గువడి తల్లి! వసుమతీ! శీఘ్రముగను
దారి నొసఁగుము నా కంచుఁ దల్లడిలితి. ౧౭

క. అటులయ్యును నన్నియు
త్కటదుర్దశనుండి తొలఁచి కాచిన ఘటనా
ఘటనావిశారదునకున్
బటుభక్తిన్ మ్రొక్కుచుంటిఁ బరమేశునకున్. ౧౮

ఆ. దాపరించె నాపదలు మఱి నాల్గు నా
బ్రతుకునందు; వాని నతికరింపఁ
బౌరుషంబుకంటె భాగ్యంబ తద్దయుఁ
దోడుపడియె మేలు కూడునట్లు. ౧౯

వ. న్యాయైకదృష్టిని విమర్శించిన నివియెల్లఁ దప్పిదమ్ముల
యగు నేల యన నిందు విషయాసక్తికిఁ గొఱంత కాన
రాదు. తలఁపు సేఁతలు రెండును గుణదోషంబుల సమ
ప్రాధాన్యంబు వహించుఁగదా? కాని లౌకికదృష్టిం

గేవలక్రియలే యెన్నికకు వచ్చుఁ గాన నీచూపునం జూచు
నపుడుమాత్రంబ నే నిర్దోషినయ్యెద నయ్యదియట్లుండె.—౨౦

## మంజరి.

భగవదనుగ్రహబల ముండు నేని
గర్తలౌ వారికిఁ గారయితలకుఁ
దలఁగుఁ జెట్ట లొకొక్కతఱియందుఁ గొన్ని
తలఁగినపిమ్మటం దగినవివేక
మొదవుడు మానవుం డుల్లంబునందుఁ
దనకు రాఁగలకీడుఁ దప్పించినట్టి
సర్వేశుదయను సంస్మరణంబు సేయు;
నరుఁడు విశ్వప్రయత్నం బొనర్చియును
వికృతికిం బాలౌట విశ్రుతం బెందు
అట్టుల యీశ్వరుం డడ్డమై గాని
మరలించి ప్రోచుట మనకుఁ దెల్లంబ!
ఇయ్యది సకలంబు నెట్లు సిద్ధించు?
జనునకు నేపాటిస్వాతంత్ర్య ముండు?
పరతంత్రతయు నెంతవఱ కంటియుండు?
పౌరుషం బది యెంతవట్టు ఫలించు?
ఈశ్వరానుగ్రహం బెట్టిచోఁ గలుగు?
ఇవ్విషయంబెల్ల నేనాఁటికైన
నూహకు నందఁబో దుర్వి నెవ్వనికి. ౨౧

వ. ఇఁకఁ బ్రస్తుతాంశమునం జొత్తము. నాయనుంగు నన్నిట్టి దుర్దశకుం బాల్పఱిచినను నే నతనిదుస్సహాహాసంబు నింకను విడనైతి నాతనిదెస నాయూహింపనిలోపంబులఁ గొన్నింటిఁ బ్రత్యక్షముగ నీక్షించుదనుకఁ దత్సాహాచర్యంబునం జేసి నాసల్పినదుష్కార్యంబులు మఱికొన్ని గలవు. వానిం గాలోచితమ్ముగా మున్ముందు వివరింతు నందొక్కటిమాత్ర మిపుడ యావిష్కార్యమగుట నప్పనికిం గడంగెద. ౨౨

తే. పొలఁతుకకు నాకు నెడఁదలఁ బొరపు పుట్ట
నితనిపొత్తొకహేతువై వెతలఁ గుడిపె;
మగువదెస నాకుఁ గామానుమానములు స
మంబులై యుండు నంటిఁ బూర్వంబునంద. ౨3

క. అయ్యనుమానాగ్ని నా
నెయ్యుఁడు దరికొల్పె నతఁడు నిజ మాఁడు నటం
చెయ్యెడఁ దలంతుఁ గానన్
దొయ్యలికిం గూర్చినాఁడ దుర్భరహింసన్. ౨౪

క. ఈరీతివెతల హైందవ
నారీమణి గాక లాఁతినాతి భరింపన్
నేర; దటు లౌటఁ జేసి క్ష
మారూపం బని తలంతు మది నమ్మగువన్. ౨౫

వ. నాధర్మపత్ని నిట్లు బాధించినందులకు నన్ను నే నెన్నఁడు
న్మన్నించుకొననైతి నట్లు మన్నించుకొనుటయు నాకు
నసాధ్యం బగు కృత్యంబ! మఱియు. ౨౬

ఆ. హేతు వింత లేకయే సంశయించినఁ
దొలఁగవచ్చు బంటు కొలువునుండి
సుతుఁడు తండ్రిమొగము సూడకపోవచ్చు
ననుఁగు చెలిమి వీడి యరుగవచ్చు. ౨౭

తే. కాని, నిష్కారణంబుగా గరిత విభుని
చేత శంకితయై యేమి సేయనేర్చు ?
నకట ! యటుగాక తా సంశయంబువడియు
మగనిదెసఁ జూపలే దెట్టి తెగువనేని. ౨౮

ఆ. దొడ్డయింటివారిబిడ్డ హైందవకాంత
రచ్చ కెక్కి పెండ్లి రద్దుపఱుపఁ
గడఁగ, శాస్త్రీయంబు కాదు చట్టంబు త
త్సతికి, దుస్సహంబు తద్విపత్తి. ౨౯

క. ఇట్టు దురవస్థ లంటం
గట్టితి నవివేకవశతఁ గాంతకు నే నా
కట్టిడిసేఁతల నకటా !
యెట్టులు మఱవంగలాఁడ నీజన్మమునన్. ౩౦

సీ. సవిశేషముగ సహింప నెఱింగినంత, ని
యమానుమానభూతంబు సనుఁ దోఁచంగ
బ్రహ్మచర్యపరిభావంబు నప్పు డెఱింగి
ఘటదాసి కాదు పో! కాంత పతికి
నని, సహచారిణి యని, సహధర్మిణి
యని, భర్తృకష్టసౌఖ్యంబులందు
నాపెకుఁ బా లున్న దని, స్వాతంత్ర్యతయందు
నాలుగుగల్ తుల్య లనియుఁ దెలిసి

ఆ. కొనితి, నాఁటి మొఱకుఁదనముఁ గాఠిన్యంబు
నంధమైతి, నిప్పు డరసికొన్న
నలుక హెచ్చు, దుఃఖ మాఁగదు, లజ్జయుఁ
జిందులాడు నేమి సెప్పువాఁడ. ౩౧

---

# ౮ దొంగతనము - ప్రాయశ్చిత్తము

క. నే నెఱచి మెక్కినపుడున్
దానికిఁ బూర్వంబుఁ గొన్ని తప్పం జెయువుల్
నా నెఱపినట్టి వున్నవి
వాని న్వివరించి పలుకవలతును దీనన్.

క. చుట్టం ద్రావుటకై నా
చుట్టం బొకరుండు నేనుఁ జూచితి మొకనాఁ
డెట్టిఫలంబును దానన్
బట్టువడం జాల దన్న పాడి నెఱిఁగియున్. ౨

వ. ఈయభ్యాసంబు మాపితృవ్యునకుం గల; దతండు ధూమ
పానం బొనర్చుటం జూడ మాకును సిగరెట్లతో నలఁతి
యలంతి మొయిళ్ల నిర్మింప నుత్సాహంబు వొడమె; నంత
మేము. ౩

క. కొనుటకు రొక్కము లేమిఁ
బినబాబయ కాల్చి పిల్చి విడచినచుట్టల్-
తునుకల నేఱి రహస్య
మ్మునఁ గాల్పం దొడఁగితిమి ప్రమోదము హెచ్చఁ. ౪

తే. ఇచ్చవచ్చిన వేళలం దెల్ల మాకుఁ
జిక్కవయ్యె నయ్యెంగిలిముక్కలైనఁ
జిక్కినను బొగ హెచ్చువచ్చెడిది గాదు
ఫలము సున్నయయ్యెను వ్రతభంగమైన. ౫

తే. అట్లగుట సేవకులసొమ్ము ననువుమీఱ
ముచ్చిలించి బీడీలను దెచ్చి కాల్పఁ
గడఁగితిమి; కాని పెద్దలకంటి కెడము
సేయు టెంతయు నిబ్బందియాయె వాని. ౬

తే. కడచె నొకకొంతకాల మిక్కరణి నంత
నలఁతియలఁతిరంధ్రమ్ముల నలరుకొన్ని
కాడలం గాల్చితిమి; కాని కలుగ దయ్యె
నందు సంతృప్తి మాకు నావంతయేని. ౭

తే. అంత మా యస్వాతంత్రిత నరసి వగచి
యేటి కీబ్రదు కెన్నినా ళ్ళిట్లు లేడ్వఁ
గల మిసీ! యని యూహించి కట్టకడకు
నాత్మహత్యయె కర్తవ్య మని తెగించి. ౮

క. ఉమ్మెత్తవిత్తులందు వి
స మ్మొందు నటఁ చెఱింగి సవిధస్థార
ణ్యమ్మునకుం జని తద్బీ
జమ్ముల నార్జించి సందెజాము కదియుడున్. ౯

క. చేరితి మల్లల్లన కే
దారేశ్వరుగుడికి భక్తితాత్పర్యమునన్
గోరి భజించితి మజ్జగ
దారాధ్యుని; దీపపాత్రిమం దిడి నేతిన్. ౧౦

వ. తదనంతర మ్మొక మాఱుమూలకుం జని రెండు మూఁడు
గింజలం గొఱుకుడు. ౧౧

తే. వెంటనే చంపునో కాక యీవిత్తనంబు
తడవు యాతనఁ గూర్చుచోఁ దాళు టెట్లు!
చచ్చిపోయినచో నేమి వచ్చు ఫలము?
పారతంత్ర్యంబుతో నైనఁ బ్రతుకఁదగదె! ౧౨

క. అను నూహ లగ్గలంబై
తునిమె ధృతిన్ స్మృతి యటన్న దుర్భరమగుచున్
బెనఁగొనె భయంబు కంపం
బనూనమై మమ్ముఁ గలఁచె నలమెం జెమటల్. ౧౩

ఆ. అంతఁ జిత్తశాంతి నందఁదలంచి నా
విందుఁ గూడి రామమందిరమున
కరిగినాఁడ; నందు సావధానమ్ముగా
శ్రీనివాసుభజనఁ జేసినాఁడ. ౧౪

తే. తన్నుఁ దాఁ జంపుకొను టన్నఁ దలఁపుపోలెఁ
గడుఁ జులుకనైన కార్యంబు గాదటంచు
నాకు నమ్మిక యేర్పడె నాఁటఁగోలె
నెవఁడు వరియించు మరణంబు నిచ్ఛతోడ. ౧౫

సీ. అవినుత యెవ్వఁడే నాత్మహత్య యొనర్చు
కొండు నే నని పల్కనుండ నేర
దావంతలక్ష్యమే నప్పలుకులపైని నా
కయ్యది యనుభూత మైనకతన;
కీడులో మే లన్న జాడ నాజతనంబు
సిగరెట్ల కొకనమస్కృతి యొనర్ప
సాయంపడియె; ధూమపాయితావాంఛ నా
కవ్వల నుదయింపదయ్యె; మఱియు

తే. నది కడుంగడు హేయమైనట్టిచేత
రోగముల కాలవాల మనాగరకము
దానికై యింత * కుతి యేల దైవమా! జ
నంబుల కటంచు నే నబ్బురంబువడుదు. ౧౬

వ. ఇఁకఁ బ్రతికృతమ్మునకు వత్తము. ధూమపానార్థము నా
యొనర్చిన యీధనచౌర్యంబు నాపదుమూఁడవయేఁటం
బ్రవర్తిల్లె, నవ్వల రెండేండ్లు కడచుడు. ౧౭

క. నాసోదరుఁ డొకఁడు దుర
భ్యాసమ్ములఁ జిక్కి ఋణముపాలయి మివులన్
గాసివడ నేను నాతఁడు
"నీసేగిం గడచుమార్గ మెయ్యది" యంచున్. ౧౮

ఆ. అరసి తుట్టతుదకు నాతనిచేతి బం
గారుమురుగు సుంత కత్తిరింప
నిశ్చయించి వెంటనే పని ముగియించి
తీర్చితిమి ఋణంబు మార్చి దాని. ౧౯

తే. అవల నీచేఁతపై రోఁత యావహిల్లఁ
దగదు తగ దింక నిట్టివర్తన మటంచు
నిశ్చయించి నే గురున కీనింద్యవార్తఁ
దెలిపి మన్నింపుఁ డని వేఁడఁదలఁచికొంటి. ౨౦

* ఇది లాలస యను నర్థముగల దేశ్యము.

తే. జనకుఁ డీమాట విన్న రోషంబు నంది
తిట్టి కొట్టు నటన్న సందియము లేదు
సుతుల నాతండు వాత్సల్యశూన్యుఁ డగుచుఁ
బట్టి బాధించి యెఱుఁగఁ డెప్పట్లనైన. ౨౧

వ. కాని. ౨౨

క. ఇక్కథ విని యుల్లంబు "చి
వుక్కురు" మన నాతఁ డెంత వాగులునో? యను బీ
తొక్కండ నన్నుఁ బెనఁగొనె
నక్కట! నాధైర్యసార మంతట నడఁగెన్. ౨౩

వ. ఐన నియ్యపరాధంబు జనకునకు నివేదించినం గాని చిత్త
శుద్ధి సిద్ధింప దని యెట్టకేలకు సాహసంపడియు, నివ్విష
యంబుఁ బితృసమ్ముఖమ్మున వా విచ్చి పలుకనోడి. ౨౪

క. ఒకచిన్న కాగితముపై
సకలంబు లిఖించి "మదపచారంబున కిం
చుకయు న్వగవక తగుశి
క్ష కూర్పవే! తండ్రి! యింకఁ జౌర్యము సలుపన్." ౨౫

తే. అనియు నందు వ్రాసి యాకమ్మ నాపాద
మస్తకంబుఁ గంపమగ్నమై త
నర్ప నర్పణాం బొనర్చితి మంచము
పట్టియున్న జనకు పాణిసీమ. ౨౬

ఉ. అంత నతండు లేఖను సమస్తముఁ గన్గొని యాణిముత్తెపుం
దొంతరకైవడిన్ విడిచెఁ దోడన యశ్రుకణంబు, లేఖ వి
న్నింతయుఁ, దదంబుపూరములు నిండి తొలంకఁ గగస్థలేఖ నొ
క్కింతవిచారముద్ర ధరియించెగురుండునిమీలితాక్షుఁడై.

క. పిదప నతం డప్పత్రముఁ
జిదురుపలు గావించె, నతనిచిత్తమ్మునయం
దొదవిన వేదనఁ గన్గొని
తుదలేనివిచారజలధిఁ దోఁగితి నేనున్. ౨౮

క. ఆదృశ్యము మఱపునకున్
రా దేనాఁటికిని జిత్రరచనావిద్యా
వైదుష్యము నా కుండిన
చో, దానిం దిద్ది తీర్చి చూపెడివాఁడన్. ౨౯

సీ. పితృపాదలోచనచ్యుతవిశుద్ధప్రేమ
రసపూర్ణబాష్పధారాస్రవంతి
పూత మొనర్చె నా చేతమ్ము నౌర! మ
త్కలుషపంకము నెల్లఁ గడిగివైచె
ఆప్రేమమాహాత్మ్య మనుభవించినవాని
కొక్కనికే వేద్య మూహసేయ
♦ "అనురాగబాణోపహతి చవిసూచిన
వానికే తెలియు నద్దానిమహిమ"

♦ రాగబాణవాగ్యాం రే హోయ్ తే జాణేం.

తే. అనిగదా మాన్యులు కవీంద్రు లాడి రిదియు
నా కహింసాపరిబోధమై నన్ను మేలు
కొలిపె నానాఁడు పుత్రవత్సలతకంటె
నన్య మెద్దియుఁ గానరాదయ్యె దీన. ౩౦

వ. నేఁడుమాత్ర మది కేవల మహింస యని సువ్యక్తమయ్యె
నయ్యది వ్యాపకరూపంబున నెపుడు స్వీకృతంబగు నపుడు
దానిసంస్పర్శనుండి యెవండు నిర్లిప్తుండై యుండఁగలఁడు?
దానిమహిమకుం గొలఁది శూన్యంబు. ౩౧

మంజరి.

తండ్రి యుత్తఱి నింత తాలిమి సూపు
నని యెంచనైతి, నత్యాశ్చర్యజనక
మై నన్నెకెక్కిన యతనిసైరణకుఁ
జర్చింప నాదుదోషపరిగ్రహంబె
కారణంబై నాకుఁ గానవచ్చెడిని
"ఈనేర మిఁకఁ జేయ నిదె బుద్ధి వచ్చె"
నని బాసఁజేసి నిజాపరాధంబు
దండనగావింపఁ దగు నధికారి
ముం దొప్పుకొనుటయే మొదటిపాచితము
నే నిట్టికార్యంబు నెఱపుటంజేసి
"యీతనివిషయమై యిఁక భయం బుండ"
దని నన్నుఁగూర్చి నాయయ్య భావించె
ఆతండు మఱియు నాయందున్నముద్దు
తద్ద గావించెఁ బెద్దయు సంతసించి. ౩౨

# ౯ నాపితృనిర్యాణము-నామహావమానము

క. పదునాఱేఁడులవయసు
న్నది నా కీనాఁడు నేఁడు నాతండ్రి వ్యథా
పదమునకు భగందర మను
గదమునకుం జిక్కెఁ బూర్వకర్మమువలనన్.

సీ. నాతల్లియును నేను బ్రాఁతబం టొకరుండు
నయ్యకుఁ బ్రథమగణ్యంబ యైన
యూడిగంబును సల్పుచుండెడివార; మం
దే నౌషధంబుల నిచ్చుచుంట,

మందులు నూఱుట మఱిఁ గట్టు కట్టుట
మున్నగునూడియమ్ముల నొనర్తు
ఎల్లరాత్రులఁ దండ్రి కేఁ బాదసంవాహ
నక్రియ నిచ్చమై నడపి "యింకఁ

తే. జాలు" నని వార లానయొసంగినప్పుడో
నిదురకుం జిక్కినప్పుడో వదలువాఁడ
నయును గొల్చుట యన నాకుఁ బ్రియతమంబు
నాకు నొకనాఁడు నిందుఁ బరాకు లేదు. ౨

తే. నిత్యకృత్యంబులకుఁ జెల్ల నిలువ యుండు
సమయమును బాఠశాలకు జనకసేవ
కును విభాగించి యెప్పుడేని గురుఁడు ముదల
నిచ్చుచో మాఁపున వయాళి కేఁగువాఁడ. ౩

క. ఆసమయందే సరిగా
నాసతికిం జూలు నిలిచె నా కవ్విషయం
బీసమయమ్మునఁ దలఁచిన
వే సిగ్గు జనించు రెండువిధముల దళమై: ౪

వ. నేను విద్యార్థినయ్యు బ్రహ్మచర్యంబునకుఁ దిలోదకంబులు సమర్పించుటయు, నాధర్మం బగు విద్యావ్యాసంగంబు కంటెను బై పెచ్చు చిన్ననాఁటినుండియు శ్రవణునిశీలంబు నా కాదర్శమగుట నాపరమధర్మంబైన పితృసపర్యకంటెను

మిక్కుటంబుగా భోగములకుఁ గొలువుసల్పుటయు, నయ్యిరు తెఱంగుల లజ్జకుం గారణంబు లయ్యె నక్కాలంబున. ౫

క. కరములు జనకునిపదపం
కరుహంబుల నుండ సెజ్జగదిపై నెద తాఁ
గర మూస నిలుచు భాస్కర
కరతాపం బడఁగు టాదిగ నిసీ! తనకున్. ౬

క. మత మాయుర్వేదము నం
చితలోకజ్ఞానము న్నిషేధించుతఱిన్
గతిఁ దప్పి లతాంగీసం
గతికిం గుతుకంబు సూపఁ గడఁగితి నకటా. ౭

క. తన సేవనుండి జనకుఁడు
నను వీడుటకై నిరీక్షణము సల్పుచు న
ప్పని దీఱుడు నుప్పొంగుచుఁ
జనువాఁడం బడక గదికి శరవేగమునన్. ౮

సీ. అపుడే పితృవ్యాధి యగ్గలం బగుచుండె
జరిగె నానాఁటఁ బెక్కురచికిత్స
అవల నాంగ్లేయవైద్యము పరియుక్తంబయ్యె
గుణ మించుకేని చేకూరదయ్యె

ఇంక శస్త్రచికిత్సయే శరణ్యం బని
తలఁచి బొంబాయిపత్తనము సేరి
కోఁతవైద్యమునందు ఖ్యాతిఁ గాంచినభిష
క్ఛ్రేష్ఠు నాశ్రయించితిమి; కాని
తే. "వలదు వల దీచికిత్స యీవయసునం" ద
టంచు మాయింటివెజ్జు వారించె నతఁడు
గట్టివాఁ డౌట నాతనిపట్టు గెలువ
మఱలివచ్చితి మింటికి మఱుదినంబ. ౯

ఆ. మాకుటుంబవైద్యుఁ డీకొన్నచోఁ దండ్రి
పుండుబాధ తొలఁగియుండుఁగాని
యీశ్వరేచ్ఛ భిన్న, మెవనికి మరణంబు
దరియువేళ మేలివెరవు దోఁచు ? ౧౦

క. పదపడి మజ్జనకునకున్
ముదిరెన్ వ్రణబాధ, దేహమును శుష్కించెన్
బ్రిదుకుపయి శంక వొడమెన్
జెదరెన్ ధైర్యంబు, పలుకుచేవయు సడలెన్. ౧౧

ఆ. పడకయంద యెల్లపనులు ముగించు దు
స్స్థితి జనించెఁ గాని చిట్టచివర
గడియవఱకు నాతఁ డోడఁబడకుండె న
కార్యమునకు, నెంతకష్ట మైన. ౧౨

వ. వైష్ణవమతమ్మున బహిశ్శుద్ధిం గూర్చి బిట్టుకట్టుచట్టంబు లుంటయే దీనికిఁ గారణం; బట్టి శుచియు వాంఛనీయంబ! కాని. ౧౩

సీ. అణుమాత్రమును రోగి యాయాస మందక
పాన్పు మాలిన్యంబు పాలు గాక
పరిశుద్ధి కావంతకొంతయుఁ దెంత వాటిల్లక
యుండుచందంబునఁ, బండియున్న
శయనంబునందె మజ్జనకృత్య మాదియౌ
నక్కఱలం దీర్చునట్టివెరవు
బోధించె భారతభూమికి నాంగ్లేయ
వైద్యశాస్త్రం; బట్టి వర్ణనీయ
తే. శుద్ధి వైష్ణవమతధర్మసూత్రకోటి
యందు నంతర్గతంబుగా నలరుచుండుఁ
గాని నాతండ్రి సలుపు నిక్కఱినచర్య
నెంతయును వింత వొడమ నగ్గింతు నపుడు. ౧౪

మ ధ్యా క్క ర.

బెడిదంబగు తెవులు రేఁగి పెనఁగొనఁ దనయన్న యిట్లు
కడలేనియిడుమలం గుడుచుకథ విని నాపిన్నతండ్రి
యడలొంది పోర్బందరుపురి నప్పుడ తా వీడనాడి
వడివడిపయనంబు లడర వచ్చెను దత్సేవ సలుప. ౧౫

తే. అన్న సెజ్జకుఁ బజ్జ నాపిన్నతండ్రి
కోర్కి మెయిఁ బవల్ నాల్గుజా ల్గూరుచుండి
రేయి నమ్ములనెల్ల నిద్రింపనంపి
యత్తమిల్లుచునుండు నమ్మొత్తకెలన. ౧౬

తే. ఇంతలోఁ గాళరాత్రి తా నేఁగుదెంచె
నిదియ హా! కర్మచండ్రిన కిజ్జగానఁ
దుట్టతుది రే యటం చూహ తట్టదయ్యె
మా కనారతమై భీతిమాత్ర ముండె. ౧౭

క. అది నిసిఁ బండ్రెండవగడె
కదిసినసమయంబు; తండ్రికా ళ్లొత్తుచు నే
నెదిరించునిదురతోడం
గదనం బొనరించుచుంటిఁ గడిమి వెలుంగన్. ౧౮

తే. నాయవస్థను దిలకించి నాపితృవ్యుఁ
"డే నిచట నుందుఁ, బవళింపు మీవు వెడలి"
యని వచించుడు నానందమున మునింగి
సెజ్జగది కొక్క పెట్టునం జేరినాఁడ. ౧౯

క. పాపము! నిద్రావశయై
నాపైదలి శయ్య నుండె, నవలా నపుడే
లేపితి, నే నట నుండఁగ
నేపగిదిం గూర్కు నామృగేక్షణ నిశలన్. ౨౦

ఆ. అవలఁ గడచిపోయె నైదాఱునిముసంబు
లంత భృత్యుఁ డొక్కఁ డరుగుదెంచి
"చాలజబ్బులోన జనకుఁ డున్నాఁడు లెం"
డనుచుఁ బల్కెఁ దలుపు నట్టె తట్టి. ౨౧

ఆ. చాలజబ్బులోన జనకుఁ డున్నాఁ డని
మున్నె తెలియుఁగానఁ దన్నిమేష
మందుఁ "జాలజ" బ్బటంచన నర్థవి
శేషమొండు దోఁచెఁ జిత్తమందు. ౨౨

తే. అంత నే సెజ్జపై నుండి యపుడ దూకి
"యెట్టు లున్నది జనకున కేమి జరిగె?"
ననవుడు నెలుంగు రాల్పడ నతఁడు "బాబు
గారు మనలోకమును వీడినార" లనియె. ౨3

సీ. దుర్భరదుర్దాంతదుఃఖంబు లజ్జయు
మూరిఁబోవుచు నన్ను ముట్టడించె
నంతట గురుఁ డుండునట్టిపట్టున కేఁగి
యసుఱువాసిన తండ్రియొడలిఁ గాంచి
"కామాంధకారంబు కనులఁ గప్పకయున్నఁ
బశువృత్తి కేను లోఁబడకయున్నఁ
దుదిని మేషంబులందును బిత్రుమరణవే
గనఁ బాలు వడసియుండునుగదా య

తే. టంచుఁ జింతించినాఁడ; నే నయ్యకాళ్లు
పట్టుచుండ నతండు నాపాణియంద
జీవ మెడసి యుండును గాని చిన్నతండ్రి
కైవసం బయ్యె నట్టిభాగ్యంబు తుదకు. ౨౪

క. అతఁ డగ్రజుదెస నెప్పుడు
నతులంబగుభక్తి సూపు నట్టిఁడు; గానన్
జతపడె నయ్యనఘున కీ
గతి నంతిమసేవ సల్పఁగలభాగ్య మహో. ౨౫

వ. అది యట్లుండె. ౨౬

తే. మరణవేదన కెంతయు న్మలసిమలసి
నిలువ దియ్యెడ లిఁక నంచుఁ దెలిసి గురుఁడు
సైఁగఁజేసి కలమ్మును గాగితమ్ము
నందికొని "సిద్ధమొనరింపుఁ" డని లిఖించె. ౨౭

క. తనసందిటఁ గల తాయె
త్తును గుత్తుక నున్న స్వర్ణతులసీదామం
బును దీసివైచె నవ్వాలి
క్షణమున లేఁడయ్యె నతఁడు జగమం దకటా! ౨౮

తే. ఒక్కదెసఁ దండ్రి యమబాధ స్రుక్కుచుండ
నొక్కదెస నే మరుల్కొంటి నువిదపైని
మాయురే! యిది మాయనిమచ్చ యగుచు
నన్ను బాధించుచుండు ననారతంబు. ౨౯

సీ. మూఁడగునధ్యాయమును సంతరించుచు
మున్ను సూచించిన బన్న మిదియ
మెలఁకువమై నేను మెలఁగంగఁ దగువేళ
విషయసక్తుండనై వెలయుకతన
మాతరపితలపై మహనీయమగుభక్తి
నా కుండినను, దాని నడపుకొఱకు
జంకుగొంకులు లేక సర్వస్వ మర్పింపఁ
జాలియుండిన నది చాల వెలితి
తే. వడియ యున్న దటంచు నేర్పడియె నిట్టి
నేర మేనాఁటికేని మన్నింపరాని
దగుట నే నేకపత్నీవ్రతావలంబి
నయ్యుఁ గామాంధుఁడ నటంచు నాత్మ నెంతు. 30

వ. పెద్దకాలంబు శ్రమించియుఁ బెక్కుగండంబులం గడచియు
నీలోపంబు రూపుమాపఁగల్గితి; వెండియు. 31

ఆ. నరముఁబోనికూన నాచాన కిత్తరు
ణానఁ బుట్టి మూఁడునాల్గునాళ్ల
కసువులం దొఱంగె నంతియ కాక వే
ఱొండుభంగి జరుగునోటు? వగవ. 32

వ. నా తెలివిడిం గుర్తించి పరిణేతు లెల్లరుం గన్నుదెఱతురు
గాక! 33

# ౧౦ మతములలో స్వల్పప్రవేశము

క. ఆఱవయేఁ డాదిగఁ బదు
నాఱవయబ్దంబుదనుక నలు విద్యావ్యా
సారమ్ము నెఱపి పెక్కులు
నేరిచితి న్విషయముల మనీషులకరుణన్.

వ. కాని మతసంబంధిప్రబోధంబు నా కిసుమంతయేని పాఠశాలయందు లభింపదయ్యె, నద్దానిఁగూర్చి నాపరిసరమ్ముల నించించుక యెఱుంగుచుంటి మతంబన నాత్మసాక్షాత్కారంబనియొండె నాత్మజ్ఞానం బనియొండె నాయాశయమ్ము

ఆ. నేను వైష్ణవుండఁ గాన విష్ణ్వాలయ
మునకుఁ బెక్కుమార్లు చనెడివాఁడఁ
గాని దాన నిచ్చ కల్గద! మఱి నస
హ్యంబు వొడమె దానిడంబ మరయ. ౩

క. అట నీతివిరుద్ధము లగు
ఘటన ల్గల వనియుఁ దెలిసెఁ గావున నే న
చ్చటు త్రొక్కుట విరమించితి
నిటు దేవాలయము నాకు నించకపోవోఁ. ౪

తే. అట్లగుట నాకు విష్ణ్వాలయంబువలనఁ
బట్టువడినట్టి దేమిఁ గన్పట్టదయ్యెఁ
గాని కోవెల నా కీయలేని దాని
నొసఁగె మాయింట వసియించుముసలిదాది. ౫

తే. అమ్మగువ రంభ యను పేర నలరుచుండుఁ
గరము వాత్సల్యమున నన్ను గారవించు
నామెపై నాకు విశ్వాస మగ్గలంబు
విస్మృతికి రాదు నేఁడు నవ్వాలఁదిచరిత. ౬

క. భూతప్రేతము లన నేఁ
గాతరతం జెందుచుంటఁ గని తత్ప్రతి "నీ
భీతిన్ బోకార్పఁగ వి
ఖ్యాతం బగు రామనామ మౌషధ" మనియెన్. ౭

క. అనవుడు నాభయబాధం
దునుమాడ జపంబు సేయఁదొడఁగితి నతిపా
వనరామనామమంత్రం
బనూనవిశ్వాసపూర్ణ మగుచిత్తమునన్. ౮

వ. అయ్యది పెద్దకాలంబుమాత్రము కొనసాఁగదయ్యె, నట్లయ్యు లేఁబ్రాయమున్నను మన్మానసక్షేత్రంబు నాశ్రయించిన యవ్విత్తనమ్ము రిత్త కాదయ్యె నీనాఁడు రామనామంబు నాకప్రతిహతం బగు నోషధి యగుటకు నాఁడు మారంభ నాటినబీజంబ కతంబు. ౯

సీ. అపుడ రామచరిత్ర నతిభక్తిఁ బఠియించు
ఘనుఁడు నాపెదతండ్రితనయుఁ డొకఁడు
నాచిన్నయన్నకు నాకును నేర్పించె
రామరక్షాస్తోత్ర; మేము దానిఁ
గంఠస్థ మొనరించి కడఁకమై మజ్జన
పర మెల్లరేపులం బఠనసేయఁ
బూనితి; మిప్పనికిఁ పోరుబందరు వీడి
యల రాజకోటయం దడుగు మోపు

ఆ. సరికి సడలె; దీనిఁ జలుపుటయందుఁ బ్ర
త్యయము కుదురకున్న నాదినుండి
భ్రాతృగౌరవంబుఁ బ్రస్ఫుటోచ్చారణా
హంకృతియుఁ గతంబు లగుచు వచ్చెఁ. ౧౦

క. బందరులో మజ్జనకుఁడు
మందుం దినువేళ నెల్ల మాఁపుల నమృత
స్యందని రామచరిత్ర న
మందానందానుభూతిమై వినుచుండున్. ౧౧

తే. రాణఁగన్న "లాధామహారాజ" సూరి
రామచరణారవిందచింతామరంద
పానపరిమత్తచిత్తుఁ డప్పట్టునందు
వక్త యయ్యె బిల్వేశ్వరావాసవాసి. ౧౨

మంజరి.

అతఁడు కుష్ఠవ్యాధి కగ్గమై తొల్లి
యౌషధసేవనం బాసింపఁబోక
బిల్వేశనిర్మాల్యబిల్వపత్రముల
గాయంబులకుఁ గట్టి కడుభక్తితోడ
రాత్రిందివమ్ము శ్రీరామనామంబు
జపియించి దుర్వ్యాధిజయ మందె నంట;
ఇది నిజంబో! కాదో! యెట్లైన నేమి
నాకు నిచ్చరితపై నమ్మకం బొదవె. ౧౩

క. మృదుమధురస్వరసంపద
పొదల నతం డతులభక్తిపూరితుఁడై చౌ
పదముల ద్విపదలఁ బాడుచుఁ
బదార్థముం దెల్పు హర్షపరవశుఁ డగుచున్. ౧౪

తే. అతనితోఁ బాటు శ్రోతృసంతతియు నొడలు
మఱచు నవ్వినుకలియె రామాయణంబు
మీఁదఁ గల్గించె నాకు నత్యాదరంబుఁ
బదియుమూఁడేఁడు లుండు నప్పటివయస్సు. ౧౫

తే. భక్తిపూరితకావ్యప్రపంచమందు
దివ్యకవితాకళాసముద్దీపితంబు
తులసిదాసకృతంబు నిస్తుల్య మంచు
విశ్వసింతు నిపుడు రామవిభుచరిత్ర. ౧౬

వ. తదనంతరం బేము కతిపయమాసమ్ములకు రాజకోటకుం జేరితి మందు హరివాసరంబులం దెల్ల భాగవతశ్రవణమ్ము ప్రవర్తిల్లుటం జేసి తదాకర్ణనకుతూహలాయత్తచిత్తుండనై యే నప్పుడప్పు డప్పురాణగోష్ఠికిం జనితిఁ, గాని పౌరాణికుండు రచ్చకున్ మెచ్చువాఁడము పడువున వాక్రుచ్చువాఁడు గాఁడయ్యె; నప్పాత్రమ్ము బత్తికిం దావలం బని యుత్తఱి నెఱింగినాఁడ; నద్దాని నాతల్లిబాసం జదివి పారవశ్యంబు నందితి వెండియు. ౧౭

క. వారణనగరమ్మున ము
వ్వారము లే నుపవసించువడి నంతర్వా
ణీరత్నమదనమోహనుఁ
డారమణీయార్థకల్పనాగారమునన్. ౧౮

క. భాగవతంబున నయ్యయి
భాగంబుల వినిచి నన్నపారం బగు ము
త్సాగరమునఁ దోఁగించె మ
నోగతసంతాపరాశి నుగ్గొనరించెన్. ౧౯

సీ. అత్తటి "మదనమోహనుఁ బోని భక్తావ
తంసంబు భాగవతంబుఁ జిన్న
తనమంద వినిపింప వినఁగల భాగ్యమ్ము
గల్గిన నాకు నక్కాలమంద
యద్దానిపై గాట మగు నాదరంబు సి
ద్ధించుఁగదా!" యంచు నెంచినాఁడ
నపు డుద్భవించు శుభాశుభసంస్కార
ములు సుస్థిరంబులై నిలుచుఁగాన

ఆ. భాగవతమునట్టిభవ్యకావ్యంబుల
బాల్యదశను వినుటఁ బడయనైతి
నే! యటంచు నాకు నెల్లవేళల విచా
రంబు వొడము మానసంబునందు. ౨౦

వ. అయినను. ౨౧

తే. అఖిలమతసంప్రదాయమ్ములందు నాకుఁ
గుదిరె సమదృష్టి యలరాజకోటలోన
నందు హిందూమతమ్మునయందు మివులఁ
బాదుకొనిపోయె నాదరభావగరిమ. ౨౨

క. అచ్చట నాతలిదండ్రులు
నిచ్చలుఁ జనుచుండ్రు రామనిలయంబునకున్
జిచ్చుకను వేల్పుగుడికిం
బొచ్చె మ్మొడయైన బత్తి పొంపిరివోవన్. ౨౩

క. నను వార లనుదినంబును
గొనిపోవుచు నుండువారు గుడికిం దమవెం
టను; విమలచిత్తమునఁ బ్రా
ర్థనగీతులఁ బాడుచుండెదను నేను నటన్. ౨౪

క. వెండియు జైనగురు ల్గురు
దండకు వేంచేసి పెక్కుధర్మంబులపై
మెండుగఁ జర్చల నెఱపుచు
నుండెడివా రెపుడు శ్రోత లోహో! యనఁగన్. ౨౫

వ. అదియునుంగాక. ౨౬

సీ. కలరు మత్పితకు మిత్రులు పెక్కురు మహామ్మ
దీయులుఁ బార్సీలు ధీరమతులు
తమమతంబులఁగూర్చి తగురీతిఁ బలుమాఱు
వచియించుచుండెడివారు వారు
వినుచుండు నవధానమును బేర్మి పేర్మియు
న్వాలయ నాతండ్రి తద్విషయమెల్ల
నతని కేఁ బరిచర్య లాచరించుచునుంట
నాలించువాఁడ నయ్యాయిచర్చ

తే. లెట్టిలాభంబులన్నియు నెనసి మతము
లన్నిటం దుల్యగౌరవం బంకురింపఁ
జేసె నా కష్టు; వృద్ధోపసేవనంబు
వలన సిద్ధింపఁజాలనిఫలము గలదె? ౨౭

వ. అయ్యాదన న్నా కొక్క క్రైస్తవమతపరిచయంబ శ్లేషించి
యుండెన త్తరుణంబునం దేతన్మతపరిచారకులు కొందఱు
మాపాఠశాలచెంతకుఁ జేరి. ౨౮

క. హిందువుల వారివేల్పుల
నిందించుచుఁ బల్కుచుండ నే డెందమునం
దందుల కెంతయు నేవం
బందితిఁ దన్మతమునం దనాదర మొదవన్. ౨౯

మంజరి.

అపుడె పేరందినహైందవుం డొకఁడు
క్రైస్తవమతదీక్షఁ గైకొనె ననియు
నవల గోమాంస మాహారించుటయును
నింద్యమౌ మధుపాననియతిఁ గొంటయును
దనవేషభాషలం దలఁగించుటయును
నాతని కనివార్య మైపోయె ననియుఁ
గోటలం బేటలం గోల హెచ్చయ్యె
నది వినుడుఁ "జివుకుక్కు" రనియె నామనసు. 30

తే. ఆఁబోలసుఁ దింట మద్యంబు నానుచుంట
వేసమునయందు బాసపై వెగటుఁగొంట
నెద్ది శాసించు నది మతంబే యటంచుఁ
దలఁచితిం గోపతాపముల్కలఁత వెట్ట. ౩౧

క. ఈనడుమంత్రపుఁగ్రైస్తవుఁ
డేనెరసో పరిగణించి హిందూమతవి
జ్ఞానమ్ముల నిందింపం
బూనినవాఁ డనియుఁ గర్ణపుటములఁ దాఁకెన్. ౩౨

వ. ఇప్పరిస్థితులెల్లఁ గ్రైస్తవమతంబుపై నాకు రోఁతఁబుట్టింప హేతువు లయ్యెఁ దక్కినమతమ్ములందు నాకుఁ దుల్యాదరంబు వొడమె నని నొడివినంతమాత్ర నీశ్వరునియందుం దిరంబులగు శ్రద్ధాభక్తులు జనియించె ననంబోలదు; వెండియుం.

తే. మనురచితధర్మశాస్త్రంబు జనకపుస్త
కాలయస్థంబుఁ గన్గొంటి నపుడు, దానఁ
దనరు సృష్ట్యాదిచర్యలం దఱచిచూడ
నీశ్వరునిమీఁదినాశ్రద్ధ హెచ్చదయ్యె. ౩౪

క. ఇంచుక నాస్తిక్యముఁ బ్రా
ప్తించెను నాకపుడు, నామదిం గల శంకల్
వించితిఁ జదువరి యని పే
ర్గాంచిన పినతండ్రిపట్టికడఁ దగు భంగిన్. ౩౫

తే. అతఁడు నాసందియమ్ముల నడఁపఁబోక
తగవు నీ క్లిష్టప్రశ్న లిత్తరుణమందు
వయసు హెచ్చినవేళ సర్వంబు నీక
యెఱుకపడుఁ జుమ్మ! పొమ్మంచుఁ గఱదలాడె. ౩౬

వ. అనుటయు. ౩౭

ఆ. మిన్నకుంటిఁ గాని నన్నుఁ బీడించుట
మానదయ్యెఁ దదనుమానరాశి;
మఱియుఁ జోద్యమయ్యె మనువు భోజ్యాభోజ్య
విధులు నిర్ణయించువిధముఁ గన్న. ౩౮

వ. అందు లోకాచారవిరుద్ధంబుగా మాంసభక్షణంబు నంగీకరించు ధర్మసూత్రంబులు కొన్ని కానంబడియెఁ గాని. ౩౯

తే. విద్యయు వివేకశక్తియు వృద్ధియైన
నీడు ముదిరిన ననుభూతి యెక్కుడైన
నపుడ యీసంశయములెల్ల నడఁగిపోవు
నని తలఁచి యూరకుంటి నయ్యవసరమున. ౪౦

ఆ. ఇట్టు లపుడు మను వహింసాప్రబోధ మ్మొ
నర్పకుంట మున్ను నాయొనర్పు
తరసభక్షణంబు తద్ధర్మశాస్త్రస
మ్మతమ కా యటంచు మదికిఁ దోఁచె. ౪౧

తే. సర్వమత్కుణముఖజంతుసంతతులను
హత మొనర్చుట నీతిసమ్మతమ యంచుఁ
దోఁచుటం గొన్నినల్లులఁ బీచమడఁచి
నాఁడ నక్కటిక న్వీడనాడి యపుడు. ౮౨

వ. ఐనను జగత్తునకు నీతి పునాది యనియు, నద్దానికి సత్యంబు మొదటియాధరు వనియు, నాయుల్లంబున దృఢవిశ్వాసంబు పాదుకొనియెఁ గాన సత్యంబ నాకు వలయునర్థంబు. దానిగొప్పతనంబు నిరంతరము నాదృష్టిం బుష్టినందు చున్నయది. వెండియు సత్యముంగూర్చి నా కావించులక్షణంబును విస్తరిల్లెడి; నదియునుంగాక. ౮౩

సీ. * "సలిలంబు నీకు నీఁగలిగినవానికి
నిష్టమృష్టాన్నంబు నిడఁగదయ్య
కేల్మోడ్పు నిడువానికిం భక్తిసంయుక్తిఁ
జాఁగిల్లి జోహారు సలుపవయ్య

* పాణీ ఆపనేపాయ భలుం భోజనతో దీజే
ఆవీనమావే శీశ దండవత కోడేకీజే;
ఆపణఘా సేదామ కౌమ మహోరోనుఁ కరీ ఏ
ఆపఉగారే ప్రాణ తేతణా దుఃఖమాం మరీ ఏ
గుణకేడేతో గుణదశ గణో మన వాచా కర్మే కరీ
అవగుణకేడే జేగుణకరే తేజగమాం జీత్యోసహీ.

తృణకణం బేని నీ కిచ్చుపుణ్యాత్మున
కపరంజినాణె మీాయంగదయ్యా
కడగండ్ల నీకుఁ జోడ్పడెడివానికి నీశ
రీరమేఁ గోసి యర్పింపవయ్యా

తే. ఇచ్చుచో నొందు దశగుణం బిచ్చు టొప్పుఁ
గీడుఁ గూర్చిన మేలు గల్గించు టుఱవు
చిత్తవాక్కర్మశుద్ధిమైఁ జేయు వీని
నెవ్వఁ డాతండ గెల్చుఁబో! యిజ్జగంబు". ౪౪

తే. అనెడు గుజరాతనీతిపద్యం బొకండు
నామనంబునఁ దద్దయు నాటుకొనియె
నందుఁ "గీడొనర్చిన మేలు నాచరింపు"
మన్నసూక్తి జీవనసూత్ర మయ్యె నాకు. ౪౫

# ౧౧ సీమకుఁ బ్రయాణసన్నాహము

క. పదునెన్మిదివందలయె
న్బదియేడవయేఁట జయము వడసితి నే నిం
పొదవఁ బ్రవేశపరీక్షను;
బిదపఁ గళాశాల కేఁగఁ బ్రియపడినాఁడన్.

వ. అంత భావనగరమ్మునం గల శ్యామలదాసకళాశాలకుం జేరి యందుఁ జదువం దొడంగితిఁ గాని యచ్చటియుపన్యాసంబులు నాతల కెక్కమి నుక్కిరిబిక్కిరి యయ్యె నిందు నాచార్యులలోపంబు రవంతయుం గానరాదు. వారి కెంతేని ప్రసిద్ధియుం గలదు. నా కసుగాయతనంబ దీని కెల్ల

నిదానంబు. ఇట్లు బహుప్రయాసమ్మునఁ గాలంబు నీడ్చుచు
నర్ధవార్షికవిశ్రాంతిదినమ్ములం గడప నింటికిఁ బోయితి
నయ్యవసరంబున మాకుటుంబమునకుం బ్రాఁజెలికాఁడును
హితుండును విప్రుండును జదువరియు లౌకికజ్ఞానపూర్ణుం
డును నగు "మాధవజీదవే" యనునతం డొకనాఁడు మా
నెలవునకు వచ్చె నితనిని మేము "జోషి" యనియుం
బిలుచువారము. ౨

తే. అతఁడు నాతల్లితోడఁ బెద్దన్నతోడ
మాకుశలవార్తలం గూర్చి మాటలాడు
వేళ నాకళాశాలాప్రవేశ మెఱిఁగి
యిట్లు వచియించె నాదరం బుట్టిపడఁగ. ౩

మ. తలకిందయ్యెను గాల మిప్డు తగువిద్యల్ నేర్వమింజేసి మీ
రలు మీపూర్వులకైవడిం బ్రెగడలై రాజేంద్రులందన్వి యు
జ్జ్వలకీర్తిం గనఁజాల రీతఁ డయినన్ సద్విద్య నార్జించి వా
రలవాసిన్నిలువంగఁబెట్టునటు లీరల్ యత్నముం జేయుఁడీ.

సీ. ఇతఁడు పట్టపరీక్షఁ గృతకృత్యుఁ డగుట కిం
కను నాలుగైదేండ్లు గడవవలయు
నప్పుడైన నేచిన్నయధికారమో గాని
పెద్దగడపదవి నార్జింపఁజాలఁ
డెన్నినాళ్లో పట్టు మన్నందనుండు కే
వలరాముపలె న్యాయవాది యగుట

కానాఁటి కెందఱో న్యాయవాదు లమాత్య
    తాసిద్ధికై ప్రయత్నం బొనర్తు

తే. ర ట్లగుట వీని సీమకు నంపు టొప్పు
నచట బారిస్ట రగు టనాయాస మందు
రింటికిం జేరవచ్చు మూఁడేండ్లలోన
వెచ్చమున కొక్కనాకైదు వేలు చాలు. ౫

తే. పిలిచియిత్తురు బారిస్టరుల కమాత్య
పదవి నెందేని ధారణీపతులు పేర్మిఁ
దడవు సేయక మోహనదాసు నంపుఁ
డాంగ్లభూమికి; నాహర్ష మతిశయిల్ల. ౬

తే. మత్సుతున కచ్చటం బెక్కుమంది నెయ్యు
రున్నవారు ప్రసిద్ధిని గన్నవారు
వారి కతఁ డిచ్చు నెఱుకకై వలయు కమ్మ
లితని కిబ్బంది కలుగ దొక్కింత యేని. ౭

క. అతఁ డి ట్లని నే నాతని
హితమ్ము నీకొన్నయట్ల యెంచి కృపాము
దితదృష్టి నన్నుఁ గన్గొని
"కుతూహలము లేదె? సీమకుం జన నీకున్." ౮

తే. అనుచు నుప్పొంగి సంతోషవనధి బ్రుంగి
"యింతకంటెను స్పృహణీయ మెద్ది కలదు?
సిద్ధముగ నుంటి నింగ్లాండు చేరి చదువ
నెంతరయముగ నంపిన నంతలగ్గు." ౯

వ. అని పల్కి "త్వరితమ్ముగాఁ బరీక్షలయం దారితేఱుట కష్టసాధ్యమ్ము కాన వైద్యశాస్త్రంబుపై నామనంబు తవిలి యున్నది. దానిం జదువ సమ్మతింతురే?" యని నేను వారిం గోరుచు మదగ్రజుం డిట్లనియె. ౧౦

మంజరి.

ఎఱుఁగవే మనతండ్రి యెన్నేనిమార్లు
వైద్యం బటన్న నేవంబును గనుట
"మన మల్ల వైష్ణవమతమునం దుంట
మనకుఁ బీన్గులఁగోఁత మర్యాదయగునె"
అని వార లపుడప్పు డాడుచు నుంట
నినుఁ గూర్చియే సుమీ! నిక్కంబు నరయ
న్యాయశాస్త్రంబు నీ వభ్యసించుటయె
జనకపాదులకు నిష్టంబైన సేఁత. ౧౧

తే. అనుచు జోషియు నప్పల్కు లనువదించి
"యితరశాస్త్రంబులం గోర్కి యేల నీకు
న్యాయశాస్త్రంబె నిన్ను జేగీయమాన
చరితుఁ గావించు మదుపదేశంబు వినుము. ౧౨

వ. ఇట్లు బోధించి యప్పాఱుండు మాయమ్మకడ సెలవునంది
నిజనివాసంబునకుం జనియె నంత. ౧౩

సీ. ఆశాలతాజాల మది నామనోవీథి
నల్లిబిల్లిగ నట్టె యల్లుకొనుడు
నిర్మింపఁ బూనితి నిరుపమశిల్పసం
పద పెంపు దీపింప బయలిమేడ
"లర్థంబు తగినంత యలవడు నెట్లొకో
ఖండాంతరముల కేకాకిఁ జేసి
యీతమ్ముఁ గుఱ్ఱ నేరీతిఁ బంపుదు నొకో"
యనుచింత మున్నె నాయగ్రజుండు

ఆ. నన్ను విడువలేక నాతల్లి నిర్మల
ప్రేమమూర్తి యార్తి బిట్టు వగచి
మధ్వదేశయాత్ర మానింప నొకయుక్తి
పన్ని యిట్టు లనియె నన్నుఁ గూర్చి. ౧౪

క. అన్నా! కలఁడు గదా మీ
పిన్నయ్య కుటుంబమునకుఁ బెద్ద యతఁడు ము
న్మ న్నిందుఁ దదంగీకృతిఁ
గొన్నక్ మన మెల్ల నరసికొందము పిదపక్. ౧౫

వ. నావుడు నాయన్న యిట్లనియె. ౧౬

సీ. పరికింపఁ బోరుబందరుదివాణంబుపై
మన కించుకంత స్వామ్యంబు గలదు
నేఁ డచ్చటం గార్యనిర్వాహకపదంబు
నందు "లేలీ" యనునతఁడు వెలయు
అతనికి మనయందు నాదరం బధికంబు
మఱియుఁ బితృవ్య సమ్మాననీయుఁ
డెంతేని మన్నించు నిపుడు నీవిద్యకై
యొడయండు కొంతసా మ్మొసఁగునట్టు
తే. లతఁడు తోడ్పడవచ్చు నం చనుడు నాకు
వచ్చె నప్పలుక లుత్సాహ మెచ్చిపోయె
నప్పుడ పయనంబు గట్టి నాలైదునాళ్ల
కేఁగితిని బందరున కొంటె నెక్కి స్రుక్కి. ౧౭

ఆ. అంతఁ బిన్నతండ్రిచెంతకుఁ జేరి సా
ష్టాంగవందనంబు నాచరించి
విషయమెల్ల విన్నవించుడు శ్రద్ధమై
నరసి యాతఁ డిట్టు లానతిచ్చె. ౧౮

తే. భారతీయుండు నిజమతాచారసరణి
విడువ కింగ్లాండునం దుంట కడు నసాధ్య;
మేమిభేదమ్ము గాన్పించు నిపుడు వెలయు
నల్లబారిస్టరునకును దెల్లదొరకు. ౧౯

క. అతఁ డశనమ్ముదెన విధి
ప్రతిషేధము లుఱఁడు ధూమపానంబు ననా
రతముం గావించును సి
బ్బితి మాలి ధరించు నాంగ్లవేషము నిస్సీ. ౨౦

వ. మనకుటుంబ మిట్టిమనుగడకు దూరమైయుంట యెంతయు
నుచితంబు; మఱియు. ౨౧

తే. అచిరకాలంబునం దీర్ఘయాత్ర కేఁగ
నుంటి నే నింకఁ బెక్కునా ళ్లుంట కల్ల
కాటికిం గాళ్లు సాఁచి యేకరణిఁ గడలి
పయన మంగీకరింతు నిప్పట్టునందు. ౨౨

తే. ఐన నీపోక కే విఘ్న మాచరింప
నొల్ల నిత్తఱి నీకు నీతల్లి యొసఁగు
సమ్మతియె ముఖ్య మామె కిష్టంబ యైన
నీవు గ్రక్కునఁ బొగయోడ నెక్కవోయి. ౨౩

క. ఏ నడ్డ మాడ నని య
మ్మానినికి న్విన్నవింపుమా! తత్సతి నీ
కాన యొసంగిన నేనుం
బూని శుభాశీస్సు లొసఁగి పుచ్చెదఁ జుమ్మా. ౨౪

సీ. అనవుడు నుపొ్వంగి "యంతియ చాలు నో
యనఘ! మజ్జనయిత్రియాజ్ఞ వడయ
నీఁక యత్న మొనరింతు నింకను మీ రొక్క
సాయం బొనర్పఁ డీసమయమందు
నాసీమపయనంబునకు "లేలి"దొర కొంత
యార్థికసాహాయ్య మాచరించు
గతిఁ బరిచయపత్రి మతనిపేర నొకండు
దయసేయుఁ డో పిన్నతండ్రి!" యనిన
ఆ. "నే లిఖించు టెట్లు? నీవ విన్నప మొన
రించుకొ మ్మతండు మంచివాఁడె
మనకుటుంబ మన్న మన్నన సూపు సా
యం బొనర్పవచ్చు నర్హ్భంగి." ౨౫

వ. అని పల్కి యతండు నన్ను మిన్నకయ పంపె నీపాటి మేలొనర్ప నాపితృవ్యుం డేల నిరాకరించెనో చెప్పఁజాలఁ గాని తా దూష్యం బని విశ్వసించు నాఖండాంతరప్రయాణమ్మునకుఁ బ్రత్యక్షసాహాయ్య మాచరించుట యుచితంబుగా దని యతండు వెన్నాడి యుండు నని నాతలంపు. ౨౬

క. అంతట నే "లేలీ"దొర
చెంతకుఁ జని వంగివంగి చేసి ప్రణామం
బెంతయు మెలఁకువఁ బూని హృ
దంతర్గతవాంఛితంబు నాతనితోడన్. ౨౭

తే. మనవి సేయుదు "నే మణుమాత్రమేని
దోడుపడ మిష్ఠు పట్టభద్రుండ నైన
వెనుక మముఁ జూడ రమ్ము పో" మ్మనియె నాతఁ
డట్టె నిల్వ్వాన నీ జ్ఞాతి నపుడు నేను. ౨౮

ఆ. ఆస లెల్ల నిట్లు వీసరవోవ న
చ్చోటు వాసి రాజకోట సొచ్చి
జోషికి న్మదగ్రజునకును దల్లికిఁ
దెలిపితిం బ్రయాణఫలిత మెల్ల. ౨౯

క. అత్తఱి జోషి ననుం గని
"చిత్తమ్మునఁ దత్తరమ్ము సెందక యుం దే
విత్తమ్ము నప్పుగాఁ గొని
యుత్తమకార్యంబు దీని నొనరుచు టొప్పున్" ౩౦

క. నావుడు ఋణంబు వ్రణము గ
దా! వల దీసేఁత నాదునర్ధాంగివిభూ
షావిసర మమ్మి పడమటి
దీవికిఁ బోఁదగదె యంచుఁ దెలిపితి నేనున్. ౩౧

తే. "అంతదూరంబు వో నేటి కనుజ! నాదు
సర్వశక్తులఁ జూపి విశ్వప్రయత్న
మాచరించి సిద్ధ మొనర్తు నర్థ" మని స
మగ్ర మగు పేర్మిఁ బలికె మదగ్రజుండు. ౩౨

తే. అతఁడు ప్రేమించు నన్నుఁ దా సుతునివోలె
నతనియౌదార్యసంపత్తి కవధి సున్న
యతనియెడ నాకు ననుపమంబైన భక్తి
యతనిదెస నాకు విశ్వాస మగ్గలంబు. 33

సీ. మజ్జనయిత్రికి మాతృ మిష్టంబు గా
దయ్యె నింకను మదీయప్రయాణ
మాంగ్ల దేశమ్మున కరిగినగో వాళ్లు
భ్రష్టు లయ్యెద రెల్లవగల నంచు
నామె కొక్కఁడు సెప్పె నంజక గోమాంస
మారగింతు ర టంచు నాడె నొకఁడు
మదిరఁ ద్రావక యున్న బ్రదుకలే రనె నొకం
డేమేమొ బోధించె నింక నొకరుఁ

తే. డిట్టికత లామెచిత్తమ్మునట్టె కలఁత
పెట్ట నాయమ్మ "పట్టి! నీ వెట్టు లెల్ల
చెట్టలకుఁ బుట్టినిల్లైన సీమ నుందు?
విట్టలం బగుకీర్తి నట్టేటఁ గలపి" 34

క. అని నన్నుఁ బృచ్ఛ సేయుడు
జననీ! నీ కేల యిట్టిశంకలు బుజావ
ర్తన మించు కేనియు న్వీడ
నని శపథ మొనర్తు నమ్మవా? నాపలుకుల్. 35

క. ఏదే నపాయ మున్నన్
గా దని వారించుఁ గాని *కామక పొమ్మం
చా దేశింతురె? మనగురు
పాదు లోడంబడుదు రొక్కొ భ్రాతలు సెపుమా. ౩౬

ఉ. నావుడుఁదల్లిపల్కెఁబ్రియనందన!నీహృదయంబుదూష్యపుం
ద్రోవలఁద్రొక్కెడంచెలుఁగుదుంజుమినే;నటులయ్యుదూరపుం
దీవుల నున్న వేళ దురతిక్రమమై పరధర్మ మంటి ని
న్నేవిధినీడ్చునో! చెడుగునెంచిశుభంబుగణించుటొప్పగున్.

వ. ఇప్పట్లఁ గింకర్తవ్యతామూఢనై యే నున్నదాన. నా సం
దియమ్ముల బేచరజీస్వామికి విన్నవింతుఁగాక! యని పల్కె
తొలుత మత్కులజుండును బదంపడి జైనసాధువు నై
మోక్షేమంబుల నిచ్చలు నిచ్చగించు నక్కర్మందిం జేరి తన
భావమ్ముల నెల్ల వెల్లడింప నతండు నాపోకకు ననుకూలుం
డై యామె కిట్లనియె. ౩౮

తే. నిజమరి యితండు దీన సందియము లేదు
గాన నిత్తఱి మాఁడు వాగ్దానములను
వీనివలనం గ్రహించి యవ్వెనుక సీమ
కంపఁ దగు నట్టులైన భయంబు రాదు. ౩౯

వ. అని పల్కె. ౪౦

* ఇది "తప్పక" యనునర్థముగల దేశ్యపదము.

తే. "మాంసమును మెక్క మద్యంబు మరగ నెపుడు
నంగనం దాఁక" నని యతం డాచరింపఁ
జేసె నాచేఁ బ్రమాణ; మిబ్బాస మైన
పిమ్మట న్నామజనయిత్రి సమ్మతించె. ౪౧

సీ. పదపడి నాసీమపయనంపుముచ్చటల్ ౪౧
తెల్ల మయ్యెను వీట నెల్లరికిని
నను వీడుకొల్ప నున్నతపాఠశాలలో
నడచెను సమ్మేళనం బొకండు
తత్సభ న్నాదుకృతజ్ఞత సూచింపఁ
గూర్చితిఁ గొన్ని పల్కులు శ్రమించి
చదువఁ బూనుడు వానిఁ దుదలేనిభయము న
గ్గల మైన కంపమ్ము నలముకొనియె
తే. అవల నెయ్యమ్ముఁ దియ్యమ్ము నతిశయిల్లఁ
బెద్ద లొసఁగెడి దీవనల్ పెక్కు వడసి
యాదరంబున నగ్రజుం డనుగమింపఁ
బయనముం గట్టినాఁడ బొంబాయిపురికి. ౪౨

# ౧౨ జాతిబహిష్కారము

సీ. అస్మజ్జననిపన్ను నంది దీవన పొంది
పసిబిడ్డ నెడఁబాసి పడఁతి విడచి
నవనవోత్సాహంబు నటియింప బొఁబాయి
నగరంబునకుఁ జేరినాఁడ నేను
తత్రత్యులై మించు మిత్రు లియ్యది గ్రీష్మ
సమయంబు భారతజలధి యిప్పు
డల్లకల్లోలంబు నతిభయంకరము నై
యుండును హేమంత మొదవుదనుక
ఆ. సాగరప్రయాణ మాఁగుఁ డటంచు నా
యన్నతోడఁ బల్క నాతఁ డచటఁ
దనదు మిత్రునింట నను డించి మాబావ
కప్పగించె మత్ప్రయాణధనము.

వ. వెండియు నాకు వలయుసాయంబు నెల్లఁ గావింపఁ దన
నెచ్చెలులం గోరి తా రాజకోటకుం జని తనకొల్వునం
జేరె నంత. ౨

ఆ. ప్రొద్దు పోవదయ్యె బొంబాయిలో నాకు
గడియ వత్సరంబుకరణిఁ దోఁచెఁ
బవలు రేయి సీమపయనంపుసుద్దులే
పలవరింత లాయెఁ బలువిధాల. ౩

తే. ఇంతలో మత్కులంబువా రేను సీమ
కేఁగుటం గూర్చి చర్చించి యిది నిషిద్ధ
కృత్య మని యెంచి నన్ను బహిష్కరింప
నిశ్చయించిరి రోసంబు నిట్టవాడువ. ౪

క. వారందుల శౌకరచ్చం
గూరిచి ననుఁ బిల్వ జంకుగొంకుల నెదకున్
దూర మ్మొనర్చి తత్సభఁ
జేరితి నత్తెగువ యెట్లు సిద్ధించె నహో! ౫

వ. పదంపడి మజ్జనకునకుం జెలికాఁడును మాకు నెడబందు
గుండును మా "మోఢు" వైశ్యకులంబునకుం బెద్దయు నగు
సెట్టి నా కిట్లనియె. ౬

## మంజరి.

సీమకుం బయనంబు సేయంగ నీవు
నిశ్చయించితి వంచు నే మెఱింగితిమి
మనకులక్రమసిద్ధమర్యాద నరయఁ
గడలిపై నేఁగుట కానికార్యంబు
నిజధర్మసంరక్ష నెఱపు టచ్చోట
దుశ్శకం బని చెప్పుదురు పెద్ద లెల్ల
దొరలతోడం గూడి దుర్భోజనంబు
నారగించుట తప్ప దందు రద్దీవి
నిట్టిదుష్కార్యంబు నెట్లాచరింతు
వుజ్జగింపుము నీదురుద్యోగబుద్ధి. ౭

చ. అనవుడు నీవు సీమ కేఁగుటరవంతయుదూష్యముగాదువిద్దియుఁ
బనివడి యభ్యసించుటకె పైనముఁగట్టితి నేను మాంసముం
దిననని కల్లుఁదావనని దీక్ష మెయి న్సమయం బొనర్చితిఁ
జననిసమక్షమం; దదియ సాకు ననుం బరభూమినెంతయుఁ. ౮

మ. అని నేఁ బల్కిన సెట్టి యిట్టు లనెఁ గుఱ్ఱా! నీమకుం జేరినం
తనె నీదీక్షలు నీప్రమాణములు నీధర్మంబులుఁ జాలు; నా
కును నీతండ్రికి నున్నతియ్య మది నీకుం దెల్లమే! కానఁ గై
కొనుమా మద్వచనంబు మేలుగనుమా కొంచెమ్ము
తర్కింపుమా. ౯

వ. అనుటయు నే నతని కివ్విధిం బల్కితి. ౧౦

తే. ఆర్య! తత్స్నేహమెల్ల నా కవగతంబ
గురుసమానులె మీరు నా కరసిచూడ
నట్టు లయ్యును మన్నిర్ణయంబు నిపుడు
విడువఁజాలను నా కొండు వెరవు సున్న. ౧౧

తే. కలఁడు నాతండ్రికిం జెలికాఁడు హితుఁడు
పండితుఁడు నై విరాజిల్లువాఁ డొకఁడు
సమ్మతించె నతండు దోసమ్ము వీస
మేని లే దంచు నాసీమపై నమందు. ౧౨

ఆ. మఱియు నూలుకొనియె మన్మాత భార్యయు
నియ్యకొనియె ననుడు నింత యేల
సంఘశాసనంబు సమ్మతి నొదలఁ
దాల్పవా? యటం చతండు కసరె. ౧౩

తే. అంత "నా కింక లేదు గత్యంతరంబు
వీకమై నేను సీమకుం బోక మానఁ
గులమువా రిందు జోక్యమ్ము గొనుట తగదు
పట్టు విడి మీర లెఱుఁగుఁడీ పాడి తెఱగు." ౧౪

క. అని నేను బదులువల్కుడు
మునిగిఁ యతం డతులరోషమునఁ బలువగలన్
ననుఁ దిట్టుచుఁ గనుగొనలం
గనదగ్నికణంబు లురలఁ గన్గొనెఁ గొలువున్. ౧౫

ఆ. వీనిఁ గులమునుండి వెలిఁ బెట్టితి న్నేఁడు
పూని యెట్టిసాయ మేని వీని
కాచరించువాని కపరాధశిక్ష స
పాదరూప్య మంచుఁ బనుపు నిడిరె, ౧౬

సీ. అవ్వాల నేను రవ్వంతేని జంకక
సెలవుఁ గైకొని పెద్దసెట్టిచెంత
బసఁ జేరి యేతత్సభావిశేషమ్ములు
విన్న వెన్నిచ్చునో? యన్న యంచుఁ
జింత సేయుచు నుండ నంతలోఁ "గులము బ
హిష్కరించును గాక యించుకేని
భయము సెందకు మీవు పయనంబు మానకు"
మని కమ్మ నతఁ డంపె నది యదృష్ట;
ఆ. మంత నాకు నెక్కు డయ్యె నారాట మిం
కేల జాల మంచు నెంచుచుంటి
నపుడ సీమ కొక్కఁ డరుగుచున్నాఁడు బా
రిష్ట రగుట కని యెఱింగినాఁడ. ౧౭

తే. అంత నగ్రిజునెయ్యుర కయ్యెదంత
మెఱుక సేయుడు విడువకు మిట్టితోడు
ననుచు వా రియ్యకొని రంత నవధిలేమిఁ
దంతి నిచ్చితి నన్న కాతండు నొప్పె. ౧౮

క. పిమ్మట మాబావను సా
మిమ్మ మ్మంటి సతండు కులబహిష్కరణత్రా
సమ్మునయందు మునింగి ధ
న మ్మొసఁగం జాల ననియె ననిచినచింతన్. ౧౯

వ. అంత నయ్యంతరాయమ్మున కే నెంతయుం గలంగి మత్కుటుంబమిత్రుఁ డొక్కని డాసి నాసీమపయనమ్మునకు నలయు రొక్కమ్ము బదు లొసంగి యవ్వెన్క నద్దాని మాయన్న కడం గైకొనుం డని వేఁడ నయ్యయ్య నన్ను సంప్రాప్తవిత్తునిం జేయుటయ కాక తద్దయుం బ్రోత్సహించి నాజతనంబు నగ్గించి నాసమర్పించుకృతజ్ఞతం బడసె. నే నవ్వలం దగుధనమ్ము వెచ్చించి నౌకాప్రయాణాధికారపత్రంబు విలిచి గ్రాసవాసమ్ముల సవరించికొంటి నంత నాకుఁ దోడై వచ్చు "జునఘుడు" న్యాయవాది త్ర్యంబకరాయిమజముదారుండుగ దియంద మన్మిత్రులు నా కొక్కసెజ్జం గైకొని నన్నతని కెఱుకపఱిచి యతండు నాయెడ నొసంగు నభయదానమ్మునం బరిగ్రహించి రమ్మజముదారు వయోజ్ఞానమ్ములం బెద్దయైనవాఁ డేను లోకానుభవ మ్మెఱుంగని యష్టాదశవర్షంబులకసుఁగాయనై యుంటి నివ్విధంబున. ౨౦

తే. వసు గ జైశ్వర్య కుముదినీబంధు సంఖ్య (౧౮౮౮)
వసుధ నెసఁగు క్రైస్తవశకవత్సరమున
నవమమాసతురీయదినమ్మునందు
బయలువెడలితి నేను బొంబాయి విడచి. ౨౧

## ౧౩ తుదకు సీమ

తే. ఎల్లరికి నంబురాశిపై నేఁగువేళఁ
బొడమునోకరింతలు నాకుఁ బుట్టవయ్యెఁ
గాని యీరాట మధికంబు కాఁదొడంగె
నల్లనల్లన గాలంబు సెల్లుకొలఁది.

సీ. పైకొను మొగమోట నాకు నుగ్రాణింపు
టధికారితోడ మాటాడుటకును
అలవాటులేని కార్యం బౌట నాంగ్లేయ
భాష నే నొకపల్కుఁ బల్కఁజాల
ఒక్కముజందారుదక్క మాగది నున్న
తెరువరులెల్లరుం దెల్లదొరలె
వారితోఁ బలుకాడనేర్వనైతిని వారి
కొసఁగలేనైతిఁ బ్రత్యుత్తరంబు

ఆ. అలఁతివాక్యమేని వెలలించుటకు మున్ను
గొణఁగవలయు లోనఁ గొన్ని సారు
లేమి సెప్పవాఁడ నే నప్పు డుచ్చ్వలం
బడి తపించు పుల్గుపగిది నుంటి. ౨

సీ. భోజనశాలకుం బోదునా యన్నఁ గ
త్తులు గరిటెలు వాడువల నెఱుంగఁ
పొలసుపొ త్తెడమైనభోజ్య మెయ్యది యంచు
నడుగుదునా యన్న నళుకు పుట్టుఁ
పదిమందితోఁ గూడి ముదమార నన్నంబు
భుజియింతునా యన్నఁ బొడము లజ్జ
ఎల్లరియాచార మిాకొందునా యన్నఁ
దల్లి కిచ్చినబాస తన్నుచుండు
తే. ఇట్టిచిక్కులు పెక్కులు ముట్టడింప
నోడపై నెక్కుసమయానఁ గూడఁ దెచ్చి
కొన్నపండ్లను జిఱుదిండ్ల గొద నడంచు
గొనుచు నుంటిని గదియంద కూరుచుండి. ౩

క. ఈ యడ్డంకులు త్ర్యింబక
రాయికి నిసుమంత కానరావయ్యె సతం
డేమెండకు నాగొడుగుః
వేయు దొరలఁ గూడి మాడి వేడుకఁ దిరుగున్. ౪

వ. అతండు నాసిగ్గరితనంబు నుపలక్షించి. ౫

సీ. ఇంత సి గ్గేల నీ కెల్లరితోఁ గూడి
సల్లాప మొనరింప శంక యేల
న్యాయవాదిపదంబు నర్థించువారెల్ల
వాచాలురై యుండవలయు మివుల
గుణదోషముల లెక్కగొనక సంభాషింపు
మవకాశ మొదవుచో నాంగ్లమందె
పెఱబాసలోఁ దప్పు దొరలకుండువిధాన
వచియించు టరిది యెవ్వారికైన

తే. అనుచు న న్నెచ్చరించె నయ్యాదియు నాదు
వెఱపు నడఁగింపదయ్యె నిక్కరణి నుండ
నక్కటికతోడ నాంగ్లేయుఁ డొక్కరుండు
తివిరి మాటలలోనికి దింపె నన్ను. ౬

ఆ. ఎచటి కేగువాఁడ వెయ్యది కార్య మా
హార మెద్ది నీకు నద్దిరయ్య
యింతబిడియ మేల యేటి కీయరవాయి
రమ్ము సాపడంగ మమ్ముఁ గూడి. ౭

వ. అని పల్కి యతం డామిషంబు ముట్టఁ దగ దను నాకట్టడికి
బిట్టు నవ్వి * కెంగడలి న్నేము పయనంబు సేయుతఱిఁ
జెలికారంబు వెలయ నిట్లనియె. ౮

* ఎఱ్ఱసముద్రము.

ఆ. వినుము నీదుదీక్ష "విస్కీ"సముద్రింబుఁ
జేరనంతవట్టు చెల్లుఁ గాని
యావల నిల్వఁ జాల దాంగ్ల దేశమ్మున
చలికి బ్రతుకఁ గలవె? పొలసు విడచి. ౯

క. నావలె నిను సాహాయిం
దావ్రుమనితి నోటు! మద్ధితవచస్సును సం
భావించి మాంసముం దిని
జీవమ్ములు నిల్పుకొమ్ము చెడకుము కుఱ్ఱా. ౧౦

వ. అనుటయు. ౧౧

క. మీయుపదేశమ్మునకున్
వేయినతుల్ కాని యిల్లు విడిచెడివేళన్
మాయమ్మ చెంత నామిష
మేయెడ భుజియింప నంచు నిచ్చితి బాసన్. ౧౨

క. అప్పా! సంజుడు నమలక
తప్పనిచో సీమ కొక్కదండం బడి నేఁ
జప్పున నింటికిఁ జేరుదు
నొప్పుకొన న్నాఁటిశపథ ముల్లంఘింపన్. ౧౩

వ. ఇట్లు నే నతనికి విన్నవించితి. ౧౪

సీ. ఇంతలో మానౌక యీఁగె బిస్కేవార్ధి
  సాఁడు మాంసాహార మిట్టులఁ దగిన
యక్కఱ పొసఁగపఁదయ్యె నించుకయేని
  దాసి కెంతయును సంతసము నంది
జనయిత్రి వాంఛితం బనుసరించి తదాజ్ఞ
  మిత్రు నర్థించి "యూరింపుము నాక
గింపలే దిఁకఁ" దన్న కిల్లాకు వడసి కొ
  న్నాళు లద్దానిఁ బ్రాణంబు వోలె
ఆ. రక్ష సేసి మాంసభక్షకులుం గొండ
  ఱెల్లఁ బలుపుచుంట యెఱిఁగి పిదప
  దానిమీఁది కాంక్షఁ దలఁగితి నాపల్కు
  నమ్మనపుడ దెట్లు నమ్ముఁ బ్రోచు? ౧౫

వ. ఇఁకఁ బ్రకృతమ్మునకు న్వత్తు మంత మానౌక క్రమక్రమం
బున లండనునగరమ్ము సేరుడు నేనును దక్షిణకరాయియు
విక్టోరియాభోజనశాల కేఁగి యందు విడిసితిమి. నే నంతకు
మున్న ప్రాణజీవన మెహతా, దలపతిరాంశుక్లా, రణ
జిత్ సింహ మహారాజు, దాదాభాయి నౌరోజీగారల పేర
మన్మిత్రు లొసంగిన పరిచయలేఖలం బట్టి భిషగ్వరుం
డగు మెహతాగారికి నారాక నెఱిఁగించుచుఁ దంతి నంపి
తిం గాన వార లయ్యన్నవిక్రియశాలకు వచ్చి నన్నెం
తయు గారవించి పలయు సందేశమ్ము లొసంగి రచటి
భోజ్యంబులందు నా కొకటియు నించదయ్యెఁ గాని వెచ్చ

ముం జూడ గుండియలు పగులసాగె నవ్వాల మే మద్దానిం
బరిత్యజించి కొండొక యద్దెగదిం జేరితి మంత నాకు. ౧౬

ఆ. మనసునందు సతము మాతృదేశంబుపైఁ
దల్లిపైని బెంగ తద్దయయ్యెఁ
నిదుర సన్నగిల్లె నిలయపరిస్థితుల్
తలఁపునందుఁ బాఱి కలఁతపెట్టె. ౧౭

క. నాకడగండ్లన్యునితో
వాకొనరానట్టి వయ్యె వాకొన్న నెవం
డీకష్టంబుల డీకొని
పోకార్పంగలఁ? డి వెట్లు పోవును దవ్వై. ౧౮

మంజరి.

అచటియాచారాదు లన్నియు నాకు
సరిక్రొత్తవై బిట్టు సంకటపెట్టఁ
గడుజాగరూకతం గాలంబు గడపు
టనివార్య మయ్యె నయ్యదియునుం గాక
యాకుబువ్వప్రతిజ్ఞ నావంతయేని
పాయక దీక్షమైఁ బాలింప వలయు
నికఁ దినుబండంబు లిష్టము ల్గావ
అటు నూయి యిటు గోయి యాయె నామనికి
యింగ్లండులో నుంట కే నేరనైతి
మాతృదేశమునకు మరలలేనైతి
"ఈమూఁడువర్షంబు లెట్లెటో నిల్వు"
మని ప్రబోధించె నాదగునంతరాత్మ. ౧౯

# ౧౪ నాయభిరుచి

క. మెహతా మఱియొకపరి మద్
గృహమున కేతెంచి తత్పరిస్థితుల నెఱిం
గి హసించి యిట్టినిలుకడ
స్పృహణీయము గా దటంచుఁ బెదవి న్విఱిచెన్.

వ. వెండియు నతండు. ౨

క. ఒంటరివై నీ వీగది
నుంటన్ ఫల మేమి? యేతదుద్యోకిఁ జదువుం
గొంటకె వచ్చితి వైనను
గంటయు నక్కఱయె యిందుఁ గలనడవళ్లన్. ౩

తే. ఎవ్వరికుటుంబమందైన నెనసి యున్నఁ
గాని చిక్కదు తత్పరిజ్ఞాన మెల్ల
సంగ్రహింపఁ దగునేర్పు నభ్యసింప
వలయు మున్ముందు హితులైన వారిఁ జేరి. ౪

క. నాయనుఁ గొక్కండు కలం
డాయనకడ నిల్వు మిప్పు డని పల్కుడు నే
నీయకొని తద్గృహామునకుఁ
బోయితి నన్నతఁడు మిత్రుపోలికఁ జూచెన్. ౫

ఆ. మఱియుఁ దెల్లవారిమర్యాద లెఱిఁగించి
యాంగ్లభాష మాటలాడఁ జేసి
జంకుగొంకు లెల్ల సవరించెఁ గాని నా
కొంట దయ్యె నతనియింటివంట. ౬

సీ. త్యాజ్యంబు లగుఁ గొన్ని భోజ్యముల్ చవిలేమి
నిష్టమైనపదార్థమేని మగుడ
నర్థింప సిగ్గు దా నడ్డమై కరము నన్
బాధింపఁ దొడఁగు నిప్పగిది ననుది
నం బుపవాసకల్పం బయ్యె మద్భక్తి
మెఱచి మెక్కు మటంచు నెల్లనాఁడుఁ
జెలికాఁడు వాదంబు సేయుచు నుండు నా
దురవస్థఁ దిలకించి పరితపించి

ఆ. అవల నాప్రమాణ మతమునకుఁ దెల్పి నే
మిన్నకుండువాఁడఁ గొన్ని నాస
రమ్ము లిట్లు గడవ నభ్యాసబలము దు
ర్భరము యయ్యె నాదు స్త్రైణకంబు. ౭

వ. ఒక్కనాఁ డతండు న న్గాంచి. ౮

తే. ఈవు మత్పోషకుండ వై తెలిసి దలచి
యుండియు నన్నెన్నఁడో శంక నడఁగొనక
యిట్టి నెడఁగూడ నంబు ని కెట్టు లొదవె
నవ్వరే! బుద్ధిమంతులు వినఁడతి విన్న. ౯

తే. ఇచటి యక్కఱ లించుకే నెఱుఁగ లేక
చదువుగంద మ్మొఱుంగి సజ్జనుల చెంత
నాచరించిన భాషకే యడలవెందుఁ?
యెట్లు బాధించు నది? నాని కేమువలయు? ౧౦

తే. అది ప్రమాణంబు కాదు న్యాయంబు ననుస
రించియును భాషగా నది యెంచఁబడదు
దానికిం గట్టుపడుట యజ్ఞాన; మిట్టి
పట్టుదల యున్న నిచట లాభంబు సున్న. ౧౧

తే. మున్ను నీ వాడుకంబును గన్నయట్లు
నది రుచించినయట్లు నాడెనపు [illegible]!
కోరి యక్కఱ లేనిచో నారగించి
యున్నచో నోళ్ల నందు వేమాయి వెట్టి! ౧౨

క. ఇది నీదురదృష్టం బని
మది నెంచెద ననియె నేనుమాత్రము దీక్షఁ
వదలుకొనన్నైతి నించిన
పదార్థముల నిల్పుచుంటిఁ బ్రాణము నోడలఁ. ౧౩

క. ఎఱచి స్తుతించిరియె మా కి
ద్దఱకుఁ దినదినము చర్చ తఱచుగ జరుగఁ
దొరఁకొనె నాకనితర్కము
పెరుగుకొలఁది నేను బిఱ్ఱబిగియుచు నుంటిన్. ౧౪

క. అనుదినమును రక్షణకై
వినుతించుచు నుంటి విశ్వవిభు నపు డదియుఁ
బనుపడుచు నుండె ని వ్విఁ
క నొనర్పం బ్రిత్యయంబ కారణ మయ్యెఁ. ౧౫

వ. అదియుం దొల్లి మాదాసి యగు గంభ గుప్పినబీజంబ యిట్లుండ నొక్కనాఁడు నాచెలికాఁడు "బెంథ" మను నతండు రచియించిన * "వస్తూపయోగసిద్ధాంత" మను గ్రంథముం జదువ మొదలిడె నందలిభాష నాకు దురవగాహం బగుట నతండ తద్విశేషంబుల నెల్ల నెఱుక సేయం దొడంగె నంత నే నతని కిట్లంటి. ౧౬

* Theory of utility.

సీ. నెచ్చెలీ! నన్ను మన్నింపు; నాకు నగమ్య
    విషయంబు లిట్టి! వామిషముఁ దినుట
యావశ్యక మటంచు నంగీకరించెదఁ
    గాని నాశపథంబు మాన నొల్ల
అద్గానిగుఱిచి వాదాడ వాదమునందు
    ని నోర్వలే నంట నిక్కువంబు
మొఱ కనియో జగామొండివాఁ డనియొ భా
    వించి న న్విడువు; ముద్వేల మైన
ఆ. నెనరు సూపు నిన్ను నే మఱవంజాల
మామకీనసుఖము మదిఁ దలంచి
విడువ కిట్లు నీవు నొడువుచున్నాఁడ వం
చే నెఱుంగ నోటు? హితవతంస. ౧౬

ఆ. ఐన విడువనోప నూనినసమయంబు
బాస బాసయేకదా? సతంబు
దాని నతకరింపఁ దగదు సుమా! నీకు
నెఱుకవడనిధర్మ మెద్ది గలదు? ౧౭

క. ఇవ్విధిఁ బల్కుడు నెయ్యుఁడు
నివ్వెఱఁగుం జెంది బళిరె! నీతో నిఁక నే
నివ్వాదం బొనరింపను
జువ్వె! భవన్నియమశుద్ధి సుశ్లాఘ మనెన్. ౧౮

క. అందుల కే నెంతయు ముద
మందితిఁ బలలంబుఁ గూర్చి యతఁ డవ్వేళఁ జ
ర్చం జేయుట విడచియు నెద
యందున్ నను గుఱిచి సేయు ననిశముఁ జింతన్. ౨౦

ఆ. త్రావు నతఁడు చుట్ట సేవించు మద్యంబు
వాని నభ్యసింప వలయు ననఁడు
మఱియు వాని నెప్డు మఱగకు మని నన్ను
హెచ్చరించు నెయ్య మచ్చుపడఁగ. ౨౧

క. ఆమిషమున్ దిన కుండిన
నా మేను కృశించు ననియు నా కటులైనన్
సీమనివాసం బొంటక
బాముల నిడు ననియు బెంగపడు నతఁ డెప్డున్. ౨౨

వ. ఇట్టు లమ్మిత్రునింట నా కొక్క మాసంబు సెల్లె నతని మనికిపట్టు “రిచ్మండు”లోఁ గలదు. కాన లండనునకు వారమ్మున కొండు రెండు వారమ్ములకు మించి పోవనయితి కామి నత్తావున కనతిదూరమ్మునం దెయ్యే నొకసంసారంబున నన్ను నిల్పు టావశ్యకం బని మెహతా, శుక్లా గార లూహించి “వెస్టుకెన్సింగ్టను”నం దొక యాంగ్లహైందవకుటుంబంబున నాకు వసతిఁ గల్గించి రయ్యింటి యామె విశ్వస్త. నానియమమ్ము నమ్మగువకుం దెలిపి తదనుమతిం బడసి నే నచ్చోట విడిసితి, నంత. ౨౩

ఆ. రుచికి దూర మగుట నచటియాహారంబు
నించదయ్యె నాకు నించుకేని
నిండి నాదుసిగ్గు నుండె యథాపూర్వ
మిడుమ లడఁగవయ్యె నింతవట్టు. ౨౪

తే. ఆమెకుం గూఁతు లిద్ద ఱయ్యాబల లార
గించుతఱి వలదని నివారించుకొలఁది
వేయుదురు నాకుఁ జెఱియొక వేఁడిరొట్టెఁ
దెలియరైరి వెండియు రెండు వలయు నంచు. ౨౫

క. మది కొదవె నిప్పటికి న
మ్మది నాకున్ జనువు సక్రమంబుగ నింకన్
మొదలిడనైతిని బతికిక
చదువ దొరంకొంటి నొక్కసంగతి యిడన్. ౨౬

క. ఒకగంట చాలు నప్పని
కిఁక సాగించితిని నగర మెల్లను జూడన్
ప్రకటనఫలకంబుల నో
పికమైఁ గనుచుంటి సకలవీథులయందున్. ౨౭

వ. నాప్రయాసఫలితమ్ముగా నొక్కవాడయందు శాకాహార
విపణి దృగ్గోచరం బగుడు నందుల కెంతయుఁ బొంగి యద్దాని

ముంగిట నమ్మ * "శాకాహారసిద్ధాంత" మను గ్రంథమ్మను "సాల్టు"విరచితంబును గొని లోనికిం జని రుచ్యంబులగు భోజ్యంబు లాప్యాయనంబుగ నారగించితి; వెండియు.

సీ. ఆంగ్లదేశమ్మునం దడుగుమోపిన వెనుకఁ
గడుపారఁ గుడుచు టప్పుడె లభించె
ననుఁ బ్రోవ భగవానుఁ డనురాగమున వచ్చి
నటు లుండె నాశాల యరసి చూడ
సాల్టుపుస్తక మంతఁ జదివితిం దుదదాఁక
సంతసం బెంతే నొసఁగె నద్ది
నాఁటినుండియు నే మనఃపూర్వకమ్ము శా
కాహారి నైతి నం చనఁగఁ జెల్లు

క. జననిసన్నిధి శపథంబు సలిపినట్టి
దినము నా కప్పు డానందజనకమయ్యె
నిర్విచారంబుగా సీను నిల్వవచ్చు
నెన్నినాళ్లేని యను ధైర్య మెచ్చిపోయె. ౨౯

తే. అల్లబాసను సత్యంబు నాదరించి
కర్తవ్యము న్విడచినను దాత్కాలికముగ;
భావికాలంబునం దేను భయము విడచి
సంతసమ్మునఁ బాల సారగింతు ననియు. 30

* Salt's plea for vegetarianism.

క. హైందవు లెల్లరు నామిష
ముం దినఁగా వలయు ననియు మునుకొని సంఘం
బం దియ్యశనము వ్యాప్తిం
జెందం దగుబోధనమ్ము సేయుదు ననియుꣳ. ౩౧

తే. తొలుత నెంచితిఁగాని యత్తలఁపు దూర
మయ్యె నీనాఁడు నే నిపు డారగించు
నాకుబువ్వ జగమ్మునయందు వెల్లి
విరియఁ జేయుటయే నాకు వేడ్క యయ్యె. ౩౨

# ౧౫ ఆంగ్లవేషము

సీ. శ్లోనసాగఁ దొడఁగె నాకుంబువ్యదేస నాకు
నానాఁటి కెంతేని నమ్మకంబు
చదువసాగితిని భోజనముఁ గూర్చి రచింపఁ
బడినపొత్తముల సంబరము గదుర
బోధించె నవి క్రీస్తుమున్నగుమహానీయు
లెల్ల శాకాహారులే యటంచు
తెలిపె శాకాహారదీక్షితుల్ పూర్ణాయు
రారోగ్యసంపన్ను లగుదు రనియు

తే. పిదప భోజ్యపరీక్ష నాబ్రిదుకునందు
ముఖ్యమగు కృత్య మయ్యె మున్ముందు దీని
మొదలువెట్టుట యారోగ్యమునక యైన
నవల ధర్మదృష్టియె హేతు వయ్యె నిందు.

క. ఈపగిది నేను గాల
క్షేప మొనరింప నాదు చెలికి మదన్న
వ్యాపారజనిత మగు సం
తాపము చూపడఁగ దన్యోఁ దాలవ మేలిన్. ౨

సీ. ఆమిషాహారంబు నారగింపక యున్న
దేహపాటవ మొగి న్దెరలు ననియు
తెల్లవారలఁ గూడి తిరుగక యున్నచో
జడబుద్ధినై నేను జెడుదు ననియు
ఆకుబుస్సను మొచ్చుపట్టి వారితోఁ గన్న
విపరీతములు సంభవించు ననియు
ఆహారపరిశోధనార్థినై మెలఁగుచో
భువి నిరర్థకుఁడనై పోదు ననియు
ఆ. ఆతఁ డూహచేసి నాతత్త్వమును మార్ప
యుక్తి యొక్కటి పన్ని యొక్కరేయి
నాటకంబు చూడ నను రమ్మటంచు దన
నతనివెంట వేడ్క నరిగినాఁడ. 3

క. ఎరకొాఱ కత్తెఱి మునుముం
దిరువుర మొకపూటకూళ్లయిలు సేరితి మ
య్యెరవు నరపాలభవనము
కరణి విరాజిల్లు శిల్పకళ కాశ్రియమై. ౪

వ. అందు నాగరకు లనేకులు మెసవుచుందురు గాన నటకు
నన్నుం గొనిపోయిన నవినయ భయంబునం జేసి భోజన
మధ్యంబున నే నెట్టిసందియమ్ములనేని వెలువరింపఁజాల నని
నామిత్రుం డూహించి యీపన్నుగడం బన్ని నంతేఁ
బెక్కండ్రనడుమ నే మొక్కబల్లముం దుపవిష్టుల
మగుడుఁ బ్రథమభోజ్యంబుగా "సూ" పను పదార్థంబు
మా కొసంగఁ బడియె నయ్యది శాకాహార మగునో?
కాదో? యను సంశయంబు నన్నుఁ బీడింప నద్దానిగుఱించి
నేస్తకాని నడుగనొల్లక మెల్లన వడ్డనసేయువానిం జీరితి
నయ్యవసరంబున. ౫

క. అద్దాని నెఱిఁగి మిత్రుఁడు
గద్దించుచు నతనిఁ బిల్వఁ గత మే మన నేఁ
దద్దయు వెనుకాడుచుఁ గల
సుద్ది న్వినిపింప నతఁడు చుఱచుఱఁ గనుచున్. ౬

తే. నిమిషమే నిట్టిసంఘాన నీవు నిలువ
నర్హుఁడవు గావు వలయుమర్యాద లెఱుఁగ
వేని వేవేగ నొండొక్కయెడకు నడిచి
కుడిచి వాకిట నారాకకొఱకు నిలుము. ౭

ఆ. అనుడు సంతసించి యచ్చోటి నెడఁబాసి
పొంత నున్న యాకుబువ్వనెలవు
దరిసిచూడ వేళతప్పుట నది మూయఁ
బడియె నౌర నాయభాగ్యమహిమ. ౮

ఆ. నాఁటిరేయు నాకుఁ బాటిల్లె నుపవాస
మంత నేము నాటకావలోక
నాభిలాషఁ జనితి మవ్వాల నాతఁ డి
గ్గొడవ నెప్పుఁడేని దడవఁడయ్యె. ౯

ఆ. ఇదియ మాకుఁ దుట్టతుదిజగడము దీనఁ
బొడమదయ్యె నెట్టిపొరపు మాకు
నెయ్యుఁ డిట్లు సలుపఁ దియ్యంబె హేతువు
గాన వాని మిగుల గారవింతు. ౧౦

వ. తలఁపుసేఁతల మా కెంతయంతరం బున్నను నతండు నాహితుండగుటం జేసి నే సర్వదా వాని గౌరవించువాఁడ నంత నే నామిషంబును ద్యజించినను దక్కుంగల మర్యాదలయం దాంగ్లేయసంఘసంప్రదాయమ్ములు చక్కగా ననుసరించి వర్తింపనేర్తు నని సంగడీనికిఁ దెల్లంబు సేయనెంచి మునుముందు వలయుదుస్తుల న్వొలిచి వేషంబు సవరించి పాపట సంస్కరించి నాట్యమ్మును బరాసుబాసను గఱచినం దప్ప నాగరకత పూర్ణతం జెందదని విని వ్యయప్రయాసమ్ముల కోర్చి యొక శిక్షాశాల నాశ్రయించి కొన్నినాళ్లు నృత్యమ్ము నభ్యసించితి నందలి తాళగతి దెలియ నే నశక్తుండ నగుటఁ దత్సిద్ధికయి "గోఁచిపాఁతకొఱకుఁ గొండంత సంసార" మన్నట్లు "ఫిడేలు" నభ్యసించునవస్థ నాకుఁ బాటిల్లె. వెండియు వక్తృతాపద్ధతి నెఱుంగ నొండొక్కయొజ్జను సేవింపఁ దొడంగితి నగ్గురుండు "బె" ల్లనునతండు

గూర్చిన * "యాదర్శవక్త*" యనుగ్రంథముం బఠనీయ
మ్ముగా నియమించె నందలి యుపన్యాసంబు నొకదానిఁ
జదువ దొరఁకొంటి నింతలో నా "బెల్*"మహాశయుండు
నాశ్రవఃకుహరమ్మున ఘంటానాదమ్ము సల్పుచు నే మేలు
కాంచి. ౧౧

మంజరి.

ఆజీవితాంత మిమ్మాంగ్లదేశమున
నే నుంట కల్ల! యిం కేల యీ బెడఁద?
అరుగుదెంచితిని విద్యార్థినై యిటకుఁ
దత్సమార్జనమె కర్తవ్యంబు నాకు. ౧౨

తే. ఇటు విచారించి వైళంబ నటన, గీత
వాగ్మితాభాష్యముల కెల్ల స్వస్తిఁ జెప్పి
గురుల మన్నింపుఁ డని పేర్మి మెఱయ వేఁడి
యవల నిక్కపువిద్యార్థి నైతి నేను. ౧౩

తే. నృత్యగీతాదికాసక్తి రెండుమూఁడు
మాసములె నిల్చి పిదప నన్నాసెఁ గాని
వేసమునయందుఁ బొడమిన వెఱ్ఱివలపు
విడువదయ్యెను బెక్కేండ్లు గడచుదనుక. ౧౪

*Bell's Standard Elocutionist.

# ౧౬ మార్పులు

తే. ఆటలకు లొంగి పాటల కాసఁ జెంది
యిచ్చవచ్చినటుల్ చరియించినాఁడ
నంచుఁ బాలకులార! మీ రెంచవలదు
తప్పుదారికిఁ జననైతి నప్పుడేని.

తే. ఏ నపుడు వెచ్చపెట్టిన యెల్లడబ్బు
నకు విసుపులేక లెక్క వ్రాసికొనువాఁడ
ననుదినంబును శయనించునవసరమున
నిలువ సరిచూచుచుందు నిర్ణిద్రమతిని. ౨

వ. అయ్యభ్యాసంబు నా కిప్పటికిం గలదు. పెక్కుమేళ్ళ కియ్యది
నిదానం బయ్యె. లక్షలకొలఁదిధర్మాదాయంబు పలుతెఱం
గుల వెచ్చించుచున్న నా కెన్నఁడేని యెట్టిలెక్కచిక్కులుం
బొసఁగవయ్యె నియ్యాచారంబు యువకెల్లరుం గుర్తించి
తమనిత్యజీవితంబునం బ్రయోగింతుర యేని వారలు
నావలె శుభంబు లందుట సిద్ధమ్ము; మఱియు. 3

క. వెచ్చమ్ములెక్క ననుదిన
మిచ్చమెయిన్ వ్రాయుకతన నే వ్యయము కడున్
హెచ్చెడి నని గుర్తించితిఁ
గ్రచ్చఱ నెంచితి సగమ్ముకర్చును మాన్పన్. ౪

సీ. పదపడి పద్దులం బరిశీలనము సేయ
నగపడె బండిబాడుగలు మిగుల
మఱియు నే నొకకుటుంబమునందు నుంటచే
విందులవెచ్చము న్విస్తరిల్లె
నీవ్యయమ్ములఁ ద్యజియించుట సుకరంబ
యనుభావ ముదయించె నప్డు; డంత
నక్కుటుంబము వీడి యద్దెగదుల్ రెంటిఁ
గైకొనినాఁడ నగ్గదులు నాకుఁ

ఆ. గార్య మున్న యెడకుఁ గడుదాపునం దుంట
నటకుఁ గాలినడక నరుగుచుందుఁ
గాన దీన బాడుగలు తగ్గెఁ దీఱిక
హెచ్చె దేహదార్ఢ్య మినుమడించె. ౫

వ. అయ్యవసరంబున. ౬

మంజరి.

బారిస్టరుపరీక్ష పాఠ్యముల్ చదువ
సమయంబు కొంతయే సరిపోవుకతన
మిగిలినకాల మెమ్మెయిఁ బుచ్చు టొప్పు
ననుచింత నామది నలముటం జేసి
యాంగ్లభాషాజ్ఞాన మస దన్నవంత
యెంతయు న న్నెరియించుచుండుటయుఁ
బట్టభద్రుఁడ వై నపదపడి వచ్చి
ననుఁ జూడు మని "లేలి" నాఁడు పల్కుటయుఁ
దలపోసి యెద్దియేఁ దగినపరీక్ష
కింకొక్కదానికి నిక్కాలమెల్ల
నుపయోగపఱుచుట యుక్తం బటంచు
నెంచి మన్మిత్రున కియ్యూహ దెలుప
నిట్లనె నతఁడు "నీ కెల్లచందముల
మెట్రిక్యులేషను మే లౌ పరీక్ష
ఉత్తమపాఠ్యంబు లున్నవి దాన
కల్గించుఁ దగినలోకజ్ఞానమద్ది
అలఁతివెచ్చము చాలు నద్దానిఁ జదువ"
అనుడు నే వేడ్కమై నంగీకరించి
పఠనీయపుస్తకపట్టికం జూడ
దుస్సాధ మిది యంచుఁ దోఁచె; వెండియును

దాన "లాటిను" భాషఁ దప్పక చదువ
వలయు నవ్వాణి యెవ్వఁడువున వచ్చు
నని నేను సంశయ మంద వయస్యుఁ
"డేల నీ విటు సంశయింతు మిత్రింబ!
లాటి నెఱుంగ కేలాగున ఫలము
వడయం గలరు న్యాయవాదులు సెపుమ!
అబ్బాస నేర్చినయట్టివారలకు
న్యాయశాస్త్రం బగ్గ మగును దెల్లముగ
మఱియు నద్దాన "రోమన్‌లా" పరీక్ష
కొసఁగుపృచ్ఛాపత్రి ముండెడిం జువ్వె
అయ్యది కైవసం బైనవారలకు
నాంగ్లంబు పాణితలామలకంబ"
యని పల్కె ♦ నచ్చె నా కతనిబోధనము. ౭

క. పిదపఁ బరీక్షాపఠనము
మొదలిడి సమయంబు నొకనిముస మేని వృథా
వదలక చదివితిఁ గనువా
రదిరా! యని కంపితోత్తమాంగులు కాఁగన్. ౮

వ. ఇతఃపూర్వంబ పరాసుబాసతో నాకుఁ గొంతపరిచయంబు కలదు. కాన దాని నాధునికభాషకు బదులుగా స్వీకరిం

♦ "నచ్చు" ధాతువు రూఢిని బట్టి 'ఇష్టమగు' అనునర్థములో నిం దటనటఁ బ్రయుక్తము.

చితి నప్పటికిం బరీక్ష కైదుమాసమ్ములవ్యవధి యుండె
నింతయల్పకాలమునంద యిట్టినూత్నభాషలను దదితరవిష
యమ్ములను దెలియఁ దగినబుద్ధిబలంబు నాకుం గల వగు
టం బరీక్షయం దోటమి యొదవె లాటినులోఁ దగుసంకం
బులు రామియే యియ్యనర్థంబునకు మూలం బాయె
నంత. ౯

క. అపజయమునకు నిరుత్సా
హాపడక మగుడం బరీక్ష కత్యంతాస
క్తిపరీతచిత్తమునఁ బూ
ని భరింపం దొడఁగినాఁడ నెయ్యురు మెచ్చఁగ. ౧౦

తే. హెచ్చెఁ గానఁ బరీక్షలవెచ్చ మపుడు
దాని సవరించుకొనుటకు నిత్యవ్యయంబు
మరలఁ గొండొక తగ్గింప మదిఁ దలంచి
యొక్కగదియందె కాఁపుర ముంటి నొదిగి. ౧౧

ఆ. పూఁటకూటియింటిబోనంబు వర్జించి
సంతరించుకొంటి సొంతవంట
దాన నాలుగైదుపౌనులవిత్తంబు
కలిసివచ్చె మాసకాలమునకు. ౧౨

సీ. మితమైనవెచ్చంబుమెయి డంబ మెఱుఁగని
బ్రతుకు సాగించుటకతన మిగుల
నవకాశ మొదవె నా కపుడు విద్యల నేర్వ
దాన రెండవమాఱు తత్పరీక్ష
విజయంబు గల్గె నివ్విధి మితవ్యయ మూని
యుంట నేఁ గడగండ్లఁ గంటి నంచుఁ
బారకజను లూహాపడకుండ్రుగావృత
మది నాదు లోవెలిబ్రదుకులకును
ఆ. గలుగఁ జేసెఁ బొత్తు ఘటియించె రాబడి
కగ్గమైనవెచ్చ మతులసత్య
మయముఁ జేసె నాదుమనుగడ నిస్తులా
నందసాగరమున నన్నుఁ దోఁచె. ౧౩

---

# ౧౭ భక్ష్య పరిశీలనము

క. పరిశోధనమ్ము నెఱపన్
దొరఁకొన్నకొలంది నాకుఁ దోఁచెను బహిరం
తరధర్మము లింకను సం
స్కరణ మ్మొనరింపఁ దగు దశ స్గల వనుచున్.

ఆ. కాఁపురంబునందుఁ గర్చులయందు సం
స్కరణముం బొనర్పఁ గడఁగినపుడె
పూనినాఁడ నేను భోజ్యంబులందును
వలయునట్టిమాఱుపుల నొనర్ప. ౨

సీ. అవగతం బయ్యె నా కాకుబువ్వను మెచ్చు
గ్రంథము ల్గూర్చిన ప్రాజ్ఞులెల్లఁ
బ్రకృతిశాస్త్రవిరుద్ధపద్ధతు ల్విడనాడి
యారోగ్యలక్షణం బనుసరించి
మతధర్మమును సమంచితబుద్ధి మన్నించి
చేఁతకు ననువైన రీతు లెఱిఁగి
లోఁతుగాఁ జర్చించి యే తమపొత్తముల్
విరచించినా రన్నవిషయ మపుడు;
ఆ. ధరణి మానవుండు తక్కినప్రాణుల
కంటె వలఁతి యైన కతన నతఁడు
చంపఁదగదు వాని సంరక్ష గావింప
వలయు నంచు వారు వ్రాసి రందు. 3

వ. అదియునుంగాక మనుజులలో మనుజుల కొండొరు నెట్టి తోడుపాటుండు నట్టిసాయంబ తక్కుంగలజంతులవెసం గూడ నుంట యావశ్యక మ్మనియు, మానిసి మెసవుట మనుటకే గాని జిహ్వాతృప్తికింగా దనియు, మానవున కతనిశరీరనిర్మాణంబు ననుసరించి చూడఁ బక్వాహారంబు త్యాజ్యంబనియు, నాయుర్వేదముంబట్టి యూరుఁగాయ లుప్పుఁ బచ్చడులు తాలింపులు మున్నగునవి వర్జ్యంబులనియు నెల్లరికి నాకుబువ్వ చేరికలోని దనియుఁ జౌక యనియుఁ దద్గ్రంథకర్తలు సవిమర్శమ్ముగ నిర్ణయించి రియ్యంశంబు లెల్ల నాయనుభూతికి లోనయ్యె. వెండియు వారిలోఁ బెక్కం

డ్రామిషంబు నండంబులం బయస్సును నిషేధించి తాము నట్లు ప్రవర్తిల్లిరి; వారివ్రాఁతలు నన్నెంతయు నలరించె; నంత. ౪

ఆ. ఆకుఁబోన మమ్ము నంగళ్లలోన ని
కట్టుపాట్ల నెల్ల గారవించు
ప్రజలఁ గలిసికొన్నవాఁడ నాయందుఁ బె
న్నాదరంబు సూపి రపుడు వారు. ౫

సీ. నల్లవో! శాకాశనప్రచారకసంఘ
మును నీవు నొక్కండు దనరు వార
పత్రిక నొకదానిఁ బ్రచురించు నయ్యది
దాన సభ్యుఁడ నైతి నేను, మఱియు
నల్పకాలమునందె యందితిఁ గార్యన
భాసభ్యతాగౌరవంబు నందు
దీక్షమై శాకభుక్తిని బాలనము సేయు
వారు పల్వురు మిత్రు లైరి, పిదప

ఆ. భక్ష్యవస్తువితతిఁ బరిశోధన మొనర్పఁ
బూని యపుడ మాతృభూమినుండి
వచ్చినట్టినిలువపచ్చళ్లఁ జిఱుదిండ్ల
మానినాఁడ నిచ్చ మాఱుకతన. ౬

తే. మున్ను సంభార మన్నది సున్న యగుటఁ
జప్పగా నున్న బచ్చలిశాక మిపుడు
కమ్మగా నుంట నాలుక గాదు చవికి
నాత్మయే ప్రధానస్థాన మనుచుఁ దోఁచె. ౭

వ. అయ్యవసరంబునం దార్థికచింత నాయుల్లంబునం బాదుకొని యుండె నయ్యెడం గొందఱు "టీ, కాఫీ" లారోగ్యనాశకంబు లని వానిం ద్యజించి "కోకో"ను ద్రావుచుంట యెఱింగి భుజించుట జీవయాత్రకు మాత్రంబ యని తలంచి నేను నట్ల సేయం దొడంగితి; వెండియు. ౮

మంజరి.

శాకాన్నవిక్రయశాలకు నేఁగి
యిచ్చవచ్చినవస్తు లెల్లను మెక్కి
విపరీతముగ సొమ్ము వెచ్చింపఁ బోక
పరిమితవ్యయదీక్షఁ బాటించు టాది
నిత్యంబు నాఱు "పెన్ని" లభక్ష్యముల
నియమంబుమైఁ గొని నే నారగింపఁ
గడఁగితి; మఱియు నక్కాలానఁ ♦ బిండి
గలభక్ష్యముల ముట్టకయె కొన్నినాళ్లు

♦Starch.

కడపితి, మఱికొంతకాలంబు రొట్టె
పండ్లు భుజించితిఁ బదపడి గ్రుడ్లు
జున్ను పా లారగించుట దొరఁకొంటి
గుర్తింపఁ దగిన దిక్కానశోధనంబు. ౯

తే. అప్పుడు సంస్కర్త యొక్కరుం డండముల భు
జించుచోఁ బెక్కుమేళ్లు ప్రాప్తించు ననియు
నది మెఱచితిండిలోఁ జేర దనియుఁ దెలుప
నచ్చె నాతనివాదంబు నాదుమదికి. ౧౦

క. అంతట నండము జీవ
జ్జంతువు కానేర దంచు సామాన్యముగన్
స్వాంతమునయందుఁ దోఁచుడు
సంతసమున దాని మెక్కసాగినవాఁడన్. ౧౧

వ. పరాకునం దొడరిన యిక్కడుపుం బదునైదుదివసంబులు మాత్రంబ మెసవి యంతే నియ్యది యకార్యం బని యెఱింగితి. నామున్ను సల్పినశపథంబునకు నేఁడు నూతనార్థవివరణ మ్మొనర్చుట నీతికి విరుద్ధంబు. గ్రుడ్లును బలలంబు లోనివ యని మజ్జననియభిప్రాయం బగుట నిక్కంబు. కాన నిబ్బాసయందలిపరమార్థంబు నామదికి గోచరించినమఱునిముసంబ యండంబులం దినుట మాని యాహారపరిశీలనమ్మును సైత ముజ్జగించితి; మఱియు. ౧౨

సీ. ఆంగ్లదేశమ్మునం దామిషంబును గూర్చి
కనుగొంటి మూఁడులక్షణము లొకటఁ
బశుపక్షి పలలంబ పలల మిమ్మతమువా
రైన శాకాహారు లండములను
జేపల నారగించెదరు వే ఱొకదాన
నెల్లప్రాణులమాంస మెఱచి దీన
నారగింపఁగవచ్చు నండంబు లొండొక
దాన సర్వప్రాణితరస మండ

ఆ. ములును బాలుఁ బెరుఁగు మున్నగునవియు గ
వ్యములు మాంసగణమునందు నట్టు
లగుట నాకుబువ్వయంగళ్ళఁ బెక్కుభ
క్ష్యముల గుడ్లు కలియు ననుచుఁ దోఁచె. ౧౩

తే. కావుటంజేసి యచటిభక్ష్యముల మెసవు
వేళలం దెల్ల నవ్వానివివర మడిగి
యండములు చేరకున్న భోజ్యములు విలిచి
యారగించెడివాఁడ నే ననుదినంబు. ౧౪

వ. దీనంజేసి యిష్టంబు లగు భక్ష్యంబులు పెక్కింటిని విడువ
వలసెఁ గాని నాయొనర్చిన బాసను దీక్షమై రక్షించుచుంటి
నియ్యది నా కసంతృప్తిఁ గూర్పదయ్యె; మఱియు. ౧౫

తే. ఎంత తెల్లమై తనబాస యొసఁగుచున్న
నాత్మచరితావిరుద్ధమై యలరుపొల్కి
దానికి న్నూత్ననూతనార్థములు వెల్ల
డించెదరు కొంద ఱేతత్ప్రపంచమందు. ౧౬

క. కల రిట్టివారు లక్షలు
గలవారలయందు లేమిగలవారలయం
దలస్వార్థప్రియతమై వా
రలకన్నులు గప్పు నద్దిరా! యే మందున్. ౧౭

తే. కొంకుజంకులు వీడి వా గ్గోడమీఁది
పిల్లివాటమ్ముగా విజ్ఞు లెల్ల రోయఁ
బలికి యాత్మవంచనమును సలిపికొని, జ
గమ్ము దైవమ్ము వంచింపఁ గడఁగుచుంద్రు. ౧౮

తే. బాసచేసినమనుజుఁ డబ్బాస నెవ్వఁ
డాచరింపఁగఁజేసె నయ్యతనియర్థ
మనుసరించుట సంశ్లాఘ్య మైనమార్గ
మని వచింతురు ధర్మజ్ఞులైనబుధులు. ౧౯

క. రెండర్థంబులకును వీ
లుండిన దుర్బలునినుడికి నొడఁబడఁ దగు నీ
రెండు తెఱంగులఁ దొఱఁగిన
నిందున్ జగడంబు పాడినెఱి పొడవడఁగున్. ౨౦

వ. సత్యమ్మునకుఁ గొల్వుసల్పువాఁడు మొదటిమార్గంబుఁ దొక్కుటయు వాంఛించు నాతండు నూతనవ్యాఖ్యానంబులకొఱకు సూరిజనమ్ముల నెన్నఁడు నారాధింప నొల్లఁడు. పలలంబుంగూర్చి యుత్తమసరణి ననుసరించి చూడ నాతల్లియూహించినలక్షణంబ నాకు శిరోధార్యంబు. కాని యన్యం బవశ్యపరిహార్యంబ; వెండియు. ౨౧

మం జ రి.

నాసల్పుపరిశోధనమ్ము సర్వమ్ము
నార్థికదృష్టి నయ్యారోగ్యదృష్టి
ననుసరించియ్యు సాగె నాంగ్లదేశమున
నవ్వల నికార్య మాఫ్రికాయందు
నాచరించితిని ధర్మైకక్క మౌ దృష్టి
ముందు వాకుత్రిత్తు నమ్మచ్చట నెల్ల
నెట్లులైన దీనికి నింగ్లాంశునంద
జరగె బీజావాపసంస్కార మెల్ల. ౨౨

ఆ. మాంసభక్షణంబ మంచి దటంచు నేఁ
బెక్కునాళ్ళు నమ్మి పిదప శాక
భోక్త నైతిఁ గానఁ బూర్ణాభిమానంబు
పొడమె నాకు నాకుబువ్వపట్ల. ౨౩

తే. తడవులంబట్టి యొక్క మతమ్మునందు
వెలయునాతనికంటె నవీనముగను
దానిఁ బూనినవాని కద్దాన మివుల
నాదరముకల్గునంట సత్యమ్ము గాదె. ౨౪

వ. ఏత దభిమానఫలితమ్ముగా నావసించు పేఁటయం దే నొక శాకాహారిగోష్ఠి నెలకొల్పి దానికి శాకాహారపత్రికానం పాదకు లగు నోల్డుఫీల్డుగారి సభ్యత్వులఁ జేసి నేఁ గార్యదర్శిపదవి స్వీకరించితి, నయ్యది కొంతకాలము శ్లాఘనీయమ్ముగా సాగియు నే నవ్వాడ వీడి వేఱొక్క దెసకుం బోవుట వాటిల్లుటం జేసి కతిపయమాసమ్ములలోన పాడ వడంగె; నైనను. ౨౫

తే. వినయపూరిత మిప్పాటియనుభవంబ
కొన్ని సంఘమ్ముల న్నెలకొల్పి వాని
వ్యాపనీయమ్ము లొనరింప నర్హ మైన
చాకచక్యమ్ము నాకు నొసంగఁ గల్గె. ౨౬

# ౧౮ బిడియము నా డాలు

సీ. శాకభోజనసమాజమునందు నేఁ గార్య
సంఘసభ్యుఁడనై యొసంగుకతన
వెడలుచుందును సమావేశంబు లన్నింటి
కైన మౌనంబ నా కచట నెపుడు
అధ్యక్షుఁ డిది కూడ దని పెక్కుసార్లు నన్
మమత దీపింపఁ దా మందలించె
కొలువులో మాటాడవలయుననొక్కరిక్క నా
కెంతయుఁ గల దైన నేమిలాభ
ఆ. ముల్లమందుఁ బొడము నూహామ్ముశ్రలం దగు
నట్టిబాసయందుఁ బెట్టఁజాల
మొదలుకొన్నవిషయమును దప్పి యప్రిస్తు
తాంశచర్చలోని కరుగువాఁడ.

ఆ. కడచె నిట్లు కొంతకాల మవ్వల నొక్క-
సారి ముఖ్యవిషయచర్చ యొకఁడు
దాపరించె సమితిఁ దత్సభయందుఁ బా
ల్గొనమి ధర్మదూర మనుచుఁ దోఁచె. ౨

క. రచ్చకు నేఁగియు భావం
బచ్చుపడువిధాన మాటలాడక యున్నే!
యొచ్చెముగ మూఁగసమ్మతి
నిచ్చుట భీరుత్వ మంచు నెంచితి నెడఁదన్. ౩

వ. తత్సభకు నయోవ్యాపారిసంఘనాయకుం డగు “హి”ల్సను నతం డధ్యక్షుఁ డాతండు *నీతివాదియనం దగు; నాయన యొనర్చు నార్థికసాహాయ్యంబుపైన తత్సంఘమాధారపడి యుండె సామాజికులు పెక్కండ్రితనికనుసన్నల మెలఁగుచుండు రాకుబువ్వదెస నిండుగౌరవంబు గల “యల్లిన్స” నను నతండుం బాలకసంఘమ్మున వెలయు నప్పుడ యంకురించిన సంతాననిరోధోద్యమం బతని కభిమానపాత్ర మగుడు నతఁ డద్దానిం గూర్చి కార్మికులకు బోధింపఁ దొడఁగె నిట్టి యాచారంబు నీతిద్రుమంబునకు వేరుపుర్వుంబోని దని హిల్సుతలంపు. శాకాహారసమాజము నైతికసేవ నయిత మాచరింపవలయు నని యతని యాశయము. కాన విపరీత

* Puritan.

భావభరితుండగునల్లిన్సను తత్సంఘమునం దుంట చెట్టకుం బట్టుఁగా మ్మని యయ్యధ్యక్షుని భావంబు. కావుటం జేసి యల్లిన్సనుసభ్యతను రద్దుపఱుపవలయు నను నిర్ణయము సభలోఁ బ్రతిపాదితం బయ్యె నంత. ౪

తే. తద్విచారంబు నాదుచిత్తమును దిగువ
మంచిచెడ్డల నే విమర్శించి కనుచు
జన్మశాసనవాదియాశయము లెల్ల
నత్యుపద్రవకారు లటంచుఁ దోఁచె. ౫

తే. హిల్సు తా నీతివాదియై యెసఁగుకతన
నాతఁ డల్లిన్సనునకుఁ బ్రత్యర్థియగుట
ధర్మ మని తోఁచె; నాతఁ డౌదార్యభరితుఁ
డగుట మన్నింతు నతని నే నగ్గలముగ. ౬

మంజరి.

ఐనను నీతియం దాశయభేద
మున్నంతమాత్రాన నొకనిసభ్యతను
రద్దు సేయుట నీతిరహితకృత్యంబ
యని బోధచేసె నాదగునంతరాత్మ
సంఘమ్ములక్ష్యంబు శాకభోజనము
నెరయుటకై ప్రయత్నించుటే కాని
యింకెట్టినయమార్గమేని విస్తృతము

గావింపఁ బూనుట కా; దట్టు లగుట
నీతింగుఱించి యెట్టినియమంబు లున్న
శాకభక్షణమును సల్పువా రెల్ల
నష్టా లేతత్సంఘమం దిమ్ముకొనఁగ
ననుచు భావించితి నంతరంగమున. ౭

తే. సాంఘికులు కొంద ఱేతదంశమునఁ దగవు
నెంచి నాతోడ నేకీభవించి; రైన
నేన యిమ్మాఱు మాటాడ నెంచినాఁడఁ
గాని కలవయ్యెఁ దాల్మి తత్కాలమందు. ౮

వ. కావున నాపల్క నెంచినపల్కుల నెల్ల నొక కాగితముపై లిఖియించికొని సభకుం జేరి యదియుం బఠింపఁజాలక రచ్చపెద్దకు దాని నందిచ్చుడు నతం డొక సభ్యునిచే దానిం జదివించె, నంత నల్లిన్సనుపక్షంబునక యోటమి వాటిల్లెఁ బ్రథమప్రయత్నంబునంద నా కపజయంబు సిద్ధించె, నైనను నాయాశయము ధర్మ్యంబకదా యనుతనివి నా కెంతయుం గల్గెఁ దదనంతరమ్ము నేను నా సభ్యతం ద్యజించినయట్లించుక జ్ఞప్తికలదు. సీమయం దున్నకాలమెల్ల నిట్టివ్రీడాభరముతోన కడచె నీలజ్జ సభలయంద కాక చెలికాండ్రమనికిపట్టులందును నన్నుఁ బీడించుచుండు; వెండియు: ౯

తే. "వెంటనరు" నాఁ జెలంగెడిపేటి కొక్క
నాఁడు త్ర్యంబకరాయితోఁ గూడి చనితి
నచట మ మ్మొకసభలోన నాకుబువ్వఁ
గూర్చి భాషింపుఁ డని చెలుల్ గోరి రపుడు. ౧౦

తే. వ్రాసితి నేను దగు నుపన్యాస మొండు
దాని సభలోనఁ జదువంగఁ బూనునంతఁ
గంప ముదయించెఁ జెమ్మటల్ క్రమ్మెఁ గనులు
పచ్చవడె నాకు గాద్గద్య మెచ్చిపోయె. ౧౧

క. పదపడి తత్పత్రముఁ గొని
చదివె ముజుందా; రతండుఁ జవు లుట్టిపడన్
మృదుతామాధుర్యగుణా
స్పదఫక్కి నుపన్యసించెఁ బ్రత్యేకముగన్. ౧౨

క. మొరయించి రంత సభ్యులు
కరతాళమ్ముల ముదం బఖండమ్ముగ న
త్తఱి నేమి సెప్పుదు నను
వరియించెను లజ్జ దుర్నివారం బగుచున్. ౧౩

సీ. అవల విద్యాభ్యాస మది పూర్తి గావించి
మాతృదేశమునకు మఱలువేళ
నాకుఁ దిండిని మెక్కునట్టి నెయ్యురకెల్ల
విందుఁ జేసితి; నాంగ్లవిషయమందు

నాటపాటలతోడ నార్భాటములతోడ
వాఙ్ముఖంబులతోడ వఱలు నద్ది
పాశ్చాత్య లోకవిద్యపగిది నేతత్క్రియఁ
గౌరవించుచునుందురి; నాయొనర్పు

ఆ. నలఁతివిందునందుఁ గలవు వినోదముల్
కొన్ని; దాన నేను గొంతకొంత
ముచ్చటింపఁ బూన మొదటివాక్యమ్ముపై
వెడల దయ్యె నొక్క నుడియు నదిర! ౧౪

తే. ఎల్లరికి నుల్లము ల్గడుఁ బల్లవింప
హాస్యరస మూర నే మాటలాడ నెంచి
సంతసమ్మున వావిచ్చునంతలోన
యూస లడుగంట నెగతాళి కగ్గమైతి. ౧౫

ఆ. తుదకుఁ "దాము కరుణతోడుత వేంచేసి
నందులకు ననేకవందనంబు"
లనుచుఁ దుగించివైచి యవ్వల నవమాన
భార మడరఁ గూలఁబడితి నేను. ౧౬

మంజరి.

ననుఁబాయదయ్యె నెన్నండు నీలజ్జ
అడఁగె నయ్యది "దక్షిణాఫ్రికాఁ" గొంత

అంతియ కాక నే నవిలంబితముగ
భాషింపలేనైతిఁ బదుగురలోన
అప్పుడప్పుడు గేలి నందుటే తప్ప
నీసిగ్గుచేత నా కెట్టిలోపంబు
సమకూరదయ్యె నీసంకోచ మపుడు
కడుఁ గొందలమ్మును గల్గించెఁ గాని
ఆనందదాయకం బయ్యె నాకిపుడు
మితశబ్దములు వాడు మెలఁకువ దీనఁ
గుదిరె వెండియుఁ గోరుకుల నడ్డగింపఁ
గలబలం బధికంబుగా నేరుపడియె
అర్థశూన్యం బైనయట్టిశబ్దంబు
నే నెన్నఁడుఁగ వచియింప లిఖింప
నని పల్కనేర్తు భయం బింతలేక
నాపల్కులో లేఖనమ్ములో నెపుడు
దోస మొక్కటియేని దొరలిన ట్లెఱుఁగ
ఈరీతి దురవస్థ లెన్నియో తొలఁగె
సదుపయుక్తం బయ్యె సమయం బదెల్ల
నిజమునకుం గొల్వె నెఱపునాతనికి
నావశ్యకంబు మౌనాశ్రియం బనుచు
నెఱిఁగించె నాకు నెంతే ననుభూతి
ఎఱిఁగియే నెఱుఁగకయే నప్పు డప్పు
డతిశయోక్తికిఁ బూని యుందు నిక్కమ్ముఁ

గప్పిపుచ్చుచు నుండుఁ గద మానవుండు
ఇది నశింపఁగ మౌన మెంతయున్ వలయు
అర్థశూన్యంబు లై నట్టిశబ్దములఁ
బలుకఁ డెన్నఁడు మితభాషియౌ నరుఁడు
పరిషత్తులందు నుపన్యసించుటకు
గ్రుక్కిళ్లు మ్రింగుచు గోష్ఠినాయకుల
నవకాశ మొసఁగుఁ డయ్యా! కొంచె మనుచు
వేధించువారలు వెలితి యైనట్టి
సమితి కాన్పించునే సామాన్యముగను
ఎట్టకేలకు నాజ్ఞ నెనసినవక్త
ప్రాయికమ్ముగఁ గాలపరిమితి న్మీఱు
వెండియు వ్యవధికై విజ్ఞప్తి సేయు
ఆన తీకున్నను నల్లె మాటాడు
సమయమ్ము వ్యర్థమ్ము సలుపుటే గాక
యితఁ డొనర్చెడి జగద్ధిత మింక నెద్ది?
నాబిడియంబపో నాకు డాలయ్యె
ననుఁ బరిపక్వం బొనర్చె నాసిగ్గె
చెలియయ్యె సత్యసంసేవ నా కదియె. ౧౭

## ౧౯ అసత్యవ్రణము

తే. ఆంగ్ల దేశమ్మునందు విద్యార్థిమాత్రు
లెల్లరును బ్రహ్మచారులై మెసఁగుచుండ్రు
చదువునకుఁ బెండిలికిని జుక్కెదు రటంచు
వార లుత్సాహపడరు వివాహమునకు.

క. మున్ను మనసంఘ మెంతయు
నున్నిద్రదశన్ వెలుంగుచున్నప్పుడు వి
ద్యన్నేర్చువానిఁ బిల్చిరి
పన్నుగ నల "బ్రహ్మచారి" పదమున లోకుల్. ౨

క. దురదృష్టవశంబున ని
త్తరుణంబునయందు గోఁచిఁదాల్చుచు నఱల్
గఱచెడుబుడుతల కకటా!
పరిణయములు సాగుచుండు భారతమందున్. ౩

వ. ఆంగ్లదేశమ్మున బాల్యవివాహ మ్మనుపదంబు నెఱింగినవా రొక్కరుం గానరామికి లజ్జపడి నాఁడానాఁడిక న్నివసించు హైందవవిద్యార్థులు పెక్కండ్రు పరిణీతు లయ్యు నవివాహితుల మనియ నుడువుచుండువార; లియ్యసత్యభాషణంబునకు వేఱొండు హేతువుం గలదు. ౪

క. తరుణులు పరిణీతులు త
ద్ధరణి వివాహంబుగాని తరుణులతోడన్
బెరసి వసియింప నంగీ
కరింప రెవ్వారు నది యకార్యం బనుచున్. ౫

సీ. తమకాఁపురము సేయు తావులం దాత్మీయ
పరిణయగాథలు బయలుపడిన
నాయిండ్ల లేజవరాండ్రతోడం గూడి
కులికెడిభాగ్యంబు కొఱతపడెడి
నని విచారముసల్పి హైందవవిద్యార్థు
లియ్యసత్యము వల్కి నియ్యకొందు
రద్దివి గోవాళ్లె యర్ధాంగులను నిర్ణ
యించుకోవలయు మే లెంచిచూచి

ఆ. దానఁ గన్యతల్లిదండ్రు లీసేఁతల
గొప్పకోలు సూపుచుందు రెందుఁ
గానరాదు ప్రాయికమ్ముగ నిట్టికూ
డికలయందు దోస మొకటియేని. ౬

వ. కాన నీసమయం దవివాహితు లగు యువతీయువలు కూడిమాడి చెరలాడుట సాజంబ యయ్యెఁ గాని. ౭

క. భారతవిద్యార్థులు తెల
వారలకు నిసర్గ మగుచు వఱలెడు నియ్యా
చారమున కగ్గపడినఁ
దీఱని చెట్టలు జనించితీరక యున్నే. ౮

క. వెస హైందవయువజను లీ
వ్యసనమునకుఁ జిక్కి కన్య లగు నాంగ్లబిస
ప్రిసవాత్ములసంగతికై
యసత్యజీవనము జరుప నాసించి రహో! ౯

ఆ. నావివాహ మయ్యె నందనుని న్మద్దు
మురువు లడర నెత్తి మురిసికొంటి
నైన నేమి? నేను నవ్వాగురం జిక్కి
యచట బ్రహ్మచారినైతి నపుడు. ౧౦

క. పాటిల్లద మోదము నా
కీటకఁరిబ్రదుకువలన నిసుమంతయు; నా
గాటంపులజ్జయే న
ట్టేటం బడనీక సాకె నిత్తఱి నన్నుఁ. ౧౧

ఆ. నానచే ననూనమైన మానములోన
నేను మునిఁగియుండ, నెనరువెలయు
లీల ముచ్చటించి లీల నాతోడ నే
యువతి కలసిమెలసి యుండఁ దలఁచు? ౧౨

తే. "వెంటనరు"లోన నానిల్చునింటిమగువ
తనయ కన్యావతంస ముత్సాహ మడర
నతిథిజనమును వయ్యాళి కనుదినంబుఁ
బిలిచికొనిపోవునాచార మలరుచుండు. ౧౩

తే. అత్తరుణి నన్ను నొక్కనాఁ డంతికమునఁ
బ్రకృతిసౌందర్యరాశియై పరిఢవిల్లు
కొండకుం గొనిపోవ నాకును వెఱంగు
వొడముకై వడి మున్నాడి నడువఁదొడఁగె. ౧౪

వ. అయ్యువతి నాతోడ నయ్యాయివిషయంబుల ముచ్చటించుచు నన్ను వేవేగ లాగుకొనిపోవుచుండె. నడుమనడుమ నొక్కొక్కమాఱు నే నెద్దియో వక్కాణించుచుఁ గడ కాననియో కాదనియో బళిరా యనియో లెస్సయనియో

మెల్లన పల్కుచుంటి నజ్జవ్వని విహంగివోలె ఱివ్వునఁ జనుచుండ వెండియు నిలు పేరు చెప్పుటకో? యని నేను ఱిచ్చపడం దొడఁగితి నిత్తెఱంగున నే మ గ్గిరిశిఖరంబు నారోహించి కొంతతడ వందు నిలిచి యంత నవరోహింప సాగితి మ త్తరుణంబునం దయ్యబలారత్నమ్ము పాదుకాధారిణి యయ్యు ధనుర్విముక్తనారాచంబువోలెఁ గ్రిందికి వచ్చుచుండ నే నసువుల నఱచేత నిడికొని తల్లడంపడుచుంటి నంతియకాక యాకన్నియ నాకంగారు నెచటఁ గన్గొనునో యనుసిగ్గు నా మొగంబునఁ జిందులుద్రొక్కుచుండె నయ్యవసరంబున. ౧౫

తే. వెనుదిరిగి నన్నుఁ గాంచి యవ్వెలఁది నవ్వి
యిట్లు ర మ్మట్లు దిగు భయం బేల? యీంత
గొనుము వలసిన న న్నటం చనడు నేను
దొప్పదోఁగితి నవమానతోయరాశి. ౧౬

తే. ఒక్కచో బందియాఁడి వేఱొకట దేఁకి
కొన్ని తావులఁ గూర్చుండి కొట్టుకొనకు
నెఱఁలో "ధన్యోస్మి" యనుకొంచు నిలకుఁ జేర
నెంతయుం గ్రేణిచేసె నయ్యింతి నన్ను. ౧౭

వ. ఎల్లయెడల నిట్లు తప్పించుకొనుట సాధ్యంబు కానేరదు. దయామయుఁ డగు నీశ్వరుండు నా యీవ్రీణంబును మాన్పం దలంచె నెట్లన. ౧౮

సీ. ఆరోగ్యనిలయమై యలరు "బ్రైటన్"నామ
జనపదంబున కొక్కసారి వెడలి
యన్నవిక్రయశాలయం దేను భక్ష్యముల్-
వివరంబు "ఫ్రెంచి"లో వెలయుకతన
నబ్బాస రాకుంట నఱిముఱిపడుచుండఁ
దత్రిత్యవృద్ధపితంతు వార్త
నాయవస్థ నెఱింగి నను గూర్మిమైఁ బల్క
రించి నీ వేటి కీరీతిఁ గలఁత

ఆ. పడెద వనఁ బరాసుబాస రాదయ్యె నా
కేను శాకభోక్త నింపు భోజ్య
మెద్దియో యెఱుంగ కిబ్భంగి గగ్గోలు
పాలఁ బడితి నంచుఁ బలికినాఁడ. ౧౯

క. అంతట నయ్యాము వివరణ
మంతయు నీ కెఱుకపఱుతు నని భోజ్యపదా
ర్థాంతరము లెల్లఁ దెల్పుడు
సంతస మెసలార నపుడు సాపడినాఁడన్. ౨౦

ఆ. ఇటుల మాకు మొదటియెఱుక పొసంగె న
య్యదియె నేస్తమయ్యె నంత నంత;
అవల సీమనున్నయన్నాళ్లు, నవ్వెన్క
నైనఁ దొలఁగ దయ్యె నల్లచెలిమి. ౨౧

క. మఱి లండనునం గల తన
యిరవువిలాసంబు నొసఁగి యొడయక ప్రతిభా
స్కరవాసరమ్ము విందున
కరుదెమ్మని నన్నుఁ గోరె నయ్యమ పేర్మిన్. ౨౨

వ. అదియునుంగాక పండువు లాదిగాఁగల వేడుకదినంబు లొదవునపుడును న న్నాతిథ్యమున కాహ్వానింపసాగె. నేను నందులకుఁ గృతజ్ఞతమై నియ్యకొని యయ్యయిదినంబుల వెడలుచుంటి నంత. ౨౩

ఆ. విందులందు నాదుమందాక్షమును బాఱఁ
దోలనెంచి యవ్వధూటి మంచి
కన్నియలకు నన్నుఁ గాన్పించి వారితో
ముచ్చటించు వీలు నిచ్చె నాకు. ౨౪

తే. సరససల్లాపముల నిట్లు నెఱపుకొఱకుఁ
గలదు ప్రత్యేకముగ నొక్కకన్నె యచట
ఆపడుచుతోడ నేను మాటాడువేళ
వెడలు మమ్ములవీడి యావృద్ధనారి. ౨౫

ఆ. పలుకుపొం దెఱింగి భాషింపఁ జాలమిఁ
గేరడంబు లాడనేరకున్కి
వ్యంగ్యభరితవాక్యభంగు లే నెఱుఁగమి
నించదయ్యె నాకు నిద్ది తొలుత. ౨౬

క. ఆవల నత్తోయలి తగు ౨౬
త్రోవలు సూపింపఁ దత్కుతూహల మంతఁ
దైవాఱె నెల్లవేళల
భావం బూటాడె నాదివారముకొఱకుఁ. ౨౭

వ. ఇట్టు లప్పుడుచుఁగోడిముచ్చటల కిచ్చవడి యవకాశంబు వచ్చినప్పు డెల్ల నచ్చెలియచెంతకుం జొచ్చుట కుత్సహించితి నత్తటి నమ్ముదుసలి యక్కన్నెదెస నా కెంతయు నాస గొలుప నారంభించుడు మమ్ము సంధింప నియ్యమ్మకెద్దియో యభిలాష ముండునని తలంచి శంకాసాగరంబునఁ గ్రుంకులిడి “కట్టా! యెట్టిచెట్ట పాటిల్లె మొట్టమొదటనే నావివాహగాథం దెలిపికొన్న నిట్టిసమావేశమ్ము నీపె సంఘటింపకుండుఁగదా! గతమ్మునకు వగచినం గల్గు మేలెయ్యది? యింక నైనం ద్వరపడి యీనేరము సవరించుకొనుట కర్తవ్యంబు. నిక్కంబు నివేదించుటయ నా కెల్లభంగుల నిపుడు లెస్స” యని తలంచి యాయమ్మ కీదిగువకమ్మ లిఖించి పంపికొంటి. ౨౮

క. “అంబరో! “బ్రైటను”లో మన
కుం బరిచయ మొదవు టాది కొమరునివలె న
న్నుం బ్రేమించితి వెల్లవి
ధంబుల నను సంస్కరింపఁ దలపోసి తహో. ౨౯

తే. నాకు నిపుడు వివాహంబొనర్ప మీర
లెంచినార లటంచు నూహించుచుంటి
మీకు మది నట్టిముచ్చట లేకయున్నఁ
బూని కూర్తురె? పడుచులపొందు నిట్లు. 30

క. మీకరుణ కే ననర్హుఁడ
నా కెపుడో పెండ్లి జరగినది కర్జంబుల్
పాకము దప్పకమును పే
యీకత మా కెఱుక నేఁత హితమాను గదా. ౩౧

క. నాకుం బెండిలి యగుటయు
కాక కుమారుండు నొకఁడు కల్గెను ముందే
మీ కివ్విషయముఁ దెల్పుట
నాకృత్యము కాని మానినాఁడను దానిన్. ౩౨

తే. ఇచట భారతవిద్యార్థు లెల్లఁ దమకుఁ
బెండ్లి కాలే దని వచించువిధము నెఱిఁగి
కల్లలాడితి నేను నక్కరణిఁ దొల్లి
యిప్పు డయ్యది యొగ్గటం జెఱుకవడియె. 33

ఆ. ఇంతదాఁక మీకు నివ్వార్తఁ దెలుపమి
కేను మిమ్ములఁ జింత నెనయుచుంటి
నైన నేఁడు నిక్కమాడు ధైర్యము నీశుఁ
డొసఁగెఁగాన వేడ్క నొందుచుంటి. 34

ఆ. నీతిబాహ్యమైన చేఁతల నయ్యెంతి
చెంత నింతవఱకుఁ జేసియెఱుఁగ
నిం దసత్య మించుకేనియు లేదు మ
న్నింపరా కొమ్మ! నన్ను నెయ్య మలర. ౩౫

మంజరి.

ఈలేఖముం బఠియించిన వెనుక
నోతల్లి! నేను మీ రొసఁగువిందునకుఁ
బాత్రుండఁ గానంచు భావింతు రేని
యయ్యది నే దోస మని నిర్ణయింప
ఇన్నాళ్ళనుండి నాయెడ మీరు సూపు
మమత నక్కటికంబు మఱచిపోనేర
ఏనాఁటికిని వానిఋణ మీఁగఁజాల
న న్నింక మీవిందునకును బాత్రునిగ
నెంచెద రేని నే నెల్లచందముల
నప్పాత్రతం గొనియాడి సౌఖ్యంబు
లెప్పటివలె నంది యెంతు నద్దాని
భవదమలప్రేమభావాంక మనుచు." ౩౬

వ. ఈవ్రాయసంబు నీరీతి సంతరింప నే నెన్నిగంటలు తంటాలు వడితినో చదువరు లెఱుంగుదురుగాక! ఈరచన ముగియు లోపల నెన్నిచిత్తు లవతరించెనో వేఱె చెప్పనేల? కాని

యీజాబుతో నాభార మెల్ల దూరమయ్యె నయ్యమ్మ
యిక్కమ్మం గన్నవెంటనే యిట్లు ప్రత్యుత్తరంబు నంపె.

ఆ. "చాటుమాటు విడిచి సకలంబు విశదంబు
చేసి నీవు పంపు చీటి వచ్చెఁ
బడుచు నేను దానిఁ బొడఁగాంచి కడుపుబ్బ
నటులు నవ్వుకొంటి నయ్య గాంధి. ౩౮

తే. నీవచించిన బొంకు మన్నింప నర్హ
మిపుడు నిజమాడి తది యెంతయేని లెస్స
వెనుకటివిధాన నినుఁ బిల్తు విందుకొఱకు
రమ్ము రేపటిభానువారమ్ము విడక. ౩౯

ఆ. ఎదురుసూచుచుందు మేము నీకొఱకు నీ
పెండ్లిసుద్దులెల్ల నెల్లడించి
మాకు నిందువేడ్క చేకూర్పు; మన చెల్మి
చెడదు దీనఁ బెక్కునుడువు లేల." ౪౦

వ. ఏ నిట్టిలేఖకు నెంతయు సంతసించి యథాపూర్వ మానారీ
మణిగారవంబును జూఱలాడుచుంటి; మఱియు. ౪౧

తే. పూని బొంకనుపుంటి నిప్పొల్కి మూల
ముట్టుగాఁ గత్తిరించితి; నట్టు వెనుక
నాదుపెండిలిసుద్ది నెన్నండు నక్క
మాడుటకు నేను వెన్కముం దాడిమొఱుఁగ. ౪౨

# ౨౦ మతపరిచితి

సీ. ఆంగ్లదేశమ్మునయందు నావసియించు
కాలమ్మునం బెండ్లిగానివారు
నన్నదమ్ములును దివ్యజ్ఞానసామ్రాజి
కులు నగువార లిర్వురు లభించి
రనుఁగులు నాకు; వా "రార్నాల్డుఁ" పండితు
గీతానువాదంబుఁ బ్రీతి వెలయఁ
జదువుచుఁ దమతోడఁ గదిసి వేలుఘునుడ్జీ
దనరుగీతఁ బఠింప నన్నుఁ బిలిచి

ఆ. నేను దల్లిబాసనేని దానిం జదు
వమికిఁ గరము లజ్జఁ బల్లటిల్లి
సంగడీండ్రతోడ సంకోచ ముడర నా
విషయమెల్ల నపుడు వినిచినాఁడ.

వ. అంత జేజేలబాసలో నాకుం గల చొఱవ కొంచియమ్మని యెఱింగియు నయ్యాంగ్లానువాదంబు మూలమ్మున కెం దెందు వేఱయ్యె నయ్యది కనుంగొనఁగలబలిమికిం గొఱంత లేదని యూహించి యచ్చొలికాండ్రి కవ్విషయంబు నెఱుకపఱిచి వారితోడం గూడి భగవద్గీతం బఠియింపఁ దొడఁగితి నందలి. ౨

ఆ. *సంతతంబు విషయచింతనఁ గావించు
పూరుషునకు దానఁ బొడము సంగ;
మంకురించుఁ గామ మలసంగమునఁ జేసి;
యామతిల్లు నలుక కామమునను. 3

తే. ♦అలుకచే సంభవించు మోహమ్ము; మోహ
మునను బొటిల్లు విస్మృతి; బుద్ధినాశ
నంబు విస్మృతివలన జన్మంబునందు
బుద్ధినాశమ్మునం జెడిపోవు నరుఁడు. ౪

వ. అను పద్యంబులు నాచిత్తంబునం బొడుకొనియెఁ దన్నిన దంబు నాశ్రవఃకుహరంబుల నింబుగా నేఁడును రవళించెడి

* ధ్యాయతో విషయాన్ పుంస స్సంగ స్తేషూపజాయతే
సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోభిజాయతే.

♦ క్రోధాద్భవతి సంమోహ స్సమ్మోహాత్ స్మృతివిభ్రమః
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా ద్వినశ్యతి.

నిగ్గీత విలువయిడరాని పొత్తమ్మను నమ్మినాక నాకు నానాఁ
టీకీం బొంపిరివోవుచున్నయది. తత్త్వజ్ఞానమున దీనికిం
దులయగుగ్రంథము వేఱొకం డేవాఙ్మయంబునందును
లేదని నాకు దృఢవిశ్వాసంబు గలదు. నాకుఁ జిత్తంబు
కలఁగంబాఱినపుడెల్ల నియ్యది యెనలేని మే లొనరించె.
దీనికి నింగిలీసుబాస నెన్నియనువాదంబులేర్పడె వాని నెల్ల
నేఁ బఠియించితి నం దార్నాల్డురచితంబ మేలుబంతి
యని నాయాశయమ్ము. నే నీనెయ్యురతో నియ్యుపని
షత్తుం జదివినను దీని నపుడు బాగుగఁ బఠించితి నని
పలుకనోపఁ దదనంతరమ్మునం గతిపయవత్సరములు చెల్లిన
వెనుక నియ్యది నాదైనందినపారాయణమ్మునం జేరె;
వెండియు. ౫

తే. సిద్ధమతియైన "యార్నాల్డు" బుద్ధుఁ గూర్చి
* "యాసియాజ్యోతి" యనుపేర వ్రాసినట్టి
గ్రంథముం బఠియించితిఁ గాంక్ష వెలయఁ
గరము నలరించె నప్పుస్తకంబు నన్ను. ౬

సీ. మఱియు నచ్చెలు లొక్కమాఱు నన్ను "బిసెంటు"
నకు నెఱిఁగించి రన్నాతిమిన్న
యర్థించెఁ దనదుదివ్యజ్ఞానసంఘమ్ము
నందుఁ బ్రవేశింపు మనుచు నన్ను

* లైట్ ఆఫ్ ఏషియా.

నామతం బెఱుఁగనినాఁ డన్యమతము ని
వ్విధిని బూనుదు నంచు వినయ మెసఁగఁ
జెప్పి తిరస్కరించితి నామెకోర్కె నే;
నవలఁ దద్ధితవాణి ననుసరించి

తే. ♦ తన్మతగ్రంథమును శ్రద్ధఁ దాల్చి చదివి
నాఁడ నద్దానఁ దనకు హైందవమతమ్ము
తత్త్వముం బ్రకటించుగ్రంథముల నెల్లఁ
జదువ నభిలాష ముదయించె హృదయమందు. ౭

వ. వెండియు నప్పఠనంబునంజేసి క్రైస్తవమతబోధలు హిం
దూమతంబు గుడ్డినమ్మకలకుం బుట్టినిల్లని తెగడునగడు
నిరాధారం బని యెఱింగితి నదియుంగాక. ౮

సీ. ఆకాలమునయందె శాకాన్నశాలలో
నుత్తమక్రైస్తవుం డొక్కరుండు
పరిచితుఁడై నాకు నెఱిఁగించె నాత్మీయ
మతమహిమంబు ప్రేమంబు గదుర
అలరాజకోటయందలిక్రైస్తవమతప్ర
వర్తకు లూహ్వానుదుర్వర్తనంబు
లతని కే వినిచితి నందుల కాతండు
తద్దయు సిగ్గిల్లి తల్లడిల్లి

♦ కీ టు థియాసఫీ.

ఆ. యేను శాకభోక్త నెన్నఁడు మద్యంబు
ముట్టి యెఱుఁగ; మాంసమును భుజించి
కల్లు పెల్లు ద్రావు క్రైస్తవు లెందఱో
జగతిఁ గలరు దీన శంక లేదు. ౯

వ. అయినను. ౧౦

## మ ం జ రి.

మద్యమాంసంబుల మరగుఁ డటంచు
నెందును శాసించి యెఱుఁగదు "బైబి"
లద్దానిఁ బఠియింపుఁ డంతేయు నీశ్మకు
నవగతంబగు నన, నగు నంటి నేను
పిదప నతండు బైబి లొసంగె నాకు
శ్రద్ధమై నద్దానిఁ జదువ సాగితిని
దానిలో నున్న ప్రాఁతనిబంధనమ్ము
పఠియించుతఱి శిరోబాధ నన్నేఁచెఁ
గ్రొత్తనిబంధనకుం జెందు భాగ
మానందవారాశియం దోలలార్చె
నద్దాన విలసిల్లు * నద్రిప్రవచన
మెన యగు గీత కం చేఁ దలంచితిని
"ధర్మేతరంబు నధర్మంబుచేత
నిర్మూలముం జేయనేర వీ వెపుడుఁ

* సెర్మన్ ఆన్ ది మౌంట్.

జెనఁటియై నీకుడిచెంపపై నెవ్వఁ
డేని గొట్టినఁ జూపు మెడమచెంపయును
బలిమిమై నెవఁడేని పై వల్వఁ గొనిన
నంతరీయముసైత మాతని కొసఁగు”
మనెడిసూక్తులు నన్ను నలరించె మిగుల
“సలిలంబు నీకు నీఁజాలినవాని
కిష్టమృష్టాన్నంబు నిడుమా” యటంచుఁ
బలికినశ్యామలభట్టాఖ్యసుకవి
తల్లజుపద్యంబు తలఁపునం బాఱెఁ
దాదృశంబగునట్టి త్యాగంబె జగతి
మంచిమతం బంచు మది నమ్మినాఁడ. ౧౧

వ. అంత నీవ్యాసక్తి న న్నితరమతస్థాపకులచరిత్రంబుల నెఱుంగం ద్వరపెట్టుడుఁ “గార్లయిలు” రచియించిన* ‘వీరులు-వీరపూజ’ యనుగ్రంథముం జదువఁ దొడంగి యందలి మహామ్మదుజీవనకథం బఠించి యతనిగొప్పతనంబును, మగతనంబును, దబిసితనంబును దెలిసికొంటి నంతలోఁ బరీక్షలు చేరువయగుటం జేసి తత్పఠనంబు నాపవలసివచ్చెఁగాని సర్వమతధర్మమర్మంబుల నెఱుంగవలయు ననిమాత్రము నిర్ణయము గావించుకొంటి నత్తరుణంబున నాస్తిక

* హీరోస్ అండ్ హీరోవర్షిప్.

మతతత్త్వంబు నెఱుంగఁ గోరి తత్సంబంధిగ్రంథమ్ము నొక
దానిం జదివితిఁ గాని నే నప్పటికే నాస్తికతామరుదేశముం
గడచియుంట నయ్యది నాకు నించదయ్యె నపుడ
♦ నసంతాదేవి నిరీశ్వరవాదంబు విడిచి సేశ్వరవాదంబు
నవలంబించె నప్పరిణామమ్ము సైతము నాస్తికతయెడ నా
కనాసక్తి కలుగఁ దోడయ్యె నింకను గొన్నికారణంబులు
సాయపడుటం జేసి నా కమ్మతంబుదెస ననూయ వొడమె.
౧౨

---

♦ బిసెంటు.

# ౨౧ దిక్కు లేనివారికి దేవుఁడే దిక్కు

వ. ఆర్ష మతంబుతోడను మహమ్మదీయ క్రైస్తవాద్యన్య మతంబులతోడను నా కించుక పరిచయ మున్నను సంకటసమయమున్మూలం దయ్యాది న న్నుద్ధరింపఁజాల దని నాకుఁ దెలియదయ్యె నిక్కట్టు లొదవినపుడు తనకు దేన రక్షణము గల్గు దానిఁగూర్చి మనుజున కపు డెఱుక యుండనేరదు. నాస్తికుండు తనవిపత్తు తొలఁగుటకు నిసర్గమే మూలంబను. ఆస్తికుఁడు తన్ను భగవానుఁడు మనిచె ననియు నందులకుఁ దన తత్త్వజ్ఞానమును, దపస్సాధనయు నొకహేతు వనియు భావించు; నిట్లెల్లరుం దమయిచ్ఛవచ్చిన ట్లూహింప నడ్డు లేదు. మానవుం డెపుడు తనసాధనాబలంబున నహంకరించు నపుడ తద్బలంబు నిర్మూలం బగునని యెఱుంగవలయు

నిట్టివేళల యందు శాస్త్రజ్ఞానముకంటె ననుభూతి పర
మావశ్యకము. కేవలశాస్త్రజ్ఞానము నిరర్థకం బనువిష
యమ్ము నేఁ దొలుత సీమలోఁ దెలిసికొంటిఁ దత్పూర్వము
వాటిల్లిన యాపదలనుండి యే నెట్లు బయటఁ బడితినో
చిన్నవాఁడ నగుట నాకెఱుకపడదయ్యె. నేఁడన్ననో వింశతి
వర్షప్రాయుండ. గార్హస్థ్యసౌఖ్యము నాచేఁ జక్కగా
నవగతంబయ్యెఁ బైపెచ్చు బిడ్డతండ్రిని సైత మైతి నిట్లు
నే నాంగ్లావని న్వసించు తుదివత్సరమ్మున.

తే. "పోర్ట్సుమతు*" నాఁ జెలంగెడి పురమునందు
జరిగె శాకాన్నభోక్తలసభ యొకండు
దానిఁ దిలకింప నొక నేస్తకానిఁ గూడి
యేను వెడలితి వేడ్క నాహ్వానమంది. ౨

తే కడలికరవాఁక యగుటచేఁ గర్ణధారు
లుండి రవ్వీటఁ బెక్కు; రందున్నవాలుఁ
గంట్లు పెక్కండ్రు వెలయాండ్రు కారుఁ గాని
యించుకేనియుఁ జక్కటి నెంచఁ బోరు. 3

తే. అట్టిచానలతో నిండినట్టియింట
విడిసితిమి మేము వివరముల్ తెలియకునికి
రాత్రిభోజన మెనతర్వాత మొదలు
పెట్టితిమి నెయ్యురం గూడి పేకరంతు. ౪

సీ. తమయింటియతిథిబృందముతోడఁ జెలులు పే
కాడునాచార మయ్యాంగ్లభూమిఁ
దనరు నయ్యాటలోఁ దప్పులేని ఛలోక్తు
లెలమిమైఁ బల్కెద రెల్లవారు
మేమున్నగీమునచామ లీనడవడిం
బాటించి మాతోడ నాటనాడఁ
దొడఁగి రయ్యది రెండుగడియలే సాగె న
ప్పడతు లంతట నీతిబాహ్యమైన

ఆ. వేడుకలకు మొదలువెట్టిరి బీభత్స
రసము వెల్లివిరిసె రచ్చలోన
నందుఁ బాలుగొనియె నక్కట! నామిత్రుఁ
డెఱుఁగనైతి నాతఁ డిట్టిఁ డనుచు. ౫

ఆ. ఇచ్చవడితి నేను నిమ్ముచ్చటల కయో
ముదురసాగె సరసములు కరమ్ము
పేకముక్క లవలఁ బెట్టునవస్థయు
సిద్ధమయ్యె నేమి సెప్పువాఁడ. ౬

వ. ఇంతలో భగవానుండు నాసంగడీనియంతరంగమ్మునఁ జేరు
టం జేసి యతండు నన్నిట్లనియె. ౭

తే. బళిరె! యీ ఘోరకలికి నిష్పాపమునకు
నకట! నీవును బానిస వగుదువొట్టు?
వలదు వల దిందు నీ వుండవలదు వలదు
లెమ్ము లేలెమ్ము పొమ్ము పోపొమ్ము వెలికి. ౮

క. అనవుడు లజ్జాంబుధి నే
మునిఁగితి నప్పనుపు మస్తమునఁ దాల్చితి నా
తని మది మెచ్చితిఁ బదపడి
జననికడ నొడువుబాస జ్ఞప్తికి వచ్చెన్. ౯

వ. పదంపడి. ౧౦

క. ఊడనిఁబాడితి గడగడ
లాడితి నానిల్పుసజ్జ కరిగితి మృగయా
పీడకుఁ దప్పినహరిణము
జాడ న్నాగుండె లదరె జడిగొనెఁ జెమటల్. ౧౧

ఆ. నాఁటిరేయి నిదుర నను డాయదాయె నా
యాత్మఁ బెక్కుచింత లలముకొనియె
నిదియె నాకు లాఁతియింతులపట్ల వి
కార మొదవ మొదటిసారి యాయె ౧౨

ఆ. అంత నెంతచెట్ట యయ్యె దైవంబ! యి
ప్డేమరిల్లి యున్న నెట్టులగునొ?
యని తలంచి యింక నైనఁ బరాకును
దలఁగవలయు నంచుఁ దలఁచినాఁడ. ౧౩

తే. అవల నిది వాసయోగ్య మైనట్టి తావు
కాదు కా దని యెంచి సంగాతి నెడసి
నాఁటివలువాత లేచి పై నంబుగట్టి
వీడనాడితి నప్పాడువీడు నేను. ౧౪

మంజరి.

భగవానుఁ డపుడు న న్బాలించె ననుచు
లెస్సగాఁ దెలియంగ లేనైతిఁ గాని
సకలకష్టములందు సాకె న న్నతఁడె
ఇప్పు డవ్విషయంబు నెఱిఁగికొన్నాఁడ
ఈపరిజ్ఞానమం దింకను నాకు
సంపూర్ణ మగునట్టి చతురత లేద!
అనుభూతిచేఁ గాక యన్యమార్గమున
వేద్యంబు గాని దవ్విషయ మెవ్వనికి
ఆధ్యాత్మికక్రియలందుఁ బెక్కింట
నల న్యాయవాదికృత్యంబునయందు
నైకసంస్థల సల్పి నడుపుకాలమున
రాజకీయాఖిలారంభంబులందు
నేచి న న్బ్రోదివినయిక్కట్ల నెల్లఁ
దొలఁగంగఁ ద్రోలి నిస్తులదయ న్నన్ను
నేలినజగదీశు నేలీల మఱతు?
వెరవులు సకలంబు విఫల మైనపుడు

తోడున్న వారెల్లఁ దొలఁగినయప్పు
డవకాశ మంతయు నడఁగారినప్పు
డెట్టులో చేకూఱు నీశ్వరుసాయ
మే ననుభుక్తిచే నెఱిఁగితిం దీని. ౧౫

వ. మఱియు స్తుత్యుపాసనాప్రార్థనంబు లంధవిశ్వాసమ్ములు గావు అన్నపానాదులకంటె నయ్యవి కడుంగడు సత్యంబులు. ఇవియు నిక్కంబులు. శేషంబు లెల్లం గల్ల లనుట స్వభావోక్తికి దూరం బనరాదు. ఇయ్యుపాసన నుడికారంపు సొంపు గాదు. దీనికి నాధారము చిత్తంబు గాని జిహ్వ గాదు. కాన మానసికమాలిన్యమును భక్తిరసమ్ముచేఁ గడిగివైచికొన్నవార లప్పరమాత్మం బ్రాపింపఁ గలరు. అమ్మాలిన్యంబును నిర్మూలింప మనఃపూర్వక మగు నుపాసనకంటె సమర్థం బగు సాధనం బితరంబు మృగ్యంబ. అయ్యది కడుంగడు విధేయతతో నెనసియుంట యెంతయు నావశ్యకంబు. ౧౬

---

# ౨౨ నారాయణహేమచంద్రుఁడు

క. భారతమునుండి యత్రతి
"నారాయణహేమచంద్ర"నాముఁడు సీమం
జేరె నతఁడు లేకరియై
పే రందినవాఁ డటంచు వినియున్నాఁడన్.

సీ. ఆకారమున వేసమందు వాగ్ధోరణి
నొకవికారపురీతి నొప్పు నాతఁ
డతనితోఁ బరిచయం బయ్యె నా కొకచోటఁ
బిలిచితి నతని నానిలుచుబసకు

ఇంగ్లీషు బోధింపుమీ! యంచు నతఁడు న
న్నర్థింప నీకొంటి నఁదులకును
మొదలిడితిం బాఠములు సెప్ప వ్యాకృతి
జ్ఞాన మాతని కించుకేని లేదు
తే. "బాలుఁ"డను దానిఁ గ్రియ యంచుఁ బలుకుఁ "జదివె"
నన్నది విశేష్య మని చెప్పు, నతని దిద్దఁ
దరముకాదయ్యెఁ దనకు వ్యాకరణ మిట్లు
రామి కతఁ డెన్నఁడును విచారంబు వడఁడు. ౨

వ. అతం డొకమఱి నన్నుఁ గాంచి "మిమ్ముంబలె నే నెన్నడుం బాఠశాల కేఁగనైతి. నాయభిప్రాయంబుల వెల్లడించుతఱి శబ్దశాస్త్రంబుతోడియుక్కఱ నా కెన్నఁడుం బొడకట్టదయ్యె. హిందీ మరాటీ బంగాళీబాసలం దేను కృతాభ్యాసుండ. మహర్షి దేవేంద్రనాథఠాకూరువిరచితంబులగు వంగకృతుల ననువదించి ఘూర్జరసోదరుల కొసఁగితి నింకను బెక్కుసద్గ్రంథముల లాఁతిబాసలనుండి యనువదించి గుజ్జరాతివారికి సమర్పింప నాకుఁ దలంపు గలదు. మూలమునందలిభావమ్మును దెచ్చుట మాత్రమ నాయనువాదలక్ష్యము. లక్షణశిక్షాదూరుండనై యే నెఱింగినబాసయే నాకుఁ బదివేలు. ప్రస్తుతమునం దాంగ్లేయభాషఁ జదువఁ దొడఁగితిఁ బదసముదాయంబునర్థమ్ముఁ దెలిసికొనుటయ నాకుఁ గర్తవ్యంబు. కాలక్రమంబున బరాసు *జార్మణ్యము

* జర్మనీ.

మున్నగు బాసలసైత మభ్యసించి నే నాయాయి దేశ
మ్ములం జూడనెంచితి ననవుడు నే నతనిఁ గాంచి. ౩

తే. అమెరికాఖండమునకు మీ రరుగ రొక్కొ!
యనుడు సంశయ మేల యే నవ్వినూత్న
విశ్వసౌభాగ్యసౌందర్యవీక్షణంబు
సేయ కేరీతి భారతక్షితికిఁ జనుదు. ౪

క. విత్తవిచారము నాదగు
చిత్తమ్మున లేదు నాదుచెలికాండ్రును నా
పొత్తంబులు నా కొసఁగెడు
విత్తంబే చాలు నాదువెచ్చమ్మునకుఁ. ౫

క. డంబములతోడుత న్నా
కుం బనిలే దేను బొట్టకుం బట్టకు న
ల్పంబుగ వెచ్చింతు వినో
దంబులకుం బోక దవ్వుదవ్వుల నుండుఁ. ౬

తే. ఏను మూఁడవతరగతిలోనె పయన
మాచరించుచునుందు రే నమెరికాకుఁ
బోవుచో "డెక్కు"మీఁద నే పోదుఁజుమ్మి
రిత్తవెచ్చమ్ము నేల భరింపఁ? జెపుమ. ౭

వ. అని యతండు మాఱువల్కె నిట్టి మేలినడత హేమచం
ద్రునిసొత్తై వెలయు. వెండియుఁ దత్ప్రవర్తనంబున కుద్ది

యగు నుల్లంబును మిడిసిపాటులేమియు నతనికి సవరింపని రవణంబులై హావణిల్లుఁ గాని తనసామర్థ్యముం గూర్చి యతనికి మితిమీరిన విశ్వాసం బొకటి కలదు. మే మను దినంబును గూడుచుండువార మతండును శాకాహారంబ భుజియించు. మా కుభయులకుం బెక్కుచేష్టల సామ్యంబు దనరు, నిర్వైరము స్వయంపాకులము. ఒకనాఁ డతండు నా కతిథి యగు నమ్మఱునాఁ డే నతనికి విందనయ్యెడివాఁడఁ బ్రాయికమ్ముగా మే మొక్కతావునంద యారగించు చుండువార, మిట్లుండ నయ్యవసరంబున. ౮

తే. కార్మికులదెస నెంతేని కరుణసూపు
సుకృతి "మానింగు" కీర్తి యస్తోక మగుచు
లండనుపురంబునం దెల్ల నిండుకొనుడు
హేమచంద్రుం డతనిఁ జూడ నిచ్ఛగించె. ౯

ఆ. అతనిసాహసంబు ఎరసి మిత్రమ! మేల
తరము వాఁ డతం డుదారచరితుఁ
డతనిఁ గాంచ శక్యమగునొటు? మనబోఁటి
యలఁతివాండ్రి కనుచు నంటి నేను. ౧౦

వ. అనుటయు నతం డిట్లనియె. ౧౧

## మ ం జ రి.

''ఏల సందియ మందె దిటు నేస్తకాఁడ
తప్పక యతని సందర్శింపవచ్చు
వినుము దానికిఁ దగువేర వెఱింగింతు
నే గ్రంథకర్తనై యొసఁగినయట్లు
నతనియౌదార్యంబు నతనిశీలంబు
నాలించి కడుముదం బందినయట్లు
గనులార నాతనిఁ గాంచి కృతజ్ఞ
తను వెల్లడింపఁగాఁ దలఁచినయట్లు
నాంగ్లభాష నెఱుంగనట్టిహేతువున
నిను దుబాసిగఁ దేర నే నెంచినట్లు
నతనికి నా పేర నంపుమా! కమ్మ"
అనవుడు నే నట్ల యాచరించితిని;
"విడువక మీరు రా వేఁడుచున్నాఁడ"
ననుచు బదుల్జాబు నంపె "మానింగు"
హేమచంద్రునియత్న మిట్లు ఫలింప
నోదవె నాశ్చర్యం బనూనమై నాకు. ౧౨

వ. అంత నొకనాఁడు మే మమ్మహాశయుం జూడ బయలుదేరి తిమి. నే నత్తఱిఁ దగు పటాటోపమ్ముతో నుంటిఁ గాని చెలికాఁడు యథాపూర్వమ్మునగాఁ దనవికారవేషంబుఁ దొలఁగింపఁడయ్యె నందుల కే నించుక గేలిసేయుదు. ౧౩

క. డంబముల మెచ్చెదరు పా
ఱుంబోతులు మీరు సత్పురుషు లెప్పుడుఁ జి
త్తంబును మెత్తురు గాని ము
దం బందరు వేసమునకుఁ దళుకుంబసకున్. ౧౪

వ. అని యతండు వల్కెఁ బదంపడి మే మమ్మానినిఁగుభవనంబు సేరి యతనిం దర్శించి వానిసమర్పించు సత్కారంబులం బడసినవెన్క నారాయణ హేమచంద్రుం డతని యథోచితమ్ముగ గౌరవించి యాయనదీవనలం బడసె నంత నేము మా మనికిపట్టులకుం జేరితి మిట్లుండ నొక్కనాఁడు. ౧౫

క. అరచట్టఁ దొడిగి కొకిబికి
పరిధానమ్మును ధరించి బారెడుగడ్డం
బరుదుగ నెసంగ నాబస
కరుదెంచెను మద్వయస్యుఁ డాంగ్లము సేర్పన్. ౧౬

సీ. అది క్రొత్తబస యౌట నయ్యింటిమగువ త
త్పూర్వంబు హేమచంద్రుని నెఱుంగ
దయ్యె నట్లౌట నయ్యతివ కవాటంబు
విచ్చునంతనె బిట్టు వెఱపు నంది
సంభ్రమంబున నాదుసరసకుఁ బేరెమ్ము
వాఱుచు వచ్చి యెవ్వండొ వెడఁగు

నీకొఱ కేతెంచి వాకిట నున్నవాఁ
డనవుడు నంగణమ్మునకు నేఁగి

ఆ. హేమచంద్రువేస మీక్షించి తద్దయు
నక్కజంబువడితి నతఁడు వెట్టి
నవ్వు నవ్వసాగె నామిత్రునకు సహ
జంబు లిట్టిలక్షణంబు లరయ. ౧౭

వ. అయ్యవసరంబునం దేను నెచ్చెలీ! నీయావికారవేషంబు గాంచి వీధిలోనిబాలురు గోలసేయక మానిరో? యనుడు నతండు. ౧౮

ఆ. గోలఁ జేసినారు గుంపులుగుంపులై
పిఱుఁద నడచినారు పిల్ల లెల్ల
వారిదెసకు దృష్టి సారింపనైతి నే
నంత వెనుకవెనుక కడుగు లిడిరి. ౧౯

వ. అని వాక్రుచ్చె నిట్లతండు లండనునగరమ్మునం గొంతకాల ముండి యవ్వలఁ బరాసునాటికిం జని యాదేశమ్మునందలి బాస నేర్చి యందలిగ్రంథములం గొన్నింటి ననువదించి పదంపడి పూర్వోక్తప్రకారంబున నమెరికా కేఁగి యందుఁ దనకు సాజం బగువేసంబుతోఁ దిరుగాడఁ దొడంగుడు నయ్యది యాసీమ ననాగరకవేషం బగుట సంయుక్త రాష్ట్రంబులలో నతండు దొరతనమువారిచే నిర్బంధితుండై యెట్టకేలకు విముక్తుం డయ్యె. ౨౦

# ౨౩ గొప్ప సంత

కం. పదునెన్మిదివందల తొం
బదియగు వత్సరము క్రైస్తవశకమ్మునయం
దొదవినతఱి "ప్యారిసు"లో
న దొడ్డవస్తుప్రదర్శన మొకటి జరిగెఁ.

ఆ. ఏను దానిఁ జూడ నేఁగితి దృశ్యముల్
పెక్కు లచటఁ గంటి నక్కజముగఁ
గాని కేవలం బయోనిర్మితంబు గో
పురము నింతవట్టు మఱవ నైతి. ౧

క. పొడుగువెడల్పులు దక్కఁగ
నుడువంగాఁ దగినయట్టి నూత్నత కానం
బడదయ్యె నందు దానఁ
దొడరెడుసంతృప్తి యెట్టిదో కననైతిఁ. ౩

వ. దానిం దెగడినవారు పల్వురు గల రందు "టాల్‌స్టాయి"
ప్రథమగణ్యుం డతం డిది మానవునియొఱుంగమికి నంగ
మచ్చం బనియు ధూమపానంబుచే మతిపోయినమానుసు
లిట్టిబయలిమేడల నిర్మింతు రనియుఁ బల్కె వెండియు. ౪

క. నాగరకతయును స్వేచ్ఛయు
భోగపరాయణతయుఁ బ్రభూతమ్ముగ న
చ్చోఁ గలదు గాని కోవెల
లోఁ గా లిడినంత నాత్మలో మార్పొదవుఁ. ౫

వ. "వర్జిఁ మేరీ" విగ్రహమ్మునెదుట మోఁకఱిల్లి చేదోయి
నేలనూఁది జోహారు లర్పించువారి డాసినతఱి నెవ్వనికి
భయభక్తు లుప్పతిల్లకుండు? మోఁకఱించుటయు వేఁడికో
లును గ్రుడ్డినమ్మికలు గావని నాయాశయంబు. మఱియు
నాభక్తులు మోఁకఱించుట నిరర్థక మ్మగు పాషాణము
నకా? కాదు! కాదు! తదర్థమైనభగవానునకు. వా రిట్టి
విగ్రహారాధనంబుచే భగవన్మహిమను గుంచక పెంచు
చున్నా రనియ నాతలంపు. తత్రత్యము లగు పురాతన
దేవాలయముల గొప్పతనము నే నింకను మఱవనైతి. ౬

# ౨౮ పట్టా పుట్టినది - కాని పిమ్మట?

తే. న్యాయశాస్త్రంబు చదువంగ నాంగ్లభూమి
కేను వెడలితిఁ గాని యద్దానిగుఱించి
యింతకున్మున్ను వివరించి యెఱుఁగనైతిఁ
దదృణభారంబు నిచ్చోటం దలఁగువాఁడ.

వ. బారిష్టరుపరీక్షకుం జదువువిద్యార్థికి నియతకాలపరిపాలనంబును బరీక్ష లొసంగుటయు ననురెండుకట్టడలు గలవు; పరీక్షకుం జదువవలసిన కాలంబు మూఁడేఁడు లయ్యది యీరాఱుపాళ్ళుగా విభక్తమై యుండు నందలిప్రతి భాగంబునందును విందు లిర్వదినాల్గు ప్రవర్తిల్లు నం దథమ మాఱువిందులకైనను బరీక్షార్థి యేఁగునేని యతండు నియత కాలపరిపాలన మొనరించినట్ల యెన్నంబడు; వెండియు. ౨

సీ. తొలుతొల్త నియ్యావుతలయందు గురుశిష్యు
లొండొరు భాషించుచుండు తెలుగు
వ్యాఖ్యానము లొనర్చు నాచారమును బ్రవ
ర్తిల్లుచుండెడివి; తత్క్రియలవలనఁ
జదువుగోరెడివారు చదురు లౌనని ప్రశం
సించుపోల్కి నుపన్యసించు వెరవు
గణుతికెక్కినలౌకికజ్ఞానమును దగు
నాణియమ్ము గడించి రాణ సెందు

ఆ. వార; లేఁ బఠించువడి కవెల్లఁ దొలంగ
గురుఁడు శిష్యు నెడసి కూరుచుండెఁ
దత్ప్రయోజనంబు దవ్వయ్యె నడవడి
యొండె సాగివచ్చుచుండెఁ జెడక. 3

వ. పూర్వాచారపరాయణం బగు నాంగ్లదేశమున కయ్యది సహజలక్షణంబ; మఱియు. ౪

క. పలలాహారముతోడన్
బలుదినుసులమధువుతోడఁ బ్రాయికముగ విం
దులు సాగు, నందు నాకుం
గలదుగదా! రొట్టెముక్క కాలము గడపన్. ౫

క. ఇటు విందులు గుడుచుటచే
నెటు బారిష్టరుపదంబు నెనయుదురో యి
ప్పటికిం దెలియద నా; క
ప్పటియుఁ దత్పట్ట మంద వలచినవారల్. ౬

తే. చదువవలయుపొత్తమ్ములు చాల సులువు
లగుట బారిష్టరునకు హాస్యంపుఁబేరు
రెక్కొనియెఁ "దిండిపోతుబారిష్ట" రంచు
నెల్లరికి వానికందువ తెల్లమయ్యె. ౭

వ. మఱియుఁ బాఠ్యగ్రంథములకంటెఁ బరీక్షావిధానంబు తద్దయు సులభంబు. ప్రతిమాసత్రయమ్మునందు నొక్కపరిశీలనంబు జరగుచుండుఁ దదధికారు లెంతయు నుదారులై యుందు రయ్యభ్యర్థులలోఁ గనిష్ఠము నూర్వురకు నెనుబండ్రు విజయలక్ష్మిం జేపట్టువారు. కావుటంజేసి విద్యార్థులు వర్షత్రయంబున న్మాసత్రయంబు శ్రమింపడినఁ గృతార్థు లయ్యెడివా రనుట యతిశయోక్తి కానేరదు. కాని నే నిట్టి నామమాత్రవిజయమ్మునకుఁ దనివిసెందక పఠనీయముల నెల్ల సవిశేషమ్ముగఁ జదువనెంచితి నట్లు సేయమి వంచన యని నాయాశయంబు. నే నింతకుమున్న "లండను మెట్రిక్యులేషను" పరీక్షలో లాటినుభాష నేర్చియుంటిఁ గాన "రోమన్"న్యాయశాస్త్రంబు నబ్బాసయంద చదివితి

నియ్యది దక్షిణాఫ్రికా కేఁగినతఱి నా కెంతయుం దోడు
పడియె నిట్లుశ్రమించి నేఁ బరీక్షలో గెలుపొందితి నంత. ౮

తే. * కాశ్యపీ ధాత్రు వసు నిశాకాంతసంఖ్యఁ
గ్రైస్తవశకాబ్దము వెలుంగుకాలమందు
షష్ఠమాసంపుదశమవాసరమునందు
బిరుదపట్టంబు నాకు లభించు టాయె. ౯

వ. కాని యింతకష్టించినను న్యాయస్థానంబునందు నోరువిప్ప నర్హుండఁ గాఁజాల నను నుత్తలపాటు నాచిత్తంబున హత్తుకొనె నయ్యవస్థ నెల్ల వివరింప వేఱొం డధ్యాయమ్ము వలయు. ౧౦

---

* ౧౮౯౧ వ సంll జూను ౧౦ వ తేది.

## ౨౫ నా బెంగ

క. బారిష్టరుపట్టము చే
కూరుట సుకరంబ కాని కోర్టులలోనన్
బారిష్టరుగా రాజిలు
టారయ నెల్లరికి సాధ్య మయ్యెడి పనియే.

ఆ. మొదటినుండి తుట్టతుదిదాఁక నే ధర్మ
శాస్త్రసూత్రకోటిఁ జదివినాఁడఁ
గాని రచ్చలందుఁ గమనీయఫక్కి వా
దించునట్టివెరవుఁ గాంచనైతి. ౨

ఆ. శ్రద్ధ వెలయ ధర్మసిద్ధాంతములు నేఱిం
గితిని గాని యెట్టితతులఁ వాని
వాదమం దిముడ్పవలయు నయ్యోడికంబు
నే నొకింతయేని యెఱుఁగకుంటి. ౩

వ. "లాఁతివారికి నొప్పమి చొప్పడకుండునట్లు నీవస్తువు నుపయోగించుకొ" మ్మనునది యొకధర్మవచనంబు. ఇయ్యది తనవ్యాజ్యగానికిలాభించుట కెట్లుపయోగింపవలయునో నాకెఱుకవడదాయె నేతత్సిద్ధాంతశీర్షికకుం జెందిన సుప్రసిద్ధములగు వివాదమ్ములఁ బెక్కింటిఁ బఠించితిఁ గాని యీధర్మసూక్తి వాదాడువేళ నుపయోగించునను నమ్మిక నయ్యావిహత్తింపఁజాలవయ్యె; మఱియు. ౪

సీ. చదువనైతిని న్యాయశాస్త్రంబు భారత
దేశసంబంధిని లేశమైన
* మనవిపత్రంబు నెమ్మయి సంతరింపంగ
వలయు నవ్వారి వింత తెలియనైతి
నడివాఁక సుడిసీటఁ బడి తల్లడంబందు
కై వడి నుంటి నక్కాలమందు
వింటిఁ గోర్టులలోన వీరవిహారంబు
సలుపుచుండు "ఫిరోజిషా" యటంచు

* ప్లయింటు.

ఆ. ఆంగ్లభూమి నెట్టు లతఁ జెట్టినేర్పు నా
ర్జించె నొక్కఁ యని విచిత్రి మంది
యతనిపగ్గె నాకు నబ్బ దీపుట్టువం
దిది యథార్థ మంచు నెంచికొంటి. ౫

క. ఆపిదప న్యాయవాది
వ్యాపారము పొట్టకూటి నై నను నాకుఁ
జేపఱుపంగలదో? యను
ద్వాపర మెసరేఁగి నన్ను దందడివెట్టెఁ. ౬

క. ఈసందియములు న్యాయా
భ్యాసం బొనరించుకాలమందే నను బల్
గాసింబెట్ట వచించితి
నాసంగడికాండ్రి కిమ్మనస్తాపంబుఁ. ౭

తే. అంత నాచింత నెఱిఁగి యిట్లనియె మిత్రి
మొక్కరుండు "దాదాభాయియొద్ది కేఁగి
యతనిహితబోధనము నందు మమ్మహాత్ముఁ
డతులరాగంబు సూపు విద్యార్థి యనిన." ౮

సీ. ఆంగ్లదేశమ్మున కరుగుకాలమ్మున
నారోజిమహనీయునకు నొకండు
పరిచయలేఖ సంపాదించుకొనిపోయి
తి నటంచుఁ దొలుత నే తెల్పినాఁడ

ఆకమ్మఁ బెక్కునాళ్లైనపిమ్మట వెల్వ
రించితిఁ బురుషవరేణ్యు నతనిఁ
గనుఁగొన నెంతవాఁడను నేను! విద్యార్థి
జనులకష్టమ్ముల సౌఖ్యములను

ఆ. దెలియ సంఘమొండు నిలిపె నతండు త
త్సభల కెల్ల నేను జనుచునుందు
మఱియు నమ్మహాత్ము మాటాడురచ్చల
కెల్ల నేఁగి వేడ్క వినయువాఁడ. ౯

క. అతనికి విద్యార్థులదెస
నతులం బగు కూర్మి వెలయు నలవిద్యార్థుల్
సతతంబు భక్తిభావము
జతపడఁ గీర్తింతు రతని సమ్యగ్విధులన్. ౧౦

సీ. ఇటు లుండ నొక్కనాఁ డెట్టెటులో సాహ
సించి యమ్మేటి దర్శించి కా[illegible]ని
పించితి నక్కమ్మ నంచితచరితుఁ డా
నౌరోజి పదపడి నన్ను మిగుల
నాదరించి మదీయ మగునుపదేశంబు
నావశ్యకం బగునప్పుడెల్ల
వచ్చి నీవు గ్రహింపవచ్చు నటంచు భా
షించెఁ బ్రేమరసంబు చిప్పిలంగ

ఆ. నట్టులయ్యుఁ దగినయక్కఱ లేనప్పు
డమ్మహాత్మునకు శ్రీమమ్ము నొసఁగు
టనుచితమ్ము గాన నయ్యవకాశంబు
నొదవుకొనుట కెపుడు నొల్లనైతి. ౧౧

తే. కావుటంజేసి నాచెల్మికాఁడు నీదు
చింత లన్నింటి నారోజిచెంత విన్న
వించుకొ మ్మన్నహితము నవ్వేళయందు
నియ్యకొనుటకు నేఁ దెగియింపనైతి. ౧౨

వ. అంత నొకానొకనెయ్యునిహితవు ననుసరించి సుప్రసిద్ధాంగ్లేయన్యాయవాది యగు "ఫ్రెడరిక్ పిఁకటు" సన్నిధికిం జని నాసందియములనెల్ల నతనితోడ విన్నవించితి నతండు భారతీయవిద్యార్థులయెడ నిష్కళంకంబును స్వార్థదూరంబునగు కూరిమిం జూపు నయ్యుదారచరితుండు నన్నుఁ దననెచ్చెలిం బోలె గారవించి నాదిగులు నెల్ల నొక్కనగవుతోఁ బటాపంచ లొనరించి యిట్లనియె. ౧౩

సీ. జగమునందు ఫిరోజిషా బదురుద్దీను
లను బోలుప్రతిభావిలాసు లెంద
ఱుందురు? తల్లడం బందకు సాధార
ణన్యాయవాదివై నడచుపొంటె

నక్కఱ లేదుసు మ్మెక్కుడు నేర్పు సా
మాన్యమైనట్టి ప్రామాణికతయు
నాసక్తియును జాలు సద్దాన విత్తంబు
గడియింపవచ్చుఁ బుష్కలముగాఁగఁ

తే. దగవు లన్నియుఁ జిక్కులం దగిలియుండఁ
బోవు పఠనీయపుస్తకంబులను గాక
వింతశాస్త్రంబులను జదివితివె? వాని
పేరు లెట్టివియో వినిపింపవయ్య. ౧౪

ఆ. అనుడు నాపఠించు నలఁతిశాస్త్రమ్ముల
నెఱుక సేయ నాతఁ డించుకంత
చప్పరించె, నదియు క్షణికంబ పిదప ని
ట్లనియె నతఁడు మందహాస మొలయ. ౧౫

తే. తెల్లమయ్యెను నాకు నీ యుల్లమెల్ల
నసదుసూ! లౌకికజ్ఞాన మరయ నీకు
నదియుపో! న్యాయవాదివై బ్రదుక నెంచు ౧౬
నాతనికి జీవగఱ్ఱయై యలరుచుండు.

క. వినుము పరీక్షాపాఠ్యము
లను మాత్రమె చదివి తీవు లాఁతికృతులఁ గ
న్గొన వైతివి తద్దోషమె
నిను నీ చందమున భీతినీరధి ముంచెన్. ౧౭

సీ. ఔర! భారతదేశచారిత్రమైన నీ
వెఱుఁగ వైతివి కదా! యింతవట్టు
తచ్చరిత్రము భారతమునఁ బుట్టినవాని
కరయ నవశ్యపాఠ్యంబుగాదె?
మొన మొన్న నీదేశమునఁ బ్రవర్తిల్లిన
సైనికవిప్లవచరితసైత
మయ్యరే! పఠియింపవైతివి మఱి న్యాయ
వాది మర్త్యస్వభావ మ్మెఱుంగ

ఆ. వలయు మొగమువంక తిలకించి నరుఁ డెట్టి
వాఁడొ గుఱుతుపట్టవలయు నట్టి
మార్గమెల్ల నెఱుఁగ మాఖికసాముద్రి
కమ్ముఁ జదువు టవసరమ్ము సుమ్ము. ౧౮

వ. అని పల్కి యతండు నా కవశ్యపఠనీయమ్ములగు గ్రంథ
మ్ముల పేళ్ళను వానిలభించుతావుల నొకకాగితమ్ముపై
వ్రాసియిచ్చి నన్ను వీడుకొలిపె; నిమ్మహనీయునిసల్పినమే
లెన్నఁడు న్మఱవఁజాల నతనిముందు నాసంక్షోభమ్ము
పంచబంగాళ మయ్యెఁ గాని యడుగుఁ గదలించినంతనే
వెండియు నయ్యది సాక్షాత్కరించె నంత నిలుసేరి మఱు
సటినాఁడ, సాముద్రికగ్రంథమ్ముల న్గొలిచి చదివితిఁగాని
నాకయ్యవి యెంత శ్రమంపడినను దురవగాహంబుల
యయ్యె నివ్విధంబున. ౧౯

క. అల "పిన్కటు" హితవచనం
బులు నాకు ఫలమ్ము నీకపోయినను విని
ర్మలమై విలసిలు నాతని
చెలిమి కడుంగడు శుభంబు చేకుఱఁ జేసెన్. ౨౦

తే. చిఱునగవు చిందులాడునగ్గఱువ మొగము
నతనియౌదార్యభరితమై యలరుమూర్తి
వానిపల్కినమధురంబులైననుడులు
మఱపునకు రావు నాకు జన్మంబునడుమ. ౨౧

క. మంచివకీలై ధన మా
ర్జించుటకు ఫిరోజిషాగరీయోమేధా
భ్యంచత్కౌశల మేటి క
టంచు నసామాన్యశక్తి యది యేలంచున్. ౨౨

తే మఱియు సాధారణంపుఁబ్రామాణికతయు
నోడలు వంచి పనుల్ దిద్దు నడవడికయు
న్యాయవాది కుండినఁ జాలు ననుచు నతఁడు
పలుకుహితమందు నాకు విశ్వాస మొదవె. ౨౩

క. ఈలక్షణములు రెంటం
బాలుండినవాఁడ నగుటఁ బాదుకొనియె నా
శాలత మన్మానసమునఁ
దూలెను నా బెంగ దూరదూరమ్మనకున్. ౨౪

వ. ఇట్లుండునంతలో నాకు బిరుదపట్టంబు లభించె నయ్యది ప్రాప్తించినమఱునాఁడ వలయుసుంకమ్ము నొసంగి లండను నగరోన్నతన్యాయస్థానంబున బారిస్టరులపట్టికలో నాపేరు చేర్పించికొని తదనంతరదినమ్మున. ౨౫

తే. చెలులవీడ్కోలు గైకొని సీమ విడచి
యమ్మనాడికకుం బయనమ్ముగట్టి
యెలమి తోలఁకాడఁ బొగయోడ నెక్కి వరుస
డాయవచ్చితి నేను బొంబాయి రేవు. ౨౬

క. రంగత్తుంగాభంగత
రంగాళిఁ జెలంగుచుండె రత్నాకర ము
ప్పొంగుచు నే * నావిరిపడ
వం గట్టెక్కితిని మిత్రవర్గము మెచ్చన్. ౨౭

* స్టీములాంచి.

# తప్పొప్పులు

| పేరట | బంతి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| ౩౫ | ౧౭ | నలుబది | నలువది |
| ౪౯ | ౫, ౬ | నితఃపూర్వమం<br>పెద్దన్న పెండ్లి | నింతకుమున్నె పెద్ద<br>యన్నకును పెండ్లి |
| ౭౨ | ౧౩, ౧౫ | కోర్కె | కోర్కె |
| ౭౯ | ౫ | తగదంచునన్మ<br>దాశయము | పోలని దనియ<br>నా తలఁపు |
| ౮౪ | ౧౬ | యోజనల్ | యోచనల్ |
| ౧౦౭ | ౧౭ | పడక | పడుక |
| ౧౫౯ | ౧౪ | యొక్కటి | యొకటి |
| ౧౬౧ | ౧ | నాఁటిరేయు | నాఁటిరేయి |
| ౧౬౭ | ౧౦ | బరింప | పరింప |
| ౧౭౬ | ౧౦ | ననుసరించియు | ననుసరించియ |
| ,, | ౧౨ | ధరైక్య | ధరైక |
| ౧౮౫ | ౧౫ | యతఁడు | యితఁడు |
| ౨౨౬ | ౧౪, ౧౫ | కానుపించితి | కానిపించితి |

ఇంకను అరసున్నల, బండిరాల వ్యత్యయములు కొన్నిగలవు. చదువరులు వానిని దిద్దుకొందురు గాక!